ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
సోమవారం 29, జనవరి 2024



సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట వద్ద ఉన్న రూ.వందల కోట్ల విలువ చేసే సదావర్తి మఠం భూములను పరులపరం చేసిన రెవెన్యూ అధికారుల పాపం పండింది. ఎట్టకేలకు వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను తహసీల్దార్లుగా రివర్షన్ చేసింది. ఇద్దరు విశ్రాంత తహసీల్దార్లు, మరో ముగ్గురు రెవెన్యూ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంది. రివర్షన్‌కు గురైన డిప్యూటీ కలెక్టర్లలో ఒకరు గతంలో ఒంగోలు ఆర్డీవోగా, డీఆర్‌డీఏ పీడీగా సుదీర్ఘకాలం పనిచేసిన మురళి ప్రస్తుతం అన్నమయ్య జిల్లా మదనపల్లి ఆర్డీవో కాగా.. మరొకరు గతంలో సంతనూతలపాడు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం గుంటూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న లలితకుమారి. రెవెన్యూ వర్గాల్లో ప్రస్తుతం దీనిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.

వేటుపడిన వారు వీరే..

గతంలో ఒంగోలు ఆర్డీవోగా పనిచేసిన మురళి, సంతనూతలపాడు తహసీల్దార్‌గా పనిచేసి ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న లలితకుమారిలను తహసీల్దార్‌గా రివర్షన్ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే విశ్రాంత తహసీల్దార్‌లు అమీర్ బాషా, గాంధీలకు పెన్షన్‌లో కోత విధించారు. ఇక అప్పట్లో పేర్నమిట్టలో పనిచేసి ప్రస్తుతం ముక్తినూతలపాడు వీఆర్వోగా ఉన్న వి.అంకిరెడ్డి, చోడవరం వీఆర్వోగా ఉన్న శ్రీదేవిలకు ఆరేళ్ల ఉద్యోగోన్నతుల నిలుపదలతోపాటు మూడు ఇంక్రిమెంట్లు కోత విధించారు. మరో రెవెన్యూ ఉద్యోగిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.

పాపం పండింది!

- సదావర్తి మఠం భూములు ఇతరులకు కట్టబెట్టిన వారిపై వేటు
- ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు తహసీల్దార్లుగా రివర్షన్
- ఒకరు గతంలో ఒంగోలు ఆర్డీవోగా, మరొకరు ఎస్ఎన్‌పాడు తహసీల్దార్‌గా పనిచేశారు
- ఇద్దరు విశ్రాంత తహసీల్దార్లు, మరో ముగ్గురు ఉద్యోగులపై చర్యలు
- ప్రస్తుతం భూమి విలువ రూ.300 కోట్లు

ఒంగోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సమీపంలోని సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట సర్వే నెంబరు 34లో సదావర్తి మఠానికి చెందిన 66.25 ఎకరాల భూమి ఉంది. దీని విలువ ప్రస్తుతం రూ.300 కోట్ల వరకూ ఉంటుంది. కాశీ యాత్ర చేసే భైరాగుల అవసరాలు తీర్చేందుకు 19వ శతాబ్దంలో కోసల్ దాస్ అనే వ్యక్తి ట్రస్టీగా రాజా వెంకటాద్రి అనే రాజు మఠం పేరుతో దానిని ఇచ్చారు. దీనిపై వచ్చే ఆదాయంతో భైరాగులకు భోజనం, వసతి కల్పించాలన్నది ఉద్దేశం. అయితే ఆ భూములు దుర్వినియోగం అవుతున్నాయని, అడ్డుకోవాలంటూ 1928లో ఉత్తర భారతదేశానికి చెందిన భైరాగులు కొందరు అప్పటి బాపట్ల న్యాయస్థానంలో కేసు వేశారు. విచారించిన కోర్టు 1933లో తీర్పు ఇస్తూ సదరు భూమిని ఈనాంగా పేర్కొంది. అమ్మే హక్కు ఎవరికీ లేదని, ట్రస్టు కిందనే ఉండాలని తెలియజేస్తూ కోసల్‌దాస్‌ను ట్రస్టీగా తొలగించాలని ఆదేశించింది. అనంతరం దాదాపు 80 ఏళ్లపాటు ఆ భూమి జోలికి ఎవ్వరూ వెళ్లలేదు.

వారసులతో పేరుతో కొందరు అమ్మకం

కోసల్ దాస్ వారసులమని 1984లో తమకు రైతువారీ పట్టాలు ఆ భూమికి ఇచ్చారంటూ కొందరు తెరమీదకు వచ్చారు. వారిలో నలుగురి పేరుతో 2008లో ఆ భూమి రిజిస్ట్రేషన్ జరిగింది. వాటికి నిరభ్యంతర పత్రం కోసం వారు దేవదాయ శాఖకు దరఖాస్తు చేసుకోగా ఆర్ఎస్ఆర్ దస్త్రాల ప్రకారం అవి మఠం భూములని, అదేసమయంలో రైతు వారీ పట్టాలు కూడా ఉన్నాయని ఇక్కడి సహాయ కమిషనర్ నివేదించగా కమిషనర్ మాత్రం ఎన్‌వోసీ ఇచ్చారు. అనంతరం వారి నుంచి కొనుగోలు చేసిన వారికి పాసు పుస్తకాలు వచ్చాయి. దీనిపై 2010లో అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. భూ కుంభకోణంగా గుర్తించిన నాటి కలెక్టర్ రిజిస్ట్రేషన్‌ను అలాగే ఎన్‌వోసీని రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. పాసుపుస్తకాల రద్దు కోసం ఆర్డీవో కోర్టులో వేయాలని అప్పటి సంతనూతలపాడు తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం దేవదాయ శాఖ వారు కూడా ఆ భూముల పాసుపుస్తకాల రద్దు కోరుతూ ఆర్డీవోకు లేఖ రాయగా, 2012లో తహసీల్దార్ కూడా ఆర్డీవోకు అప్పీల్ చేశారు. ఈ లోపు ఆ భూములు చేతులుమారగా కొన్నవారు పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేశారు. రెవెన్యూ అధికారులు తేల్చడం లేదంటూ వారు కోర్టును ఆశ్రయించడంతో రెండు నెలల్లో సెటిల్ చేయాలని ఆదేశించింది. దీంతో దేవదాయ కమిషనర్ ఇచ్చిన ఎన్‌వోసీ ఆధారంగా రెవెన్యూ అధికారులు పాసు పుస్తకాలు ఇచ్చేశారు. అనంతరం భూ కన్వర్షన్ కూడా జరిగింది. అప్పుడే పెద్దమొత్తంలో అధికారులు నగదు రూపంలో లబ్ధిపొందినట్లు సమాచారం.

నాలుగేళ్లుగా చర్యలు కరువు

కలెక్టర్‌గా సుజాతశర్మ పనిచేసిన సమయంలో మరోసారి ఆ భూములపై పదే,పదే ఫిర్యాదులు అందాయి. దీంతో ఆమె అప్పటి ఆర్డీవో కె.శ్రీనివాసరావును విచారించాలని ఆదేశించారు. విచారించిన ఆయన భూములు మఠానికి చెందినవేనని, ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడానికి వీలులేదని తేల్చారు. భూ అక్రమాల్లో



ఎవరెవరి పాత్ర ఏస్థాయిలో ఉందో వివరంగా నివేదించారు. దీంతో మొత్తం వ్యవహారాన్ని ప్రభుత్వానికి నివేదించిన అప్పటి కలెక్టర్ సుజాత శర్మ రెవెన్యూ అధికారులపై చర్యలకు సిఫారసు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారు ఇచ్చిన సమాధానాలకు ఉన్నతాధికారులు సంతృప్తి చెందక మరోసారి జేసీని విచారణకు ఆదేశించారు. జేసీ విచారణలోనూ సదరు భూముల విషయంలో అక్రమాలు జరిగాయని, సదావర్తి మఠానికి చెందిన భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని తేల్చి నివేదించారు. అయితే నాలుగేళ్లుగా తదుపరి చర్యలు కరువయ్యాయి.

ఇప్పుడు బయటపడిన ఫైల్



మఠం భూముల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఒకరైన ఒంగోలు ఆర్డీవో కార్యాలయ ఏవో అమీర్‌బాషా రిటైర్మెంట్ అనంతరం బెనిఫిట్ల కోసం కోర్టును ఆశ్రయించడంతో మళ్లీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అమీర్ సమస్య పరిష్కరించాలని కోర్టు ఆదేశించడంతో రెవెన్యూ ఉన్నతాధికారులు పాత ఫైల్‌ను బయటకు తీశారు. మొత్తం పరిశీలన అనంతరం సదావర్తి మఠం భూములను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే అధికారం లేదని తేల్చి బాధ్యులైన రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై వేటు వేశారు.

జేసీగా గోపాలకృష్ణ

నంద్యాల కలెక్టర్‌గా శ్రీనివాసులు బదిలీ



ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 28 : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా రేణంకి గోపాలకృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ శ్రీనివాసులు నంద్యాల జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. గోపాలకృష్ణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషరేట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా పారసంబ గ్రామానికి చెందిన ఆయన విజయనగరంలోని మహారాజ కళాశాలలో ఉన్నత విద్యనభ్యసించారు. కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2016 సివిల్ సర్వీసెస్‌లో 3వ ర్యాంకు సాధించారు. తొలిపోస్టింగ్ గూడూరు సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బదిలీ అయిన శ్రీనివాసులు గత ఏడాది ఏప్రిల్‌లో ఇక్కడ జేసీగా బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారంతోపాటు భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. మరోవైపు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆయనకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి నంద్యాల కలెక్టర్‌గా నియమించింది.

బెదిరింపులకు భయపడం!

మేమేమీ బచ్చాలం కాదు

ప్రతిసారీ మాయ చేయడం నీకు అలవాటు

రెండు నెలల్లో ఎన్నికలనగా ఇప్పుడు ఇళ్ల పట్టాలు గుర్తుకొచ్చాయా?

బాలినేనిపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల ఫైర్



ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 28 : 'ఒంగోలులో ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకుంటే నా ఇల్లు ముట్టడిస్తానని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడటం ఆయన చేతగానితనానికి నిదర్శనం. ఇలాంటి బెదిరింపులకు నిక్కర్లు వేసుకున్న పిల్లలు భయపడతారేమో కాని నేను కాదు. ఇంతకాలం పేదలకు ఇళ్ల పట్టాల విషయం గుర్తుకురాని ఆయనకు మరో రెండు నెలల్లో ఎన్నికలనగా జ్ఞప్తికి వచ్చింది. ఇదంతా నాటకం' అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ అన్నారు. ఆదివారం నగరంలోని కర్నూలురోడ్‌లో జరిగిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బాలినేనిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతి ఎన్నికల సమయంలో పట్టాలు, రోజూ తాగునీరు అని మోసపు మాటలతో మాయచేయడం ఆయనకు అలవాటన్నారు. యరజర్ల వద్ద ఇళ్ల పట్టాల పంపిణీని టీడీపీ వాళ్లు అడ్డుకున్నారని మాట్లాడటం అవివేకమని చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అక్కడ టిడ్కో ఇళ్లు కట్టాలని స్థల పరిశీలన చేశామన్నారు. ఆ స్థలం అప్పటికే ఐరన్ ఓర్ కంపెనీకి కేటాయించడం వలన తాము కూడా ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నట్లు చెప్పారు. అది తెలియకుండా ప్రజలను మభ్యపెట్టి తన పబ్బం గడుపుకునేందుకు బాలినేని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇళ్లపట్టాల పేరుతో అబద్ధపు హామీలు ఇవ్వడం, తన చేతగానితనాన్ని టీడీపీపై నెట్టడం ఆయనకు అలవాటేనన్నారు. నాలుగున్నరేళ్లుగా గుర్తుకురాని పేదలు మరో రెండు నెలల్లో ఎన్నికలు వస్తున్న తరుణంలో గుర్తుకువచ్చారా అని ప్రశ్నించారు. 'ఇంతవరకూ ల్యాండ్ ఎక్విజేషన్ చేయలేదు. రైతులకు డబ్బులు ఇవ్వలేదు. ఎన్‌వోసీ లభించలేదు. ప్లాట్ల కేటాయింపు జరగలేదు. కానీ వచ్చే నెలలో పట్టాలు ఇస్తామని బాలినేని చెప్తున్నారు. ఇదంతా నాటకం' అని దామచర్ల అన్నారు. మేయర్ గంగాడ సుజాతపైనా దామచర్ల ఘాటైన విమర్శలు చేశారు. రూ.5వేలు, రూ.10 వేలకు కక్కుర్తిపడే మేయర్ తన గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.



మోపాడులో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయం

బిల్లులిస్తేనే తాళాలిస్తాం!

- తెగేసి చెప్తున్న కాంట్రాక్టర్లు
- పోటీపడి ప్రభుత్వ భవనాల నిర్మాణం
- అప్పులు తెచ్చి పనులు
- వడ్డీలు చెల్లించలేక అవస్థలు
- వైసీపీ ప్రభుత్వం నిండాముంచిందని ఆవేదన

పామూరు, జనవరి 28 : వైసీపీ పాలకుల మాటలు విని ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు ముందుకొచ్చిన కాంట్రాక్టర్లు, ఆపార్టీ నాయకులు బిల్లులు అందక లబోదిబోమంటున్నారు. నిర్మాణాల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక అల్లాడుతున్నారు. ప్రభుత్వ అసమర్థ చర్యలతో నిండా మునిగామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బిల్లులు ఇస్తేనే కార్యాలయాల తాళాలు ఇస్తామని తేల్చిచెప్తున్నారు. మండలంలో ఒక్కో సచివాలయానికి రూ.40లక్షల వంతున 19 సచివాలయాలు, రూ.21.80లక్షల వంతున 19 ఆర్బీకే కేంద్రాలు, రూ.17.5లక్షల వంతున 18 హెల్త్ సబ్‌సెంటర్లు, రూ.17.67లక్షల వంతున 14 పాల కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామ సచివాలయాలకు డిజైన్‌లు మార్చడంతో రూ.40లక్షలతోపాటు అదనంగా మరో రూ.7లక్షల వరకు ఖర్చు పెరిగింది. ఉపాధి హామీ నిధులు రూ.40లక్షలు, అదనంగా రూ.7లక్షలు గ్రామ పంచాయతీ నిధులను ఖర్చుచేయాలని ప్రభుత్వం జీవో ఇచ్చింది. అసలే ఆర్థిక ఇబ్బందులు పడుతున్న గ్రామ పంచాయతీలు రూ.7లక్షలు ఇచ్చేందుకు సుముఖత చూపలేదు. దీంతో కొన్నిచోట్ల ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్లే భరించారు. కానీ అందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదు. మరికొన్నిచోట్ల ఉపాధి బిల్లులు రాకపోవడం, వైసీపీ ప్రభుత్వం మీద నమ్మకం కోల్పోవడంతో ఎక్కడ పనులు అక్కడే కాంట్రాక్టర్లు నిలిపివేశారు. బిల్లులు చెల్లిస్తేనే తాళాలు ఇస్తామని చెప్పడంతో పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

ఐదు సచివాలయ భవనాలు మాత్రమే పూర్తి

జగన్‌రెడ్డి మాట తప్పడు.. మడమ తిప్పడు అన్న నమ్మకంతో ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు కాంట్రాక్టర్లు, వైసీపీ నాయకులు మొదట్లో పోటీపడ్డారు. 19 సచివాలయాల్లో ఈ నాలుగేళ్ల 9 నెలల్లో కేవలం పామూరు 1, వగ్గంపల్లి, నుచ్చుపొద, కంభాలదిన్నె, బొట్లగూడూరు సచివాలయ భవనాలు మాత్రమే పూర్తయి ప్రారంభించారు. మిగతా నిర్మాణాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. పామూరులోని 3 గ్రామ సచివాలయాలు పాత ప్రభుత్వ వైద్యశాల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. పామూరు పట్టణానికి ఇప్పటికే సీహెచ్‌సీ ఉంది. దాన్ని కొత్తభవనంలోకి మార్చారు. పాత భవనాల్లో మూడు గ్రామ సచివాలయాలను నిర్వహిస్తున్నారు. సుమారు పది నెలల క్రితం పామూరుకు మరో పీహెచ్‌సీ మంజూరైంది. అయితే సీహెచ్‌సీకి ఉన్న పాత భవనాల్లో సచివాలయాలు నిర్వహిస్తుండంతో పీహెచ్‌సీకి గూడు కరువైంది. ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడి స్వగ్రామమైన మోపాడులో గ్రామ సచివాలయం అసంపూర్తిగా ఉంది. బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు.



బిల్లులు చెల్లించాలని కోరుతున్న కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు

బిల్లులు చెల్లించి ఆదుకోవాలి

ఉపాధి హామీ, పంచాయతీ గ్రాంట్‌తో నిర్మించిన సిమెంట్ రోడ్లకు బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కొండారెడ్డిపల్లికి చెందిన వైసీపీ కాంట్రాక్టర్ పారా వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తాను వగ్గంపల్లి పంచాయతీ పరిధి కొండారెడ్డిపల్లిలో 2018లో ఉపాధి హామీ, గ్రామ పంచాయతీ గ్రాంట్ రూ.10లక్షల అంచనాలతో రెండు సిమెంట్ రోడ్లు నిర్మించారు. ఇప్పటివరకు రూ.6 లక్షలు చెల్లించగా, పంచాయతీ గ్రాంట్ నుంచి రూ.40 వేలు రావాల్సి ఉంది. సర్పంచ్‌ను అడిగితే తాను ఇవ్వలేనని తనకే డబ్బులు రావాలని చెప్తున్నారని వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు ఉపాధి హామీ నుంచి రూ.2.64లక్షలు రావాలని తెలిపారు. అప్పులు తెచ్చి రోడ్లు నిర్మిస్తే నేటికీ బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీలు కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు.

స్థానికేతరులు వద్దు అంటూనే బాలినేనికి మద్దతు

క్లైమాక్స్‌లో ఉత్కంఠ

తన పేరు ప్రస్తావనపై మాజీ మంత్రి సీరియస్



బేస్తవారపేటలో సమావేశమైన వైసీపీ ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు

గిద్దలూరు వైసీపీలో సరికొత్త ట్విస్ట్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

గిద్దలూరు వైసీపీలో సరికొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలను అటు,ఇటు మార్చే ప్రయత్నాలకు అధిష్ఠానం శ్రీకారం పలకగా స్థానిక నాయకులు అప్రమత్తమయ్యారు. మరోసారి స్థానికేతర అభ్యర్థిని నిలిపితే సహకరించబోమంటూనే ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని అయితే మాత్రం ఓకే అని చెప్పేశారు. స్థానికేతరులు వద్దు అంటూనే వారు బాలినేని మాత్రం ముద్దు అనడంలో ఆంతర్యం ఏమిటన్న చర్చ ఆరంభమైంది. అయితే తనపేరును ఎందుకు ప్రస్తావించారంటూ బాలినేని అక్కడి నాయకులకు ఫోన్‌చేసి సీరియస్ అయినట్లు సమాచారం.

నేతల ప్రత్యేక సమావేశం

ఎంపీపీలు, జడ్పీటీసీలు సమావేశమైన గదిలో మీడియాతో మాట్లాడుతుండగా వేరేగదిలో టికెట్ ఆశిస్తున్న నాయకుల్లో కొందరు భేటీ అయ్యారు. రమణారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి అలాగే లింగారెడ్డి సోదరుడు ఆ సమావేశంలో పాల్గొన్నారు. వారంతా కూడా మనలో ఒకరిమే టికెట్ తెచ్చుకోవాలన్న నిర్ణయంతో ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. టికెట్ ఆశిస్తూ రేసులో ఉన్నవారిలో ఐవీ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి ఆ సమావేశానికి రాకపోగా వివిధ కారణాలతో వారు అందుబాటులో లేరని చెబుతున్నారు. గిద్దలూరు మండలానికి చెందిన వంశీధర్‌రెడ్డి అనే ముఖ్య నాయకుడు కూడా గైర్హాజరయ్యారు. ఇంకోవైపు స్థానికేతరుడిని పంపవద్దని అంటూనే బాలినేని అయితే మాకు ఓకే అని వారు చెప్పడం చర్చనీయాంశమైంది. ఎలాగూ స్థానికేతరుడిని పంపిస్తున్నారన్న నమ్మకంతో తమకు ఇష్టమైన బాలినేని పేరు అలా చెప్పారా? లేక ఎవరైనా చెప్పించారా? అన్న అనుమానాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. ఆదివారం సాయంత్రం విషయం తెలుసుకున్న బాలినేని అక్కడి నాయకులకు ఫోన్‌చేసి తన పేరును ఎందుకు ప్రస్తావించారంటూ మండిపడినట్లు తెలిసింది.

రెడ్డి సామాజికవర్గం వారికే ఇవ్వాలని డిమాండ్

గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు లేక ఆయన కుమారుడిని మార్కాపురం నుంచి పోటీ చేయించి మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరు పంపాలని వైసీపీ అధిష్ఠానం భావించింది. సోమ, మంగళవారాల్లో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డితో జగన్ మాట్లాడిన తర్వాత ఈ విషయమై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో స్థానికేతర నాయకుడికి మరలా అవకాశం ఇవ్వొద్దని, స్థానికుల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని నియోజకవర్గంలోని నాయకులు డిమాండ్ చేయడం ప్రారంభించారు. రెడ్డి సామాజికవర్గానికే అవకాశం ఇవ్వాలని కూడా వారు కోరుతున్నారు. రేపోమాపో అభ్యర్థి ఎంపికపై సీఎం తుది నిర్ణయం తీసుకోనుండటంతో వివిధ రూపాల్లో తమ డిమాండ్‌తో అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చేందుకు వారు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా టికెట్ ఆశిస్తున్న రెడ్డి సామాజికవర్గం నాయకులు వెనకుండి నియోజకవర్గంలోని పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీల ద్వారా తమ డిమాండ్‌ను వెల్లడించే ప్రక్రియను చేపట్టారు. ఆదివారం బేస్తవారపేటలో వారంతా సమావేశమయ్యారు. అర్ధవీడు జడ్పీటీసీ, బేస్తవారపేట, కొమరోలు ఎంపీపీలు ఆ సమావేశంలో ముఖ్యులుగా కనిపించారు. వారితోపాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఉన్న మరికొందరు కూడా సమావేశమై మరోసారి నియోజకవర్గేతర నాయకుడిని రంగంలోకి తేవద్దని, అలాచేస్తే తాము సహకరించబోమని తేల్చిచెప్పారు. గత ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే రాంబాబును పోటీకి దింపినా జగన్ కోసం సహకరించామని అయితే ఆయన మార్కాపురంలో నివాసం ఉంటున్నందున నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు ఇబ్బందిపడ్డారని కొమరోలు ఎంపీపీ బహిరంగంగానే చెప్పారు. నియోజకవర్గ పార్టీలో సత్తా ఉన్న నాయకులు లేనట్లు బయట ఉన్న నాయకులను మాపై ఎందుకు రుద్దుతారని ప్రశ్నించారు.

రాంబాబు స్థానికుడేనంటూ వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం

మరోవైపు నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా గ్రూపుల్లో ఎమ్మెల్యే రాంబాబు స్థానికుడే అంటూ పెద్దఎత్తున ఆయన అభిమానులు ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన మార్కాపురంలో స్థిరపడినా నియోజకవర్గంలోని కంభం మండలంలో పుట్టిపెరిగిన వ్యక్తి అని అందులో పేర్కొన్నారు. ఆయన హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని, ఆయనను స్థానికుడిగానే తాము గుర్తిస్తున్నామంటూ ఆయన అభిమానులు పెద్దఎత్తున ప్రచారం చేపట్టారు. దీంతో పోటీకి దూరమన్న రాంబాబు తిరిగి పోటీకి సిద్ధంకావటం, మార్కాపురంలో పోటీచేయాలనుకున్న ఆయనకు మద్దతుగా గిద్దలూరులో స్థానికుడని పోస్టింగ్‌లు పెట్టడం, స్థానికేతరుడు తమకు వద్దని చెప్తున్న నాయకులు బాలినేనికి ఓకే చెప్పటం, తాను మార్కాపురానికి పరిమితమవుతానని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి భీష్మించుకుని కూర్చోవడం తదితర అంశాల నేపథ్యంలో గిద్దలూరు వైసీపీ అభ్యర్థి ఎంపిక ఏమలుపు తిరుగుతుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

నల్ల జెండాలు పట్టి.. కళ్లకు గంతలు కట్టి

- సెర్ప్ ఉద్యోగుల ఆందోళన
- మోకాళ్లపై నిలబడి నిరసన
- సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్



కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిరసన తెలుపుతున్న వైకేపీ ఉద్యోగులు

ఒంగోలు నగరం, జనవరి 28 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ సెర్ప్, వైకేపీ ఉద్యోగులు పలురకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో వారు చేపట్టిన సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ధర్నాను కొనసాగించారు. శిబిరంలో అందరూ మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని, చేతిలో నల్లజెండాలను పట్టుకుని అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులర్ చేయాలని, చనిపోయిన ప్రతి ఉద్యోగి కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని, విధుల్లో ఉన్నకాలంలో చనిపోయిన వారి కుటుంబానికి కారుణ్య నియామకం చేపట్టాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని వారు నినదించారు. ధర్నా శిబిరం వద్ద సెర్ప్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కార్యదర్శి గుంజి రాంబాబు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని గత కొన్నేళ్లుగా ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినా నిర్లక్ష్యం వహించిందన్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమాల్లో జె.నారాయణ, కృష్ణ, గోపీనాథ్, ఆదిశేషు, సుధాకర్, స్వర్ణలత, రజియాబేగం, చెంచులక్ష్మి, నరేష్, సుబ్బారావు, కృపారావు పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే సత్ఫలితాలు



మాట్లాడుతున్న కాంతారావు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 28: అందురూ కలిసి ఐకమత్యంగా పోరాడినప్పుడే సత్ఫలితాలు సాధించగలుగుతామని జిల్లా హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు కాంతారావు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని యూటీఎఫ్ ఆఫీసులో సమగ్ర శిక్ష ప్రకాశం జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంతారావు మాట్లాడుతూ సంఘ సభ్యులు ఐక్య పోరాటం చేయటం వల్ల ప్రభుత్వంతో జరిపిన చర్చలు సానుకూలంగా జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొండారెడ్డి, యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి వీరాంజనేయులు, మహేష్, శ్రీదేవి, వెంకామయ్య, ఏడుకొండలు, వినయ్‌కుమార్, సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


దామచర్ల జనార్దన్ సమక్షంలో పార్టీలోకి చేరిన కాలనీవాసులు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 28: ఒంగోలు నగరంలోని 3వ డివిజన్ బలరాం కాలనీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక గుంటూరు రోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో వారు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌ను కలిసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జగరలేదని, తమకు ఎలాంటి సంక్షేమం అందలేదన్నారు. తెలుగుదేశం పార్టీలోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని వారు పేర్కొన్నారు. అనంతరం దామచర్ల మాట్లాడుతూ టీడీపీలో తగిన గుర్తింపు, అలాగే అవసరమైన సంక్షేమం అందుతుందని, అన్ని వేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ టీడీపీ నాయకులు, మైనార్టీ విభాగం నాయకులు పాల్గొన్నారు.

సూర్యయజ్ఞం రాజ్యాంగ విరుద్ధం

ఒంగోలు(కల్చరల్), జనవరి 28: పాఠశాల విద్యార్థులతో సూర్యయజ్ఞం నిర్వహించటం రాజ్యాంగ విరుద్ధమని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు మొగల్ కాలేషా బేగ్ పేర్కొన్నారు. ఆదివారం ఇందుకు సంబంధించి వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఫిబ్రవరి 15వ తేదీ 3 వేల మంది విద్యార్థులతో సూర్యయజ్ఞం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారని, అయితే పాఠశాలలో ఎటువంటి మతప్రమేయం ఉండకూడదని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(హెచ్)కు విరుద్ధమన్నారు. దీనిని యజ్ఞం అని కాకుండా వ్యాయామంగా పేర్కొంటే బాగుటుందని వారు పేర్కొన్నారు.

వచ్చే నెలలో డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ఎన్నికలు


మాట్లాడుతున్న సంఘ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 28: జిల్లా డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ఎన్నికలను ఫిబ్రవరి నెలలో నిర్వహించాలని అసోసియేషన్ నిర్ణయం తీసుకున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి పావులూరి శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఒంగోలులోని జిల్లా కెమిస్ట్‌భవన్‌లో ఈసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంఘాలు సభ్యత్వం పూర్తి చేయలేదని, అటువంటి వారు ఫిబ్రవరి 4వ తేదీ లోపు సభ్యత్వాలను పూర్తి చేయాలన్నారు. అదేనెలలో 5, 6 తేదీలలో ఓటర్ల లిస్ట్ తయారు చేస్తామన్నారు. ఎన్నికల అధికారిగా సి.లక్ష్మణకుమార్ రెడ్డిని, సహాయ అధికారులుగా నరసింహారావు, కొల్లా మధులను నియమిస్తూ సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది.

చలో విజయవాడ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 28: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 5వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పూరు మాధవరావు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఇతర సభ్యులతో కలిసి ఆయన ఆదివారం ఒంగోలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పర్రె వెంకటరావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల విషయంలో ప్రభుత్వం సాచివేత ధోరణి అవలంబిస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోపు సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ పునరుద్ధ రిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాటతప్పారన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించకుండానే 12వ పీఆర్సీని నియమించి, జీవో నెంబర్ 117 ద్వారా ప్రాథమిక పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలగా మార్చారని ఆయన ఆరోపించారు.

విద్యుదాఘాతానికి గురైన బాలుడు

దొనకొండ, జనవరి 28 : తోటి పిల్లలతో ఆడుకుంటున్న బాలుడు విద్యుత్ షాక్‌కు గురైన సంఘటన దొనకొండ మంలంలో బాదాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. బాదాపురంలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనంపై పిల్లలు ఎక్కి ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో బందెల చరణ్ అనే బాలుడు ఆడుకుంటూ భవనం సమీపంలో చేతికందేలా ఉన్న కరెంట్ తీగలకు తగిలాడు. దీంతో షాక్‌కు గురై శరీరం కాలిపోయి కేకలు వేస్తూ కిందపడిపోయాడు. ఈ విషయయాన్ని గుర్తించిన బంధువులు 108 సమాచారం ఇవ్వగా సిబ్బంది వెలుగొండయ్య, జాన్ పీటర్ అక్కడకు చేరుకొని ఈఆర్‌సీపీ సలహా మేరకు బాలుడు చరణ్‌కు వాహనంలో ప్రథమ చికిత్స అందిస్తూ వినుకొండ వైద్యశాలకు తరలించగా అక్కడ వైద్యం పొందుతున్నాడు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయం

వైసీపీ అబద్ధపు హామీలను ప్రజలకు వివరించాలి • క్లస్టర్ ఇన్‌చార్జులకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల దిశానిర్దేశం


ప్రజలతో కలిసి అభివాదం చేస్తున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 28: రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అయితే అధికార వైసీపీ అబద్ధపు హామీలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమైందని, దీనిని ప్రజలకు వివరించాల్సిన అవసరం పార్టీ శ్రేణులపై ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయలో 4, 10, 13 క్లస్టర్ ఇన్‌చార్జులతో దామచర్ల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ త్వరలోనే ఎన్నికల షెడ్యూలు రాబోతున్న నేపథ్యంలో ప్రతి నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. గత నాలుగున్నరేళ్ళుగా వైసీపీ చేసిన అరాచకాలను ప్రజలకు తెలియజేయడంతోపాటు, పెరిగిన ధరలతో ప్రజలు పడిన ఇబ్బందులు కూడా గుర్తు చేయాలన్నారు. ఒకవైపు నిత్యావసర ధరలు పెరుగుదల, ఆర్టీసీ, విద్యుత్ చార్జీల పెంపుతోపాటు ఇసుక మాఫియా వలన కార్మికులు పడిన ఇబ్బందులు, జగన్ బ్రాండ్‌ల మద్యంతో ప్రజల ప్రాణాలతో ఆటలాడుకున్న వైనం వివరించాలని చెప్పారు. ముఖ్యంగా తటస్థ ఓటర్లను గుర్తించాలన్నారు. వైసీపీ పాలకులు అబద్ధపు హామీలతో మరోసారి మోసం చేయడానికి సిద్ధమయ్యారని, దీనిపై దీటుగా ఎదుర్కొనాలని, ప్రజలను చైతన్యం చేసి పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని దామచర్ల కోరారు.

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు కష్టాలు పడ్డారని, ఆదాయం లేక ఆర్థిక భారాలు పెరిగిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, ప్రజల భవిష్యత్ బాగుపడాలన్నా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నగరంలోని 45వ డివిజన్‌లోని కర్నూలు రోడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలతో మాట్లాడారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలంటే చంద్రబాబును గెలిపించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఒంగోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ హయాలోనే అభివృద్ధి జరిగిందన్నారు. వైసీపీ నాయకులు 25 ఏళ్ళుగా ఒంగోలు నగర అభివృద్ధి కోసం చేసిన ప్రగతి ఏమీ లేదన్నారు. మరోసారి వైసీపీ పాలకుల బూటకపు హామీలను నమ్మొదని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- టీడీపీ రాష్ట్ర నేత దామచర్ల సత్య
- పలు గ్రామాల్లో శ్రేణులతో సమావేశం


కె.ఉప్పలపాడులో మాట్లాడుతున్న దామచర్ల సత్య, అచ్యుత్‌కుమార్

కొండపి, జనవరి 28: రాష్ట్రాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి చంద్రబాబు నాయుడిని సీఎంగా చేసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం మండలంలోని కె.ఉప్పలపాడు, చినవెంకన్నపాలెం, కట్టుబడివారిపాలెం, వెన్నూరు, చోడవరం, ముప్పవరం, మిట్టపాలెం, గోగినేనివారిపాలెం, పెరిదేపి, కట్టావారిపాలెం, నేతివారిపాలెం, పెదకండ్లగుంట్ల, జాళ్లపాలేల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర భవిష్యత్ నాశనం అవుతుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు వైసీపీకి ఓటేసి ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లోని నాయకులు ఓటరు జాబితాలను పరిశీలించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో నాయకులు మాట్లాడి అందర్నీ ఓటింగ్‌కు వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, నాయకులు బత్తుల నారాయణస్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, గుండపనేని రామ్మూర్తినాయుడు, దామా మురళి, దామా శ్రీహరి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో నాకు సొంతిల్లు లేదు !

ఐదుసార్లు ఎమ్మెల్యేగా.. రెండుసార్లు మంత్రిగా ఉన్నా.. • ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకుంటే 75వేలమందితో ఇల్లు ముట్టడి

ఆసరా చెక్కుల పంపిణీలో దామచర్లకు ఎమ్మెల్యే బాలినేని హెచ్చరిక


సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 28 : తాను ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పని చేసినా హైదరాబాద్‌లో తనకు సొంతిల్లు లేదని, నియోజకవర్గ ప్రజల కోసం తన రాజకీయ జీవితాన్ని ఫణంగా పెట్టి ప్రతి పైసా ప్రజల కోసం ఖర్చు చేశానని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 4వ విడదత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నగరంలోని 2880 గ్రూపులకు, 24,879 మందికి రూ. 24.56 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం బాలినేని మాట్లాడుతూ నగరంలో 25వేల మందికి ఇళ్ల పట్టాల పంపిణీ చేయాలని తాను గత నాలుగేళ్ళుగా ప్రయత్నిస్తుంటే దానిని టీడీపీ వాళ్ళు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. యరజర్ల వద్ద ఇళ్ళ పట్టాల పంపిణీకి చర్యలు చేపడితే కోర్టులో కేసు వేశారన్నారు. మరోసారి ఇళ్ళపట్టాలు అడ్డుకుంటే 25 వేల మంది లబ్ధిదారులతో పాటు వాళ్ళ ఇంటిలో మరో ఇద్దరుతో కలిసి మొత్తం 75 వేల మందితో మీ ఇల్లు ముట్టడిస్తానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌పై పరోక్షంగా విమర్శించారు. ఇళ్ళ పట్టాల పంపిణీ కోసం నాలుగు రోజులు విజయవాడలో ఉండి మరీ సీఎంను ఒప్పించి నిధులు తీసుకువచ్చినట్లు చెప్పారు. వచ్చే నెల 10 నుంచి 15వ తేదీలోపు ఒంగోలులో ముఖ్యమంత్రి చేతులమీదుగా 25వేల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తానని తెలిపారు. పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే ఈ సారి ఎన్నికల్లో పోటీ చేయనని కూడా తెలిపానని, అందుకోసమే పేద ప్రజల కోసం స్థలం ఇచ్చేందుకు తాను కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. అవసరమైతే ఇల్లు కూడా కట్టిస్తామని, లేదంటే లబ్ధిదారులే కట్టుకుంటామని అంటే అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనరు ఎం.వెంకటేశ్వరరావు, మెప్మా సీఎంఎం కొండయ్య, పలువురు వైసీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటా

ఒంగోలు(కల్చరల్): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని, వారికి ఏ సమస్య ఉన్నా తన దగ్గరకి రావచ్చని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తాను అధికారంలో ఉన్నా ఏ ఉద్యోగిని కానీ ఉపాధ్యాయిని కానీ వేధించిన దాఖలాలు లేవన్నారు. స్థానిక లాయర్‌పేటలోని తన నివాసంలో ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయులతో బాలినేని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఉద్యోగ, ఉపాధ్యాయులు మాట్లాడుతూ పలు యాప్ వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలను మంజూరు చేసేలా చూడాలని కోరారు. దీనిపై బాలినేని మాట్లాడుతూ ఆయా సమస్యలపై గతంలో సీఎం జగన్‌తో మాట్లాడానని, అయితే సీఎంవోలో పనిచేసే కొంతమంది అధికారులు సీఎంను తప్పుదారి పట్టించారని, దానివల్ల కొంత ఇబ్బంది వచ్చిందని తెలిపారు. రెండు రోజుల్లో సీఎంను కలుస్తానని, ఆయా సమస్యలతో పాటు ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు ఈనెల 31వ తారీకు జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వెలగపూడి-ఆలకూరపాడు రోడ్డు పనులకు మోక్షమెప్పుడో..?

- ఎన్నికల సీజన్ కావడంతో అపోహలు


అధ్వానంగా ఉన్న అనంతవరం- వెలగపూడి రోడ్డు

టంగుటూరు, జవవరి 28 : ఎట్టకేలకు వెలగపూడి-ఆలకూరపాడు వయా అనంతవరానికి తారురోడ్డు మంజూరైంది. ఈ రోడ్డు నిర్మాణ పనులకు మధ్యలో రెండుచోట్ల చిన్న బ్రిడ్జీలకు కలపి మొత్తం సుమారు 7కిమీ దూరానికి రూ.4.05 కోట్లు మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియ కూడా ముగిసింది. మరో రెండు వారాల్లో కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకోవాలసి ఉంది. ఈరోడ్డుపనుల ప్రారంభం ఎప్పుడెప్పుడా అని నాలుగు గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఆలకూరపాడు రెండు ఎంపీటీసీ స్థానాలున్న పెద్ద గ్రామం. అలాగే అనంతవరం, వెలగపూడి, తాళ్లపాలెం చుట్టూ రొయ్యల చెరువులు విస్తరించి ఉన్నాయి. ఈ నాలుగు గ్రామాలను కలుపుతూ సరైన రోడ్డు లేనందున ఆ గ్రామాల ప్రజలతోపాటు ఆక్వా రైతులు చుట్టూ తిరిగి వెళుతుండడంతో ఇబ్బందులుపడుతున్నారు.

టెండర్లే కానీ..

రోడ్డు పనుల ప్రారంభంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో హడావుడిగా కొత్త పనులకు టెండర్లే కాని పనులు ప్రారంభించడం లేదన్న విమర్శలున్నాయి. చేసిన పనులకు నిధులు ఏళ్ల తరబడి చెల్లించనందున కొత్తగా పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందు రావడం లేదన్నది జగమెరిగిన సత్యమే. అలాంటి పరిస్థితి ఉండడంతో ప్రభుత్వ కాలం ముగింపు సమయాన రోడ్డు పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకొస్తాడా అని అందరూ సందేహిస్తున్నారు.

ప్రజాసేవలో తరించిన వెంకటస్వామి


వెంకటస్వామి పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిపూడి, జనవరి 28 : సీపీఎం సీనియర్ నాయకులు వంకాయలపాటి వెంకటస్వామి ప్రజాసేవలో నిత్యం తరించిన మహోన్నత వ్యక్తి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవీ వెంకటేశ్వరరావు కొనియాడారు. ఆదివారం మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో సీపీఎం రాష్ట్ర కార్యాదర్శి శ్రీనివాసరావు తండ్రి వెంకటస్వామి పార్థీవ దేహానికి ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యునిగా నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు అందించారని చెప్పారు. రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు, ప్రజాశక్తి దినపత్రిక ఎడిటర్ తులసీదాస్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డీ రమాదేవి, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, సీపీఎం రాష్ట్ర నాయకులు కే సుబ్బరావమ్మ, వై సిద్ధయ్య, నరసింహారావు, పూనాటి ఆంజనేయులు, నాయకులు ముప్పరాజు కోటయ్య, ఎం రమేష్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి సుబ్బారెడ్డి, తెలుగురైతు జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, మాకినేని రమణయ్య, సీవీఆర్ కళాశాల కరస్పాండెంట్ డి.వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వంకాయలపాటి వెంకయ్య పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

నేటిలోగా ఇంటర్ ఫీజు చెల్లించాలి : ఆర్ఐవో

ఒంగోలు(విద్య), జనవరి 28: ఇంటర్మీడియట్ ఫీజు చెల్లింపునకు తత్కాల్ పథకం ద్వారా సోమవారం వరకు బోర్డు అవకాశం కల్పించినట్లు ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో జరుగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ ప్రైవేటు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లింపనకు బోర్డు ఈ అవకాశం కల్పించిదన్నారు. తత్కాల్ పథకం కింద రూ.3 వేలు చెల్లించి విదార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మద్దిపాడు, జనవరి 28: మద్దిపాడులోని కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. రిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బందీల అంజయ్య నేతృత్వంలో జరిగిన ఈ సమ్మేళనంలో పలువురు పాల్గొని ఆనాటి పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉన్నత స్థానానికి రావటానికి పాఠశాల చదువు పునాదివంటిదని, అటువంటి స్కూలులో మళ్లీ కలుసుకోవటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పి.పుల్లయ్య అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కె.అంకయ్య, సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, కె.జైపాల్‌రెడ్డి, ఆరి వెంకట్రావు, మండవ శివన్నారాయణ, జ్యోతి ప్రసాద్, అంజిరెడ్డి, మండవ రంగారావు, మారెళ్ల వెంకట్రావు, జి.నరసింహారావు, గుగ్గిలం రంగనాయకులు, బోడెంపూడి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో మాదిగలకు ప్రాధాన్యం కల్పించాలి


మాట్లాడుతున్న వినోద్

మద్దిపాడు, జనవరి 28: వైసీపీలో మాదిగలకు తగిన ప్రాధాన్యత లేదని దుడ్డు వినోద్ పేర్కొన్నారు. మద్దిపాడు మండలం వెల్లంపల్లి ఆవాస్ హోటల్‌లో జరిగిన మాదిగ సామాజిక వర్గ ఆత్మీయ సమ్మేళంలో ఆయన మాట్లాడారు. మండలంలో మాదిగలు ఏడు వేల ఓట్లు కలిగి ఉన్నారని, అయినప్పటికీ వైసీపీ నాయకులు తమను చిన్నచూపు చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా తమకు తగిన ప్రాధాన్యత లేకపోతే ప్రత్యామ్నాయం చూసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముక్తినూతలపాడులో బ్యారన్ దగ్ధం

ఒంగోలు(రూరల్), జనవరి28: ఒంగోలు నగరం ముక్తినూతలపాడు గ్రామంలో ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ తగలపడిన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పొడపాటి నాగేశ్వరరావు, పొడపాటి సాంబశివరావులకు చెందన బ్యారన్‌లో కాల్పునకు పొగాకు ఉంచారు. అయితే అకస్మాత్తుకు బ్యారన్‌లో మంటలు చెలరేగి కాలిపోయింది. సమాచారం అందుకున్న ఒంగోలు అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. పొగాకు వేలం కేంద్రం అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి28: పోరాటాల ద్వారానే అంగన్‌వాడీల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అంగన్‌వాడీల కార్యకర్తలు, ఆయాల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పేర్కొన్నారు. నాగులుప్పలపాడులో ఆదివారం అంగన్‌వాడీలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంకా కొన్ని సమస్యలు పరిష్కారం కాలేదని, తిరిగి పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.జయంత్‌బాబు, టి.శ్రీకాంత్, వెంకటసుబ్బమ్మ, అరుణ, రమ, రజని తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషాల నూతన కమిటీ

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి28: నాగులుప్పలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన నూరుబాషాల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ మండల అధ్యక్షుడిగా షేక్ మీరావళి, కార్యదర్శిగా హసన్‌సాహెబ్, కోశాధికారిగా మీరావళి, గౌరవాధ్యక్షుడిగా శిద్దాసాహెబ్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ నాయకులు పాల్గొన్నారు.

రేపు జమ్ములపాలెంలో రెజ్లింగ్ పోటీలు

టంగుటూరు, జనవరి 28 : మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 30వ తేదీన రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు పీడీ అశోక్‌బాబు ఆదివారం తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల నుంచి సీనియర్స్, అండర్ 20, అండర్ 15 క్రీడాకారులు పాల్గొననున్నారు. సీనియర్ క్రీడాకారులకు జైపూర్‌లో జాతీయ స్థాయి పోటీలు ఫిబ్రవరి 1నుంచి 5వ తేదీ వరకు.. అండర్ 20, అండర్ 15 విభాగాల నుంచి విజయం సాధించిన వారికి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఫిబ్రవరి 11నుంచి 17వ తేదీ వరకు జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. ఇక్కడ జరిగే రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలను జిల్లా అమర్చూర్ రెజ్లింగ్ అసోసియేషన్, ఏపీ రెజ్లింగ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించనున్నట్లు అశోక్ తెలిపారు.

వృద్ధులకు ఆహారం పంపిణీ


ఆహారం పంపిణీ చేస్తున్న నిర్వాహకురాలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 28: ఒంగోలు నగరం కమ్మపాలెంలోని అప్పాయ గుంట వద్ద ఉన్న ఆశయం వృద్ధాలయంలో ఆదివారం వృద్ధులకు ఆహార పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా వృద్ధాలయ నిర్వాహకురాలు లీలారాణి మాట్లాడుతూ తమ వృద్ధాలయంలో సుమారు 20 మందికి గత కొన్ని సంవత్సరాలుగా ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు. ఎటువంటి రుసుం తీసుకోకుండా సేవ చేయాలనే ఆశయంతో ఈ వృద్ధాలయాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. స్థానిక దాత జయచంద్ర సహకారంతో ఆదివారం వృద్ధులకు పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశామని, మరింత మంది దాతలు సహాయ సహకారాలు అందజేయాలని కోరారు.

హరిహరనగర్‌లో రూ.3లక్షల సొత్తు చోరీ

ఒంగోలు (క్రైం) జనవరి 28: ఒంగోలు నగరం హరిహరనగర్‌లో దుండగులు చోరీకి పాల్పడి సుమారు రూ.3లక్షల విలువైన సొత్తును అపహరించుకెళ్ళారు. స్థానిక హరిహర్‌నగర్‌లోని ఎస్. శ్రీనివాసరాజు ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. శ్రీనివాసరాజు ఆయన భార్య ఈనెల 26న హైదరాబాద్ వెళ్ళారు. ఇంట్లో ఇద్దరు పిల్లలు, శ్రీనివాసరాజు తల్లి అంకమ్మ నిద్రపోతున్నారు. కిటికీలో నుంచి ఇంటి వెనుక తలుపు తీసి దొంగలు లోపలకి చొరబడ్డారు. ఒక బెడ్ రూంలో పిల్లలు నిద్ర పోతుండగా మరో బెడ్‌రూంలో దొంగలు అక్కడే ఉన్న బీరువాతాళాలతో తీసి బంగారు ఆభరణాలు, వెండి సామానులు అపహరించుకు వెళ్ళారు. ఈ మేరకు ఆదివారం ఉదయం శ్రీనివాసరాజు తల్లి అంకమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దొంగ చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కు ధరించినట్లు గుర్తించారు.

నేడు నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమం

ఒంగోలు(కల్చరల్), జనవరి 28: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమాన్ని సోమవారం ఒంగోలులోని ప్రకాశం జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో నిర్వహిస్తున్నట్లు భవిష్యనిధిశాఖ జిల్లా నోడల్ అధికారి ఎం.సమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. వివిధ సంస్థలలో పనిచేసే కార్మికులు, పింఛనుదారుల ప్రావిడెంట్ ఫండ్ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని, అదేవిధంగా భవిష్యనిధి చేపడుతున్న వివిధ ఆన్‌లైన్ సేవల గురించి కూడా అవగాహన కల్పిస్తామని ఆయన చెప్పారు. కనుక కార్మికులు, పింఛనుదారులు, ఇతర పీఎఫ్ ఉద్యోగులు పాల్గొనాలని సమ్మయ్య కోరారు.

మద్దాలికి మయూరి ఆర్ట్స్ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న మాధవరావు

మద్దిపాడు, జనవరి 28: ఒంగోలుకు చెందిన శ్రీఅభయ సేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావుకు మయూరి ఆర్ట్స్ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన వేడుకలలో ఆయనకు పురస్కారాన్ని సినీ నటులు లోహిత్‌కుమార్, దర్శకులు డి.నాయక్ తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో గత రెండు దశాబ్దాలుగా సామాజిక సేవారంగంలో కృషిచేస్తున్న మాధవరావుకు పురస్కారాన్ని అందజేయటం అభినందనీయమన్నారు. కాగా ఆయనకు పురస్కారం లభించటం పట్ల ఒంగోలు, చీమకుర్తిలకు చెందిన పలు సంస్థలు, సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

రాజకీయంగా ఎదుర్కోలేక ఏలూరిపై కుట్ర



● ఎమ్మెల్యే స్వామి ధ్వజం

పర్చూరు, జనవరి 28: తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుని రాజకీయంగా ఎదుర్కో లేక ఆయనపై బురుద జల్లేందుకు వైసీపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందని ప్రకాశం జిల్లా కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశాడు. పర్చూరు నియోజకవర్గంలో గెలవలేమనే భయంతో ఏదొకరకంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రతిష్టను దిగజార్చా లనే కుట్రతో వైసీపీ ప్రభుత్వ పెద్దలు తెరలేపారని మండిపడ్డారు. రాజ కీయంగా ఏలూరిని ఎదుర్కొనే అభ్యర్థి దొరక్కపోవటం, ఆయనపై నిల బడే దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడు లేక పోవడం వైసీపీకి శాపంగా మారిందన్నారు. దీంతో తాడేపల్లి పెద్దలు ఏలూరిని ఇబ్బందికి గురి చేయాలనే లక్ష్యంతో అధికార దర్పన్ని వినియోగించి కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. పదిహేనేళ్ల క్రితం ఎమ్మెల్యే ఏలూరి నోవా అగ్రి గ్రూప్ సంస్థను స్థాపించారని చెప్పారు. రాజకీయ ప్రవేశం చేసిన తరువాత ఆయన ఆ సంస్థ నుంచి బయటకు వచ్చారన్నారు. పబ్లిక్ లిమిటెడ్ సంస్థగా పలువురు డైరెక్టర్ల ఆధీనంలో నోవా సంస్థ నడుస్తుం దన్నారు. ఆ కంపెనీలో లోటుపాట్లు ఉంటే గత నాలుగున్నర సంవత్స రాలుగా అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించా రు. అక్రమ మార్గంలో గెలవాలనే తలంపుతో ప్రతిపక్ష పార్టీల ఓట్లు తొలగిస్తున్న వైసీపీ ప్రభుత్వంపై ఎమ్మెల్యే ఏలూరి పోరాటం సాగిం చారని, ఆ కక్షతోనే కుట్రలు చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం పుట్టు కే విధ్వంసంతో ప్రారంభమైందన్నారు.

నోవా గ్రూపు సంస్థ ఐపీఓ(తొలి పబ్లిక్ ఆఫర్)లో అడుగుపెట్టిందనే కక్షతో అధికారం అడ్డుపెట్టుకొని దాడులు పేరుతో ప్రతిష్టను దిగజార్చా లని చూస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ఏలూరి విజయాన్ని ఎవరు ఆపలేరన్నారు. జగన్‌రెడ్డి కుట్రలు ప్రజలందరికీ తెలుసునని, ఎమ్మెల్యే ఏలూరి అంటే ప్రజల్లో ఒక విశ్వాసం ఉందన్నారు. సీఎం కా ర్యాలయం తాడేపల్లి నుంచి ఏలూరిపై కుట్రలు సాగుతున్నాయని, అవి పర్చూరులో ఫలించవన్నారు. గతంలో సైతం హెరిటేజ్‌పై బురద జల్లి న ప్రభుత్వం తాజాగా ఏలూరిపై, సంస్థపై బురద జల్లేపనిలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా వైసీపీ పెద్దలు ఏలూరిపై చీప్ పాలిటిక్స్ మాను కొని ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేయాలని ఎమ్మెల్యే స్వామి హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో పర్చూరు నుంచి వైసీపీ అంతిమయాత్ర ప్రారం భమవుతుందని హెచ్చరించారు. ఏలూరిపై ఇలాంటి తప్పుడు ఆరోపణ లు చేయటం దుర్మార్గ చర్యగా స్వామి పేర్కొన్నారు.



వెంకట్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సమన్వయంతో ముందుకు సాగాలి

జనసేన పార్టీ నాయకుడు వెంకట్

దొనకొండ, జనవరి 28 : రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి విజయం కోసం జనసేన, తెలుగుదేశం పార్టీల నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని జనసేన దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ కోరారు. దొనకొండలోని టీడీపీ కార్యాలయానికి ఆదివారం రాత్రి చేరిన వెంకట్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం టీడీపీ అధ్యక్షుడు నాయకులు, కార్యకర్తలను గరికపాటి వెంకట్‌కు పరిచయం చేశారు. టీడీపీ మండల నాయకులు కొత్తం రఘునాథరెడ్డి, పత్తి వెంకటేశ్వర్లు, విప్పర్ల లక్ష్మీరావు, మన్నెం గాలయ్య, కొమ్మతోటి సుబ్బారావు, నిమ్మకాయల సుబ్బారెడ్డి, శృంగారపు నాగసుబ్బారెడ్డి, యరగొర్ల బసవయ్య, కుందుర్తి లక్ష్మణ్, దుగ్గెంపూడి చెంచయ్య వల్లపునేని కేశవ, ఒబ్బాపురం పవన్‌కల్యాణ్ యూత్ అభిమానులు పాల్గొని పరిచయం చేసుకున్నారు.

వలంటీర్లపై ఐప్యాక్ నిఘా!

» సస్పెన్షన్లు, తొలగింపులకు సిఫార్సు చేస్తున్నట్లు ప్రచారం

చీరాల, జనవరి 28: వలంటీర్లపై ఐ ప్యాక్‌ను నిఘా అస్త్రంగా ఉపయోగిస్తున్నారు. ఐప్యాక్ సభ్యులు కొందరు చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో తిరుగుతూ అధికార వైసీపీకి ఎవరైతే అనుకూలంగా పని చేయటం లేదో వారి జాబి తాను తయారుచేస్తున్నారు. ఆతరువాత సదరు వలంటీర్లకు సస్పెన్షన్ లేదా తొలగింపు ఉత్తర్వులు అందుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు తక్కువ జీతం, ఎక్కువ పని భారంతో ఉన్న తమపై ఈవిధంగా చర్యలు చేపట్టటం ఎంతవరకు సమంజసమని వారు వాపోతున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే తొలగించమని ఉత్తర్వులు వచ్చినట్లు తెలిసింది. కొందరు ఉన్నత చదువులు చదవి కూడా సరైన ఉద్యోగ అవకాశాలులేక వలం టీర్లుగా చేరినవారు ఉన్నారు. అలాంటి వారిపై కూడా ఐ ప్యాక్ సిఫార్సులతో ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో తాము వలంటీర్లుగా చేరకుండా ముందుగానే తమ చదువుతగ్గ ఉద్యోగంలో చేరిఉన్నట్లయితే బాగుండేది కదా అని వాపోతున్నారు. తమ ఉద్యోగాలు ఉంటాయో, ఊడతాయో తెలియని త్రిశంకుస్వర్గంలో ఉన్నట్లుగా తమ పరిస్థితి తయారయిందని వారు ఆవేదన చెందుతున్నారు.

టీడీపీ గెలుపునకు సమష్టి కృషిచేయాలి

చీరాల, జనవరి 28: అందరి సమిష్టి అవసరం.. అదే మన విజయానికి నాంది అవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. స్థా నిక పార్టీ కార్యాలయంలో బెంగుళూరు టీడీపీ ఫోరమ్ సభ్యులు ఆదివారం కొం డయ్య, గౌరీఅమర్‌నాథ్‌ను కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్ప టివరకు కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. పనితీరు బాగుందన్నారు. భవిష్యత్‌లో తాము కూడా అవసరమైన సందర్భాల్లో అండగా నిలుస్తామని చెప్పారు. వారు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కొండ య్య దిశా నిర్దేశం చేశారు.అనంతరం బీటీడీపీ ఫోరమ్ ప్రతినిధులు కొండయ్యను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

పంగులూరు, జనవరి 28: పంగులూరులో రాష్ట్రస్థాయి పోలురాదా ఎడ్ల పోటీలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పల్లపు రాము ప్రారంభించారు. ఈ పోటీలలో 20 ఎడ్ల జతలు పాల్గొంటున్నాయని నిర్వాహకులు రావూరి శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను తిలకించేందుకు పంగులూరు, పరిసర ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బీవీ కృష్ణారెడ్డి, స్వయంపు హనుమంతరావు, గోపాలరెడ్డిపాల్గొన్నారు.

నేరేడుపల్లి ఎస్సీ కాలనీలో కార్డెన్‌సెర్చ్

పీసీపల్లి, జనవరి 28 : పరిచయం లేని కొత్త వ్యక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించవద్దని ఎస్‌ఐ జీ కోటయ్య అన్నారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున ఇంటింటికీ తిరిగి ఆకస్మిక సోదాలను చేపట్టారు. ప్రతి ఒక్కరి ఆధార్ కార్డులను పరిశీలించి, ఇంట్లో ఉన్న వారి వివరాలను సేకరించారు. ఇంటిలోని వస్తువులు, ద్విచక్ర వాహనాలను తనిఖీచేసి వాహనాల సీబుక్‌లను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో ఎస్‌ఐ మాట్లాడుతూ జిల్లాతో పాటు ఇతర జిల్లాలో జరిగిన పలు నేరాల్లో ఈ కాలనీల్లో ఉన్న కొంతమందిని గతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పాత నేరస్థుల కదలికలను గుర్తించేందుకే కార్డెన్‌సెర్చ్ నిర్వహించామన్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామాలకు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కాలనీవాసులకు సూచించారు.

సోమవరప్పాడులో..

తాళ్లూరు : మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో ఒంగోలు అడిషనల్ ఎస్పీ (క్రైమ్) శ్రీధర్ , దర్శి డీఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటినీ సోదా చేశారు. అనుమతి పత్రాలు లేని 15 వాహననాలను సీజ్ చేశారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

» రేణంగివరంలో పలువురు టీడీపీలో చేరిక



రేణంగివరంలో గొట్టిపాటికి హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

పంగులూరు, జనవరి 28: రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని రేణంగివరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఆయన అనుచరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. రేణంగివరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఓబుల్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులకు ఎమ్మెల్యే రవికుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా కలసికట్టుగా కృషి చేద్దామన్నారు. కష్టపడి పనిచేసే వారికి ఖచ్చితంగా పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. రాష్ట్రం బాగుపడాలనే తలంపు, అరాచక వైసీపీ దుర్మార్గపు పాలన నుంచి బయటపడాలనే ఆలోచనతో ప్రజలు టీడీపీలోకి స్వచ్ఛందంగా వస్తున్నారని చెప్పారు.

టీడీపీ హయాంలో పల్లెలు ప్రగతి బాటలో పయనించాయని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. నేడు పన్నుల బాదుడుతో పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం రోడ్లకు ఏర్పడిన గుంతలలో తట్టెడు మట్టికూడా పోయలేని దుస్థితి ఉందన్నారు. ఓటీఎస్ పేరుతో వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ళపై భారం మోపిందన్నారు. బడ్జెట్‌లో పట్టణ అభివృద్ధికి నిధుల కోత విధించిన వైసీపీ ప్రభుత్వం సిమెంట్, డీజిల్, పెట్రోలు ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. నాలుగున్నరేళ్ళ వైసీపీ పాలన లో ఒక్కో కుటుంబంపై పన్నులు, ధరల పెంపు రూపంలో రూ.2 లక్షల అదనపు భారం మోపిందని గొట్టిపాటి ఆరోపించారు. తొలుత ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేఖర్, మస్తాన్‌వలి, స్వామి, పెదవల్లి అశోక్, వరపర్ల సుబ్బారావు, తెలగతోటి రాధ, శ్రీనివాస్, పూర్ణ, జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి టీడీపీలో చేరుతున్న అద్దంకి పట్టణంలోని 7వ వార్డు వైసీపీ కార్యకర్తలు

టీడీపీలోకి చేరికలు, సంఘీభావాల వెల్లువ

అద్దంకి, జనవరి 28: అద్దంకి నియోజకవర్గంలో టీడీపీలోకి చేరిక లు, సంఘీభావాలు వెల్లువలా సాగుతున్నాయి. ఆదివారం అద్దంకి పట్టణంలోని 17,7 వార్డులకు చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు చిలకలూరిపేటకు పెద్ద సంఖ్యలో వెళ్లి ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ప్రతిఒక్కరూ బాగా కష్టపడి చంద్రబాబునాయుడును సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని పెద్దఎత్తున చేరికలు జరుగుతున్నాయన్నారు. వైసీపీ పాలనలో అప్పు పుట్టకపోతే జీతాలు కూడా ఇవ్వలేని రాష్ట్రంగా మారిందన్నారు. జగన్‌రెడ్డి అభ్యర్థులను ప్రకటిస్తుం టే అభ్యర్థులు మాత్రం వైసీపీని వదిలిపెట్టి పోతున్నారన్నారు. రాను న్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపివేయటం ఖాయమన్నారు.

17వ వార్డు నుంచి పలు సామాజిక వర్గాలకు చెందిన నేతలు షేక్ మాబులు, సైదులు, మీరావళి, షరీఫ్, దగ్గు నారాయణ, జడ శ్రీకాంత్, బహునాథం శ్రీనివాసరావు, సిద్ది మహేష్ తదితరులు టీడీపీలో చేరారు. బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే రవి కుమార్‌ను కలిసి ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాలను అందజేశారు.

వైసీపీని వీడి టీడీపీ గూటికి

● పామూరు, పీసీపల్లి మండలాల ప్రజలు చేరిక ● నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

పామూరు, జనవరి 28 : వైసీపీ అరాచక పాలనలో విసిగిన ప్రజలు చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో టీడీపీ గూటికి చేరుతున్నారని వారందరికీ ఆహ్వానం పలుకుతున్నానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని అప్పమాంబపురం గ్రామంలో 25 కుటుంబాలు, బీసీ కాలనీకి చెందిన 15, కొత్తపల్లి గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వారు వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర, కోటపాటి జనార్దనరావు సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఉగ్ర ఆహ్వానించారు. గత ఎన్నికల్లో వైసీపీ నాయకుల మాయ మాటలు నమ్మి టీడీపీని వీడి వైసీపీలోకి వెళ్లి నష్టపోయామన్నారు. ఉగ్రతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి టీడీపీలోకి వచ్చామని, ఉగ్ర విజయానికి పాటుపడతామని తెలిపారు.

పామూరు పట్టణ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కాలనీలో టీడీపీ మండల కమిటీ కార్యదర్శి బత్తుల సత్యనారాయణ, తిరుపతయ్య ఆధ్వర్యంలో బీసీ సామాజిక వర్గాలకు చెందిన 60 కుటుంబాల వారు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి ఉగ్ర స్వాగతం పలికారు.

వెలిగండ్ల : మండలంలోని వెదుళ్లచెరువు పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు, పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు శ్యామల కాశిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో కనిగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వారంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. డాక్టర్ ఉగ్ర వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో కట్టిపోగు మార్క్, తగరం ఏ ప్రేమ్, తగరం లూకయ్య, జిడ్రపల్లి గుటయ్య తదితరులున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, బీసీ సెల్ అధికార ప్రతినిధి రాజగోపాల్, కార్యకర్తలు ఉన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన మహిళలతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

రాజకీయాలకన్నా ప్రజా సేవే ముఖ్యం

» ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పామూరు : రాజకీయాలకన్నా ప్రజా సేవే ముఖ్యమని, తాను పాలకుడిని కాను..ప్రజా సేవకుడినని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోడిగుంపల గ్రామంలోని దివంగత న్యాయవాది కొప్పల్లి సుబ్బరాయుడు ఫాంహౌస్‌లో టీడీపీ మండల కుటుంబ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉగ్ర మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ప్రజలు సుఖశాంతులతో ఉంటారని తెలిపారు. వైసీపీ పాలనా వైఫల్యాలను ప్రజలకు చెప్పానే టీడీపీ మినీ మేనిఫెస్టోపై ప్రచారం చేయడంతోపాటు ఎన్నికలు పూర్తయ్యేవరకూ అప్రమత్తంగా, ఐక్యంగా కలిసి సైనికుల్లా శ్రమించాలని ఉగ్ర హితబోధ చే శారు. పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకుడు కోటపాటి జనార్దన్‌రావు మాట్లాడుతూ రాజకీయాల్లో డబ్బుకు ప్రాధాన్యత ఉన్నప్పటికీ డబ్బే ప్రామాణికం కాదని గ్రామాల్లో ప్రజలతో మమేకం కావాలన్నారు. మొదటగా పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ ఆత్మీయ సమావేశంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జీ దశరథరామయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.హుసేన్‌రావు యా దవ్, రాష్ట్ర కమిటీ నా యకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ అమీర్‌బాబు, టీడీపీ గ్రామ అధ్యక్షులు మాల్యాద్రి, కొంపెల్లి నాగేశ్వరరావు, బూత్ కమిటీ కన్వీనర్లు, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు గుత్తి మహి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఘాటు తగ్గిన మిర్చి

పెరిగిన పెట్టుబడి ఖర్చులు
తగ్గిన దిగుబడులు
నెల వ్యవధిలోనే క్వింటాకు రూ.4వేలు తగ్గిన రేటు
ఆందోళనలో మిర్చి సాగు రైతులు



ఉమామహేశ్వర అగ్రహారంలో కల్లాల్లో ఆరబెట్టిన ఎండు మిర్చి



కల్లంలో గ్రేడ్ చేస్తున్న కూలీలు

ముండ్లమూరు, జనవరి 28 : మండలంలో ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతులకు ఘాటు తగ్గింది. వరుస తెగుళ్ల కోలుకోక ముందే ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. దీంతో మిర్చి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన పెట్టుబడులు ఒక వైపు, దిగుబడులు చూస్తే మరొక వైపు, మిర్చి రైతును కన్నీరు పెట్టిస్తున్నాయి. ఎకరానికి రూ.1.50 లక్షల నుం చి రూ.2 లక్షల వరకు పె ట్టుబడులు పెట్టారు. ఇటీవల కురిసిన వర్షానికి బొ బ్బర, జెమినీ, ఆకు ముడత తెగుళ్ల సోక డంతో దిగుబడి కూడా గణనీయంగా పడిపోయింది. ఎకరానికి 40 క్వింటాళ్లు కావాల్సిన మిర్చి తోటలు, 20 క్వింటాళ్లకే పడిపోయాయి. దీంతో రైతులు పెట్టుబడి పోను కూలి, కో త, ఖర్చులకే సరిపోయే పరిస్థితి ఏర్పడింది. మండలం లో ఖరీఫ్, రబీలో కలిపి రూ.5,450 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. ప్రధానంగా తేజ రకంగా ఎక్కువగా సాగు చేశారు. 341, 334, ఆరుమూరు అనే రకాల సాగు చేశారు. ప్రస్తుతం గత 15 రోజుల నుంచి ముమ్మరంగా మిర్చి కోతలు కోసి కల్లాల్లో ఆర బెట్టారు. అమ్మకాలు కూడా చేస్తున్నారు. కొంత మంది రైతులు గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి అమ్ముకుంటుండగా మరి కొంత మంది రైతులు కల్లాల్లోనే దళారులకు అమ్ముకుంటున్నారు. తేజ రకం రూ.20వేలు, 341 అనే రకం క్వింటా రూ.17,500, 334 అనే రకం రూ.19వేలు, ఆర్మూరు అనే రకం రూ.15వేలకు కొనుగోలు చేస్తున్నారు. దళారులైతే ఇంకా రేట్లు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో అసలే తెగుళ్లతో దిగుబడి రాక మిర్చి సాగు చేసిన రైతులు అల్లాడుతుంటే మరో వైపు దళారులు నిలువునా మిర్చి రైతులను మోసం చేస్తున్నారు.

మండలంలోని పసుపుగల్లు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, నాయుడుపాలెం, తమ్మలూరు, పసుపుగల్లు, పోలారం, శంకరాపురం, ముండ్లమూరు, నూజెండ్లపల్లి, నాయుడుపాలెం, సుంకరవారిపాలెం గ్రామాల్లో అత్యధికంగా తేజా రకాన్ని సాగు చేశారు. మిగతా రకాలుగా కూడా తక్కువగా సాగు చేశారు.

'దళితులను ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటున్నారు'

చీరాలటౌన్, జనవరి 28: రాష్ట్రంలో దళితులను ఓట్ల కోసం మాత్రమే వాడుకుంటున్నట్లు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక గడియార స్తంభం కూడలిలో జరిగిన అంబేడ్కర్ సందేశయాత్ర సభలో ఆయన మాట్లాడారు. రా ష్ట్రంలో అణగారిన కులాలకు తీరని అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. రాజ్యాధికారం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఖాదరవలి, అన్నపూర్ణ, రామచంద్రారెడ్డి, లావణ్య, అబ్దుల్ ఖాదర్, బుజ్జి, మహబూబ్, గుమ్మడి ఏసురత్నం, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పర్చూరులో ఆధ్యాత్మిక ప్రవచన

పర్చూరు : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం 5గంటలకు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ హయాంలోనే బీసీల అభ్యున్నతి

దర్శి, జనవరి 28 : బీసీల అభ్యున్నతి తెలుగుదేశం హయాంలోనే జరిగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ రాజకీయంగా బీసీలు టీడీపీలో ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. చంద్రబాబు హయాంలో ఎన్నో ఉన్నత పదవులను కట్టబెట్టి స ముచిత గౌరవం దక్కించిందన్నారు. వైసీపీ బీసీలను నమ్మించి మోసం చేసిందన్నారు. వైసీపీ పాలకుల వద్ద బీసీ నాయకులు చేతులు కట్టుకొని నిలబడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. టీడీపీకి బీసీలే ప్రాణమన్నరీతిలో చంద్రబాబు వారికి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. బీసీ వర్గాలకు చెందిన ప్రజలు వైసీపీ పాలనలో జరుగుతున్న అక్రమాలను గుర్తించి వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మారెళ్ళ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి బేళ్ల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి గడ్డం బాల య్య, నగర పంచాయితీ వైస్ చైర్మన్ తలారి కోటయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, కౌన్సిలర్లు నక్కా రంగా, దత్తు, వలిబా బు, రామగిరి, తెలుగు యువత ఉపాధ్యక్షుడు కల్లూరి సుబ్బు, బీసీ నాయకులు పాల్గొన్నారు.



బీసీ సదస్సులో మాట్లాడుతున్న బాలాజీ

కృషి, పట్టుదలతో సాధించలేనిదేదీ లేదు

క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందిన వారిని సన్మానించిన డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 28 : కృషి పట్టుదల ఉంటే సాధించలేనిదేది లేదని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసిహారెడ్డి అన్నారు. ఖోఖో క్రీడల్లో రాణించి ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతులను ఆదివారం ఉగ్ర ఆయన క్యాంప్ కార్యాలయంలో ఘనంగా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రతి వ్యక్తిలోనూ ఏదో ఒక కోణంలో ప్రతిభ దాగి ఉంటుందన్నారు. అయా ప్రతిభను గుర్తించి వారిని ఆ మార్గంలో రాణించేలా ప్రోత్సాహన్ని ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆ కోవలో ఎంఎస్ఎం, ఎంఎస్ఆర్ కళాశాలలు ఉండడం అభినందించ దగిన విషయమన్నారు. అందుకే క్రీడారంగం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలను రాశి, సావిత్రమ్మ సాధించారన్నారు. మండలంలోని పాతపాడు హైస్కూల్‌లో విద్యను నభ్యసిస్తూ 9వ తరగతి నుంచి ఖోఖో క్రీడలపై ఆశక్తితో పోటీలలో పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో రాణించడంతో పాటు డీఎస్సీలో ఉద్యోగం సాధించి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)గా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం గర్వకారణమని ఉగ్ర అభినందించారు. 2018 సెప్టెంబరులో ఇంగ్లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ ఖోఖో పోటీలలో ఇండియా తరుపున ఆడి బంగారు పతకం సాధించారని పీడీ విశ్వనాథ్‌రెడ్డి ఉగ్రకు వివరించారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన యువతులను డాక్టర్ ఉగ్ర ఘనంగా సత్కరించి సన్మానించారు.

పొద్దున్నే చాయ్ స్టాళ్ల వద్ద ఉగ్ర ముచ్చట

పేద, బడుగు వర్గాల ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు టీడీపీ ఇన్‌చార్జి ఉగ్ర ఆదివారం సరికొత్త ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో వివిధ సెంటర్లలో ఉన్న టీ దుకాణాల వద్దకు వచ్చి ప్రజలను ఆశ్చర్య పరిచారు. ఆయన ను చూడగానే ప్రజలు, వ్యాపారులు, పార్టీలకతీతంగా పలువురు వచ్చి శుభోదయం తెలిపారు. ఈ సందర్భంగా వారితో ఉగ్ర చాయ్ తాగుతూ ముచ్చటించారు. ప్రధాన సమస్యలు, వాటికి పరిష్కార సూచనలను ప్రజలను తెలుసుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ చినమస్తాన్‌తో పాటు ప్రముఖ ఆర్యవైశ్య ప్రముఖులు ఆయన వద్దకు వచ్చి సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. అనంతరం వారికి వీడ్కోలు చెప్పి అక్కడి నుంచి మరో సెంటరులోని టీ దుకాణం వద్దకు వెళ్లి దాదాపు 4 గంటల పాటు సూర్యోదయ సమయాన్ని ఉగ్ర ప్రజలతో కలసి ఆస్వాదిస్తూ గడిపారు.

చతికిలపడ్డ సగిలేరు అభివృద్ధి



నాడు టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

- టీడీపీ హయాంలో నిధులు మంజూరు
- అటకెక్కించిన వైసీపీ
- భయంభయంగా కాలం వెళ్లదీస్తున్న ప్రజలు

గిద్దలూరు, జనవరి 28 : మాది సంక్షేమ ప్రభుత్వమని డబ్బా కొట్టుకునే వైసీపీ ప్రభుత్వం గిద్దలూరు పట్టణ ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ప్రాజెక్టును అటక ఎక్కించింది. దీనికి కేటాయించిన నిధులను ఇతర పథకాలకు దారి మళ్లించింది. పెద్దపాటి వర్షం కురిస్తే ఎప్పుడు ముంపుకు గురవుతామోనని పట్టణ ప్రజలు బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారు.

సగిలేరు నది గిద్దలూరు పట్టణం నుంచి వెళుతోంది. పెద్ద వర్షాలు వస్తే, నీరు సక్రమంగా పోయే మార్గం లేక నేరుగా పట్టణాన్ని ముంచెత్తుతోంది. పలు సందర్భాలలో పట్టణంలోని చాలా ప్రాంతాలు నీటిముంపునకు గురయ్యాయి. దీంతో కోట్లాది రూపాయాల ఆస్తినష్టం సంభవించింది. ఇక ప్రాణనష్టం సంబవించిన ఘటనలు ఉన్నాయి. సగిలేరునది కాలక్రమేణ పూడిపోతూ కంప చెట్లకు, పిచ్చిచెట్లకు ఆవాసంగా మారుతోంది. దీంతో వర్షం వచ్చిన సమయంలో నీరు జనావాసాల్లో వస్తోంది. దీంతో ప్రజలు తమ ప్రాణాలను కాపడుకునేందుకు ఇళ్ల పైకి ఎక్కడమో, ఇళ్లకు తాళాలు వేసి బయట ప్రాంతానికి తరలివెళ్లడమో చేస్తున్నారు. అదృష్టవశాత్తు సగిలేరు ముంపు నీరు పగటి సమయం లోనే వస్తుండ డంతో కనీసం ప్రజలకు ప్రాణాలు దక్కుతు న్నాయి. రాత్రివేళ వస్తే ఆయో మయ పరిస్థితి నెలకొంటుం దని, బయటకు వెళ్లే వీలుకూడా లేక ప్రాణాలు కోల్పోవలసిన పరిస్థితి నెలకొంటుందన్నారు. నీళ్లు ఇళ్లలోకి వచ్చిన ప్రతిసారి ఒక్కో కుటుంబం కనీసం రూ.లక్ష నుంచి రూ.3 లక్షలమేర ఇంటిలోని వస్తువులు నీటిలో తడిచి నష్టపోవా లసిన పరిస్థితి ఏర్పడుతోంది. పట్టణ ప్రజలకు నీటి ముంపు నుంచి కాపాడేందుకు గత ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.14.5 కోట్ల నిధులును మంజూరు చేయించారు. 2019 మార్చిలో పనులను ప్రారంభిం చేందుకు వీలుగా శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడం చకచకా జరిగిపోయాయి. అయితే వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే మంజూరైన రూ.14.5 కోట్ల నిధులను ఖర్చు చేయకుండా తాత్కాలికంగా ఈ ప్రాజెక్టును రద్దు చేశారు. ఈ నిధులను ఇతరత్రా అవసరాలకు మళ్లించింది. వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్లు కావస్తున్నా మంజూరైన ఈ ప్రాజెక్టుకు మళ్ళీ నిధులు కేటాయించలేదు. కనీసం చిన్నపాటి అభివృద్ధి పనులు కూడా చేయకపోవడంతో తుఫాన్లు వచ్చి పెద్ద వర్షాలు కురిసిస్తే సగిలేరునది వెంట ఉన్న వీధుల్లోని ప్రజలందరూ బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు.

ప్రాజెక్టు వివరాలు ఇవే..

అప్పటి ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి సగిలేరు నీటి ముంపు నుంచి శాశ్వతంగా పట్టణ ప్రజలను దూరం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆ మేరకు ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. సగిలేరునదిలో పెరిగిన కంప, పిచ్చిచెట్లను పూర్తిగా తొలగించాలి. కాలువల్లో పూడికను పూర్తిగా తొలగించి ఆక్రమణలను సైతం తీసివేయాలి. వీలున్నంత వెడల్పుగా నదిని అభివృద్ధి చేయాలి. అలాగే 3 ప్రాంతాల్లో పెద్దపాటి చెక్‌డ్యాంలు నిర్మించాలి. పోరుమామిళ్ల రోడ్డులో, నంద్యాల రోడ్డులో సగిలేరునదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్స్ (రక్షణ గోడలు) నిర్మించాలి. దీని వలన ఎక్కువ నీరు నిలబడడమే కాకుండా చెక్‌డ్యాంల వద్ద నీటి నిలువ వలన భూగర్భజలాలు పెరిగి పట్టణంలోని బోర్లకు సమృద్ధిగా నీరు అందే అవకాశం ఉంటుంది. అలాగే పూడిక తీయడం వలన సులభంగా నీరు ముందుకు వెళ్లి పట్టణంలోని ఇళ్లలోకి నీరు రాకుండా ఉంటుంది. పట్టణంలోని 3వ వంతు భాగం ప్రజలకు నీటి ముంపు నుంచి కాపాడే ఈ ప్రాజెక్టుకు నిధులను అప్పట్లో కేటాయించారు. అయితే మంజూరైన నిధులను ఖర్చు పెట్టాలని, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోకొరెడ్డి ఆధ్వర్యంలో అటు పార్టీశ్రేణులు, ఇటు ప్రజలు బహిరంగంగానే సగిలేరునది వద్ద ఇటీవల ఆందోళన చేశారు. అయితే ప్రభుత్వం ఈ ఆందోళనను సైతం పోలీసుల ద్వారా అడ్డుకున్న విషయం అందిరికీ తెలిసిందే. బీజేపీ నాయకులు సైతం సగిలేరు ముంపు పై అనేక పర్యాయాలు వినతిపత్రాలు అందజేశారు. ఏది ఏమి చేసినా ఒక్క రూపాయి నిధులను కూడా ప్రభుత్వం విదిల్చలేదు. ఇక స్థానిక ప్రజాప్రతినిధులు సైతం దీని గురించి పట్టించుకోలేదు. దీంతో ముంపు బాధితుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వం కళ్లు తెరిచి నిధులు విడుదల చేసి పనులు మొదలుపెట్టి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సగిలేరునది ప్రహించే మార్గంలో ఏర్పడిన పూడిక

అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధం

- రూ.30 వేల నష్టం



పెద్ద దోర్నాల, జనవరి 28: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైన ఘటన మండలంలోని చిన్నదోర్నాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన అరికట్ల శేషిరెడ్డి గడ్డివామి దగ్ధమైంది. గడ్డికి మంటలు అంటుకొని పెద్దగా పొగవచ్చింది. గమనించిన గ్రామస్థులు కొందరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అసలే వర్షాభావంతో పశువులకు మేత కరువైంది. ఇతర ప్రాంతాల నుండి అధిక ధరలు వెచ్చించి 3 ట్రాక్టర్లు ఎండు గడ్డి కొనుగోలు చేసి దొడ్లో వామిగా వేసుకున్నామని ఎలా జరిగిందో తెలియదు కాని రూ.30వేల విలువైన పశుగ్రాసం బూడిదపాయిందని రైతు ఆవేదన వెలిబుచ్చాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

అర్ధవీడు మండలంలో పురుష ఓటర్లే అధికం

కంభం (అర్ధవీడు), జనవరి 28 : అర్ధవీడు మండలంలో పురుష ఓటర్లు అత్యధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. మండలంలోని 14 పంచాయతీల్లో ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. వెలగలపాయ పంచాయతీలో పురుషులు 431, మహిళలు 385, మొత్తం 816 ఓట్లు, బొమ్మిలింగంలో పురుషులు 337, మహిళలు 324, మొత్తం 662 ఓట్లు, గన్నేపల్లిలో పురుషులు 515, మహిళలు 446, మొత్తం 961 ఓట్లు, రంగాపురంలో పురుషులు 553, మహిళలు 481, మొత్తం 1035 ఓట్లు, యాచవరంలో పురుషులు 889, మహిళలు 848, మొత్తం 1735 ఓట్లు, మాగుటూరులో పురుషులు 1126, మహిళలు 1112, మొత్తం 2238 ఓట్లు, కాకర్లలో పురుషులు 1057, మహిళలు 1091, మొత్తం 1149 ఓట్లు, నాగులవరంలో పురుషులు 919, మహిళలు 981, మొత్తం 1900 ఓట్లు, దొనకొండలో పురుషులు 745, మహిళలు 749, మొత్తం 1494 ఓట్లు, అర్ధవీడులో పురుషులు 2132, మహిళలు 2165, మొత్తం 4287 ఓట్లు, బొల్లుపల్లిలో పురుషులు 954, మహిళలు 925, మొత్తం 1879 ఓట్లు, పాపినేనిపల్లిలో పురుషులు 1232, మహిళలు 1212, మొత్తం 2446 ఓట్లు, మొహిద్దీన్‌పురంలో పురుషులు 832, మహిళలు 844, మొత్తం 1676 ఓట్లు, బోగోలులో పురుషులు 457, మహిళలు 481, మొత్తం 938 ఓట్లు ఉన్నాయి. అర్ధవీడు మండలంలో పురుషులు 14049, మహిళలు 13897, మొత్తం 27951 ఓట్లు ఉన్నాయి.

విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలి

పొదిలి, జనవరి 28 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలని విశ్వబ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని స్థానిక సామంతపూడి అడితిలో ఏర్పాటు జిల్లా కార్యవర్గం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులను ఏ పార్టీ గుర్తించి రెండు అసెంబ్లీ సీట్లు కేటాయిస్తుందో వారికి మా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామి ఇచ్చిందని ఆతరువాత ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. అదే విధంగా పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ఉచితంగా ఉపనయనాలు చేసే విధంగా కనిగిరి పురోహితులు నిర్ణయించినట్లు తెలిపారు. కనుక జిల్లాలో ఉన్న విశ్వబ్రాహ్మణ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈసందర్భంగా జరుగుమల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థికి ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో సుతరం శ్రీనివాసులు, కుందుర్తి సీతారామాంజనేయలు, ఈశ్వరాచారి, సామంతపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

900 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

- ఎస్‌ఈబీ, పోలీసుల మూకుమ్మడి దాడి



బెల్లం ఊటను ధ్వసం చేస్తున్న పోలీసులు

గిద్దలూరు టౌన్, జనవరి 28 : అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన బెల్లంఊటను ఎస్‌ఈబీ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, గిద్దలూరు ఎస్సై మహేష్ సిబ్బందితో కలిసి ధ్వంసం చేశారు. ఎస్‌ఈబీ సీఐ కొండారెడ్డి కథనం ప్రకారం.. గిద్దలూరు మండలం ఓబులాపురం తాండా అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్నట్లు ఎస్‌ఈబీ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఈబీ సిబ్బంది, గిద్దలూరు ఎస్సై మహేష్, సిబ్బంది కలిసి దాడి చేసి 900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బెల్లంఊట యజమానిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. గిద్దలూరు సర్కిల్ పరిధిలో కొమరోలు, రాచర్ల, గిద్దలూరు పరిసర ప్రాంతాలలో ఎవరైనా అక్రమ మద్యం తరలించినా, అమ్మినా, నాటుసారా తయారు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గిద్దలూరు టౌన్, జనవరి 28 : మండలంలోని ఆదిమూర్తిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న ఆటోను కారు ఢీకొట్టడంతో 12 మంది గాయపడ్డారు. 108 సిబ్బంది వీరందరినీ గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మెరుగైన వైద్యం కోసం వీరిని కర్నూలు తరలించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

గిద్దలూరు, జనవరి 28 : పట్టణంలోని శ్రీవివేకానంద కళాశాలలో 1975-77 ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహిం చారు. ఆనాటి విద్యార్థి దశస్మృతులను విద్యార్థులతో ఉపాధ్యాయులకు ఉన్న అనుబంధాన్ని, ఆనాటి సమాజ, కుటుంబ పరిస్థితులను ఒకరికొకరు చర్చించుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను స్మరించుకున్నారు. 46 ఏళ్ల తరువాత తొలిసారిగా కలిసి ఒకరి పరిస్థితులను మరొకరికి తెలియజేసుకుని సుఖసంతోషాలను, సాదకబాధలను పూర్వవిద్యార్థులు పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పన, ప్రస్తుత డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ పోలిరెడ్డి, మురళీకృష్ణ, పూర్వ విద్యార్థుల ప్రతినిధులు బొంతల రామ్మోహన్‌రావు, టి.రాంప్రసాద్, పి.శంకర్‌రెడ్డి, ఒ.భాస్కర్‌రెడ్డి, ఎం.వీరయ్య, పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

- మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- గిద్దలూరులో జయహో బీసీ సభ
- టీడీపీ కార్యక్రమాలపై అవగాహన

బేస్తవారపేట, జనవరి 28 : రాష్ట్రం లో బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం అని గిద్దలూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోకొరెడ్డి అన్నారు. పార్టీ అదేశాల మేరకు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న 'జయహో బీసీ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బేస్తవారపేటలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ముత్తుముల అశోకొరెడ్డి మాట్లాడారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి బీసీలకు సంక్షేమం అందించకపోగా, వారిపై దాడులు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు టీడీపీ హయంలో బీసీల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. బీసీ కార్పోరేషన్ ద్వారా రాయితీ రుణాలు, విదేశీ విద్య, చేతివృత్తుల వారికి ఉపకరణాలు, మండల కేంద్రాలలో బీసీ భవనాల నిర్మాణం వంటి సంక్షేమ పథకాలను అందిస్తే రాష్ట్రంలో నియంత పాలన చేస్తున్న బీసీ ద్రోహి జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో బీసీలంతా తగిన బుద్ధి చేప్పాలన్నారు. మన రాష్ట్రానికి నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు సైదులు ప్రధాన కార్యదర్శి ముప్పూరి రాము, గుంటక నరసింహయాదవ్, పూనూరు భూపాల్‌రెడ్డి, చెట్టిచెర్ల మాజీ సర్పంచ్ తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, దూదెకుల ఆదాం, బోయిళ్ల రోషన్‌బాబు, బీసు అరుణ్ కుమార్, ఇస్లాంపేట రషీద్, రావిపాడు కోటయ్య, పోలిశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముత్తుముల అశోకొరెడ్డి

గిద్దలూరు వైసీపీ టికెట్ స్థానికులకే కేటాయించాలి

- బాలినేని అయితే ఓకే
- అన్నా రాంబాబు నాన్‌లోకల్
- కార్యకర్తల సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు

బేస్తవారపేట, జనవరి 28 : గిద్దలూరు అసెంబ్లీ టికెట్ వైసీపీ తరపున స్థానికేతరులకు కేటాయిస్తే సహకరించేది లేదని పలువురు నాయకులు పేర్కొన్నా రు. బేస్తవారపేటలో ఆ పార్టీ నియోజక వర్గ స్థాయి, నాయకులు కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎంపీపీ వేగనాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఎంపీపీ ఓసూరారెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు టికెట్ స్థానికులకే కేటాయించాలన్నారు. స్థానికేతరులకు కేటాయిస్తే సహకరించేది లేదన్నారు. స్థానికులకు కేటాయించకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు వెళ్లి తేల్చుకుంటామన్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి కాని ఆయన కుటుంబంలో ఎవరో ఒకరికి టికెట్ కేటా యించినా, నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలు సహకరిస్తారన్నారు. కొమరోలు ఎంపీపీ కామూ రి అమూల్యా మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గం చాలా వెనుకబడిన ప్రాంతమన్నారు. అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైన ఎంతైన ఉందన్నారు. అధిష్ఠానం రోజుకొక పేరును చర్చకు తీసుకురావడంతో నియోజకవర్గంలో ప్రజలు అయోమయంలో పడుతున్నారన్నారు. 2019 ఎన్నికల్లో స్థానికేతరులైన అన్నా రాంబాబుకు టికెట్ కేయించినప్పటికి రాష్ట్రంలోనే మెజారిటీలో రెండో స్థానం తీసుకొచ్చామన్నారు. గతంలో పరిస్థితి ఇప్పుడు లేదని, ఎమ్మెల్యే రాంబాబుకు స్థానికంగా నివాసం కూడా లేదన్నారు. ఆయన్ను కలవడం పార్టీ కార్యకర్తలకు ప్రహసనంగా మారుతోందన్నారు. ఆయన చుట్టపు చూపుగానే వచ్చి పోతున్నారన్నారు. రాంబాబు నాన్‌లోకల్ అని, ఆయన అనేక పార్టీలు మారారని అన్నారు. గతంలో జగన్ మోహన్‌రెడ్డిని చూసి ఓట్లు వేసినట్లు తెలిపారు. ఆయనకు మద్దతు తెలిపేందుకు కార్యకర్తలో ఆసక్తి లేదన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, అర్ధవీడు జడ్పీటీసీ సభ్యులు చెన్ను విజయ్, సీనియర్ నాయకులు బోల్లా బాలిరెడ్డి, అర్ధవీడు నేత పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

సమావేశానికి ఆశావహులు దూరం

గిద్దలూరు ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే కేటాయించాలని ఏర్పాటు చేసిన సమావేశానికి ఆ పార్టీ ఆశావాహులు దూరంగా ఉన్నారు. గంట ముందు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చి సమావేశంలో పాల్గొనప్పటికీ, అనంతరం విలేకర్ల సమావేశంలో పాల్గొనలేదు. టికెట్ ఆశిస్తున్న వారు కామూరి రమణారెడ్డి, చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ బ్రహ్మానందారెడ్డి, గిద్దలూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఆర్డీరామకృష్ణ తదితరులు విలేకర్ల సమావేశానికి దూరంగా ఉన్నారు.

కల్లబొల్లి కబుర్లకు కాలం చెల్లింది

- వైసీపీ మూటాముల్లె సర్దుకోవాలి
- వెలిగొండ పూర్తి చేయాలని పాదయాత్ర

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 28 : కల్లబొల్లి మాటలకు కాలం చెల్లిందని వైసీపీ నాయకులు మూటా,ముల్లె సర్దుకోవాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ చేస్తున్న పాదయాత్ర ఆదివారం ప్రారంభమైంది. స్థానిక జనసేన కార్యాలయం వద్ద పెద్దఎత్తున టీడీపీ-జనసేన కార్యకర్తలు వీరమహిళలు చేరుకున్నారు. కోలాహలంగా పాదయాత్ర ప్రారంభం కాగా మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల సారధ్యంలో రాష్ట్రంలో రానున్న ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. వెలిగొండ పూర్తి చేసి మార్కాపురం జిల్లా కూడా ఇస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా వైసీపీ నాయకుల కాలక్షేపం చేశారు. ఎన్నికల ముందు ప్రాజెక్టు పూర్తి అయిందని ఆర్భాటం చేయటం హాస్యాస్పదం అన్నారు. అకిలపక్ష కూటమి ఏర్పాటు చేసి ప్రాజెక్టు పూర్తి అయిందో లేదో నిజనిరూపణ చేయాలన్నారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్ల త్యాగం చేసిన నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ వెంటనే ఇవ్వాలన్నారు. 41 గ్రామాలు, 4 మండలాలు, 140 కి.మీ మేర 10 రోజుల పాటు పాదయాత్ర ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.సత్యనారాయణ, మల్లికార్జున్, వీరబ్రహ్మం, మౌలాలి, శ్రీనివాసులు, రమణ, రంగస్వామి, గులాబ్ ఖాన్, హుస్సేన్ ఖాన్, మాజీ కౌన్సిలర్ కందుల నారాయణరెడి జనసేన రాష్ట్ర అధకార ప్రతినిధి రాయపాటి అరుణ, రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్, వై.పాలెం ఇన్‌చార్జ్ గౌతంరాజ్, జనసేన జిల్లా కార్యదర్శులు రహిముల్లా, నరసింహారావు, సురేష్, పీవీ సుబ్బారావు, జనసేన నాయకులు గౌతమ్, రమేష్, ఏ.స్వాములు, ఎస్.శీను, కాశీరామ్, జనసేన వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు. సీపీఎం నాయకులు సోమయ్య, రఫి, రూబెన్, జనుమాల నాగయ్యలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.



కాశీనాథ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వైభవంగా రామయోగి స్వామి తిరునాళ్ల



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రగొండపాలెం, జనవరి 28: నియోజక వరంలోని పలు గ్రామాల్లో వెలసిన రామయోగిస్వామి తిరుణాళ్ల ఉత్సవం సందర్భంగా ఆదివారం రామయోగి స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 110 సంవత్సరాల క్రితం రామయోగిస్వామి ఈ ప్రాంతంలో ఉండి తాను శక్తితో భక్తుల కోర్కెలు తీర్చేవారని భక్తులు నమ్మకం. కుర్చేడు మండలం పొట్లపాడు గ్రామంలో సజీవసమాధి అయ్యారు. ఆయన జీవించే ఉన్న కాలంలో ఎర్రగొండపాలెం మండలం నరసాయపాలెం, సర్వాయపాలెం, పుల్లలచెరువు మండలం చెన్నపల్లి గ్రామం, త్రిపురాంతకం మండలం ఎండూరివారిపాలెం గ్రామాల్లో పర్యటించారన్నారు. ఏటా పుష్యమాసం తదియరోజున ఆయన ఉత్సవాలను నిర్వమించుకుంటున్నారు. ఈ క్రమంలోనే యాత్రకు విశేషంగా ఉత్సవం నిర్వహించారు

మూడు గ్రామాల్లో విద్యుత్తు ప్రభలు

మండలాల స్వామి నరసాయపాలెంలో టీడీపీ, వైసీపీ పార్టీల తరుపున రెండు ఎలక్ట్రికల్ ప్రభలు నిర్మించారు. పుల్లలచెరువు మండలం చెన్నపల్లి గ్రామంలో టీడీపీ పార్టీనాయకులు రెండు ప్రభలు, వైసీపీ పార్టీ నాయకులు ఒక ప్రభ, త్రిపురాంతకం మండలం ఎండూరివారిపాలెంలో టీడీపీ 1ప్రభ, వైసీపీ పార్టీ 1 ప్రభను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పాల్గొంటారు.

గుండెపోటుతో ఆరోగ్య కార్యకర్త మృతి

- ఉద్యోగం రెగ్యులర్ కాదేమోనని వేదన



శ్రీనివాసులు (ఫైల్)

ముండ్లమూరు, జనవరి 28 : ఉద్యోగం రెగ్యులర్ కాదన్న ఆందోళ నతో ఆరోగ్య కార్యకర్త మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరా ల్లోకి వెళితే.. మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన ఎర్రగొర్ల శ్రీనివాసులు (47) వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో 2003 నుంచి బాపట్ల జిల్లా అద్దంకి మండలం మోదేపల్లి పీహెచ్‌సీలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఇటీవల జగన్‌రెడ్డి ఆరోగ్య కార్యకర్తలందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి ఐదు నెలలైంది. నాలుగు రోజులుగా ఒంగోలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ నిమిత్తం శ్రీనివాసులు రోజూ వెళ్లి వస్తున్నారు. ఐనా తాను రెగ్యులర్ అవుతానో కాదోనని ఆందోళన చెందుతూ తన తోటి కాంట్రాక్ట్ ఉద్యోగులకు చెప్పి మదనపడుతున్నారు. శనివారం ఒంగోలు వెళ్లి కార్యాలయంలో పొద్దుపోయేవరకూ ఉండి తిరిగి మారెళ్ల వస్తుండగా బస్సులోనే గుండెపోటుకు గురయ్యారు. దీంతో స్నేహితులు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే శ్రీనివాసులు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న తోటి సిబ్బంది, అద్దంకి, ముండ్లమూరు, మారెళ్ల, మోదేపల్లి వైద్యాధికారులు మృతదేహానికి నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి, కార్యదర్శి రాజు, సిబ్బంది సుభానీ నివాళులర్పించారు.

అవీ..ఇవీ..

వైభవంగా ధ్వజస్తంభ గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు

త్రిపురాంతకం, జనవరి 28: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కోసం కృష్ణా జిల్లా చెరుకుపల్లి నుంచి తెచ్చిన ధ్వజస్తంభానికి ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు విశ్వన్నారాయణశాస్త్రి, ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని ధ్వజస్తంభ వాహనాన్ని అనుసరిస్తూ కొబ్బరికాయలు కొట్టారు. మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య 53 అడుగుల పొడవైన ధ్వజస్థంభాన్ని ఒక ప్రత్యేకమైన ట్రాక్టరులో మండల కేంద్రంలోని ఐఓసీ పెట్రోలు బంకు నుంచి ప్రధాన రహదారి మీదగా, వైపాలెం కూడలి, అక్కడి నుండి స్వామి వారి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు.

31న సర్వసభ్య సమావేశం

కంభం, జనవరి 28 : ఈ నెల 31న బుధవారం ఉదయం 10.30 గంటలకు కంభం ఎంపీడీవో కార్యాలయం సమావేశం హాలులో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో గ్రామీణ నీటిసరఫరా, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, గృహనిర్మాణ, మొత్తం 22 శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా అధికారులందరూ పాల్గొనాలని ఎంపీడీవో తెలిపారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్‌డీవో

పొదిలి, జనవరి 28 : జగనన్న కాలనీలకు సంబంధించి ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కనిగిరి ఆర్డీవో జాన్ ఎర్విన్ ఆదివారం పరిశీలించారు. స్థానిక పట్టణంలో మూడవ సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను వేగవంతం చేయాలని అందుకు ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తెలియజేయాలన్నారు. తాత్సారం చేయకుండా ముందుకు సాగాలన్నారు. ఈయన వెంట వీఆర్వోలు కిలారి సుబ్బారావు, నారాయణలు ఉన్నారు.

ఎస్టీయూ అధ్యక్షుడిగా జగన్‌బాబు




జగన్‌బాబు, నూర్ అహ్మద్ (ఫైల్)

తర్లుపాడు, జనవరి 28: స్థానిక శ్రీశక్తి భవన్ కార్యాలయం వద్ద తర్లుపాడు మండలం ఎస్టీయూ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ మండల అధ్యక్షులుగా కశ్శెట్టి జగన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా షేక్ నజీర్ అహ్మద్, కోశాధికారిగా అంజలికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎస్టీయూ అధ్యక్షులు కె.ఎర్రయ్య తెలిపారు. ఎన్నికల అధికారిగా అక్కల నారాయణ, ఎస్.ప్రసాద్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జగన్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు శాయాశక్తుల కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ మౌలాలి, ఆర్.సంజీవ్ కుమార్, బండి రాజారమేష్, సుబ్బారావు, అబ్దుల్ సుకూర్, సందలూరు కాశయ్య నరేంద్ర కుమార్, రంగస్వామి రెడ్డి, గంగుల రామచంద్రుడు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి



ఐక్యంగా అభివాదం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 28: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు దేవెండ్ల బాలయ్య అన్నారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బీసీ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.ఈ.వెంకటేశ్ మాట్లాడుతూ బీసీ సమగ్ర కులగణను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలన్నారు. మండల కమిషన్ సూచించినట్లుగా విద్యా ఉద్యోగ నియామక ప్రవేశాలలో 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. హైకోర్టు న్యాయవాది ఎస్ఎస్ఎన్.రాజు యాదవ్ మాట్లాడుతూ.. చట్టసభలో జనాభా దామాషా ప్రకారం అన్ని కులాల వారికి రిజర్వేషన్ కల్పించాలని అప్పుడే సమసమాజ స్థాపన సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అధ్యాపకులు అల్లూరయ్య, ఉపాధ్యాయ జేఏసీ మహాసభ నాయకులు రంగనాయకులు, శ్రీనివాసులు, జ్యోతిబాపూలే టీచర్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎ.శ్రీనివాసులు, సురేష్, రవి, బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు భాస్కర్, ఎల్ఐసీ నాయకులు మురళీధర్, బీసీఈఏ నాయకులు వెంకటేశ్వర్లు, బాలరంగయ్య, లక్ష్మీనారాయణ, ఎం.సుధాకర్, ఎంఈవో పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘ డైరీ ఆవిష్కరణ

గిద్దలూరు, జనవరి 28 : పట్టణంలోని మడియాలస్వామి ఆవరణలో రజక సంఘ డైరీని ఆ సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పదో తరగతి విద్యార్థులకు, అనాథలకు స్కాలర్‌షిప్‌లు అందచేస్తామని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు కొండేటి రాజు, భూతరాజు వెంకటేశ్వర్లు, వేములపాటి శేఖర్, కె.ప్రసాద్, పాలకవీటి బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చలో చెన్నైను జయప్రదం చేయాలి

గిద్దలూరు టౌన్, జనవరి 28 : అఖిల భారత సంఘం నిర్వహిస్తున్న స్టూడెంట్ మార్చ్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి జీవన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న జీవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు కాపాడుకునేందుకు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు తేజ, నారాయణ, కుమార్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలి



మాట్లాడుతున్న కంచర్ల కోటయ్యగౌడ్

గిద్దలూరు టౌన్, జనవరి 28 : బహుజనులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని బహుజన నాయకులు రాచర్ల కోటయ్య గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక మహాత్మ జ్యోతి బాపూలే పార్కు నందు బహుజన ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచర్ల కోటయ్యగౌడ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే అంబేద్కర్ భవనం ఏర్పాటు చేయాలన్నారు. బహుజనులు సమిష్టిగా కొనసాగితే రాజ్యాధికారం దిశగా అడుగులు పడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.ఎల్.రాముానాయక్, పి.కృపారక్షన్‌రాజు, ఎ.కోటేశ్వరరావు, ఐ.జయరావు, తదితరులు పాల్గొన్నారు.

శివరాజ్‌నగర్‌లో చోరీ

బంగారు ఆభరణాల అపహరణ

దర్శి, జనవరి 28 : దర్శి నగర పంచాయతీలోని శివరాజ్‌నగర్‌లోని ఒక ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి సుమారు రూ.2లక్షల విలువైన బంగారు ఆభరణాలను అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం.. శివరాజ్‌నగర్‌కు చెందిన ఓర్సు శైలజ ఇంటికి తాళాలు వేసి శనివారం ఒంగోలు ఆసుపత్రికి వెళ్లారు. ఆమె వైద్యం చేయించుకొని రాత్రి సుమారు 9గంటల సమయానికి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరచి, బట్టలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. బీరువాలోని ఏడు సవర్లు బంగారు నగలు, రూ.6వేలు నగదును దొంగలు ఎత్తుకెళ్లారని బాధితురాలు ఆదివారం ఏఎస్సై రాంబాబుకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ సంఘటనా స్థలంను పరిశీలించి అక్కడ వేలి ముద్రలు సేకరించి నిందితుల కోసం గాలిస్తున్నారు.

వరుస దొంగతనాలతో హడలెత్తుతున్న ప్రజలు

దర్శి ప్రాంతంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు హడలెత్తుతున్నారు. ఒక ముఠా పథకం ప్రకారం తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. దర్శి మండలంలోని వెంకటచలంపల్లి రైతు భరోసా కేంద్రం తాళాలు పగులకొట్టి గుర్తు తెలియని దుండగులు టీవీ, కంప్యూటర్, కీబోర్డు, వైఫైసెట్‌ను ఎత్తుకెళ్లారు. అంతకముందు నాలుగురోజుల కిందట కురిచేడు మండలం పొట్లపాడు రైతుభరోసా కేంద్రంలో తాళాలు పగులకొట్టి కంప్యూటర్, టీవీ ఇతర సామగ్రిని అపహరించుకెళ్లారు. తాజాగా శివరాజ్‌నగర్‌లో మహిళ ఇంట్లో లేని సమయంలో తాళాలు పగులకొట్టి బంగారు నగలు అపహరించుకెళ్లిన సంఘటన తెలిసిందే. వారం రోజుల వ్యవధిలో వరుసగా దొంగతనాలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి దొంగలను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఉదాసీన వైఖరి అవలంబిస్తే మరిన్ని దొంగతనాలు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన మిర్చి ఘాటు..!

- పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- తగ్గిన దిగుబడులు
- నెల వ్యవధిలోనే క్వింటాకు రూ.4వేలు తగ్గిన ధరలు
- ఆందోళనలో రైతులు



ఉమామహేశ్వర అగ్రహారంలో కల్లాల్లో ఆరబెట్టిన ఎండు మిర్చి



కల్లంలో గ్రేడ్ చేస్తున్న కూలీలు

ముండ్లమూరు, జనవరి 28 : మండలంలో ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతులకు ఘాటు తగ్గింది. వరుస తెగుళ్ల కోలుకోక ముందే ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. దీంతో మిర్చి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన పెట్టుబడులు ఒక వైపు, దిగుబడులు చూస్తే మరొక వైపు, మిర్చి రైతును కన్నీరు పెట్టిస్తున్నాయి. ఎకరానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. ఇటీవల కురిసిన వర్షానికి బొబ్బర, జెమినీ, ఆకు ముడత తెగుళ్లు సోకడంతో దిగుబడి కూడా గణనీయంగా పడిపోయింది. ఎకరానికి 40 క్వింటాళ్లు కావాల్సిన మిర్చి తోటలు, 20 క్వింటాళ్లకే పడిపోయాయి. దీంతో రైతులు పెట్టుబడి పోను కూలి, కోత, ఖర్చులకే సరిపోయే పరిస్థితి ఏర్పడింది. మండలంలో ఖరీఫ్, రబీలో కలిపి రూ.5,450 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. ప్రధానంగా తేజ రకంగా ఎక్కువగా సాగు చేశారు. 341, 334, ఆరుమూరు అనే రకాల సాగు చేశారు. ప్రస్తుతం గత 15 రోజుల నుంచి ముమ్మరంగా మిర్చి కోతలు కోసి కల్లాల్లో ఆర బెట్టారు. అమ్మకాలు కూడా చేస్తున్నారు. కొంత మంది రైతులు గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి అమ్ముకుంటుండగా మరి కొంత మంది రైతులు కల్లాల్లోనే దళారులకు అమ్ముకుంటున్నారు. తేజ రకం రూ.20వేలు, 341 అనే రకం క్వింటా రూ.17,500, 334 అనే రకం రూ.19వేలు, ఆర్మూరు అనే రకం రూ.15వేలకు కొనుగోలు చేస్తున్నారు. దళారులైతే ఇంకా రేట్లు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో అసలే తెగుళ్లతో దిగుబడి రాక మిర్చి సాగు చేసిన రైతులు అల్లాడుతుంటే మరో వైపు దళారులు నిలువునా మిర్చి రైతులను మోసం చేస్తున్నారు. మండలంలోని పసుపుగల్లు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, నాయుడుపాలెం, తమ్మలూరు, పసుపుగల్లు, పోలారం, శంకరాపురం, ముండ్లమూరు, నూజెండ్లపల్లి, నాయుడుపాలెం, సుంకరవారిపాలెం గ్రామాల్లో అత్యధికంగా తేజా రకాన్ని సాగు చేశారు. మిగతా రకాలుగా కూడా తక్కువగా సాగు చేశారు.

శ్యామల ఫౌండేషన్ సేవలు అభినందనీయం

మాజీ మంత్రి కాశిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 27: కనిగిరి ప్రాంతంలో విద్యాభివృద్ధికి శ్యామల కాశిరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక టెక్నో స్కూల్‌లో ఆదివారం శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనిగిరి ప్రాంత విద్యార్థులకు 12వ మెగా టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిలు కాశిరెడ్డి, ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంతానికి చెందిన శ్యామల కాశిరెడ్డి ఎంతో కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకున్నారన్నారు. తాను ఆర్థికంగా ఎదిగినప్పటికీ పుట్టిన ప్రాంతంపై మక్కువతో విద్యారంగంలో పోటీలకు దీటుగా కనిగిరి ప్రాంతానికి చెందిన విద్యార్థులు రాణించాలనే సంకల్పంతో ప్రతిభా పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారన్నారు. అందుకు ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తన తండ్రి శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ మెగా టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నందుకు అభినందనీయులన్నారు. 12 సంవత్సరాలుగా ఆర్థిక లేమితో విద్యను సాగించలేని వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్న కాశిరెడ్డి అభినందనీయులన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న 510 మంది విద్యార్థులు

శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ మెగా టాలెంట్ టెస్ట్‌లో 510 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ఐదుగురు ఎంపికయ్యారు. సీఎస్‌పురం మండలంలోని సీనాగులవరం హైస్కూల్‌కు చెందిన బీ చేతన్ 71 మార్కులు సాధించి ప్రథమ బహుమతిగా రూ.15వేలు, రెండో బహుమతిని హనుమంతునిపాడు మండలంలోని ఎస్ బ్లెస్సీ, మూడవ బహుమతిని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి శ్రీహర్ష, వెలిగండ్ల హైస్కూల్‌కు చెందిన జే మేరిజాస్మిన్ నాల్గవ బహుమతిని, వెలిగండ్ల మండలం మొగళ్లూరు హైస్కూల్‌కు చెందిన పీ స్నేహ ఐదవ బహుమతిని గెలుచుకున్నారు. ఎంపికైన వారికి కాశిరెడ్డి, డాక్టర్ ఉగ్ర, ఎంఈవోలు దేవిరెడ్డి రామిరెడ్డి, నారాయణరెడ్డి అభినందించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ హైస్కూళ్ల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదినారాయణ మృతి టీడీపీకి తీరని లోటు

ముండ్లమూరు, జనవరి 28 : మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గంగినేని ఆదినారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన దశ దిన కర్మ ఆదివారం మండలంలోని పోలవరంలో జరిగింది. దశ దిన కర్మకు ముఖ్య అతిథులుగా హాజరైన దర్శి నియోజక వర్గ జనసేన పార్టీ నాయకులు గరికపాటి వెంకట్, జిల్లా టీడీపీ యువ నాయకులు పమిడి రమేష్ ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడవద్దని, తెలుగుదేశం, జనసేన మీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆదినారాయణ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనటమే కాక పార్టీ బలోపేతానికి కూడా తన వంతు కృషి చేశారన్నారు. వారి వెంట మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, శంకరాపురం సర్పంచ్ కూరపాటి నారాయణ స్వామి, కొర్రపాటి బుచ్చిబాబు, రావిళ్ల శ్రీనివాసరావు, కొర్రపాటి శ్రీనివాసరావు ఉన్నారు.

చలో విజయవాడకు తరలిరావాలి

కనిగిరి, జనవరి 28 : సత్వరమే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించాలని బీటీఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్ లక్కిపోగు ఆంథోని అన్నారు. స్థానిక బీటీఏ కార్యాలయంలో ఆదివారం బీటీఏ చేపడుతున్న చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గత 5 ఏళ్లుగా ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల విషయంలో సాగదీత ధోరణి అవలంబించడం అన్యాయమన్నారు. దీంతో ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ, డీఏ అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ లోన్లను చెల్లించాలన్నారు. బీటీఏ వచ్చే నెల 5వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ మండల సెక్రటరీ రంగారావు, యేసుదాసు, రాజారావు, చీర్ల మాధవరావు, డీ చెన్నకేశవులు, వెంగయ్య పాల్గొన్నారు.

రహదారులను కమ్మేసిన పొగమంచు

ముండ్లమూరు, జనవరి 28 : మండలంలోని పలు ప్రధాన రహదారులను పొగ మంచు కమ్మేసింది. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు మంచు రహదారులను వదలక పోవడంతో వాహన చోదకులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. లైట్లు వేసుకొని ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరి కొంత మంది వాహనాలను పక్కన నిలబెట్టి మంచు తగ్గాక బయలుదేరారు. అద్దంకి - దర్శి ప్రధాన రహదారి, వేంపాడు - ఈదర రహదారి, నూజెండ్లపల్లి - మారెళ్ల రహదారి, ఉల్లగల్లు - వేముల రహదారి, కెల్లంపల్లి - ఉల్లగల్లు రహదారి పూర్తిగా మంచుతో కబళించాయి. పొలాలను సైతం మంచు చుట్టుముట్టింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కృషి, పట్టుదలతో సాధించలేనిదేదీ లేదు

క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందిన వారిని సన్మానించిన డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 28 : కృషి పట్టుదల ఉంటే సాధించలేనిదేది లేదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసిహారెడ్డి అన్నారు. ఖోఖో క్రీడల్లో రాణించి ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతులను ఆదివారం ఉగ్ర ఆయన క్యాంప్ కార్యాలయంలో ఘనంగా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రతి వ్యక్తిలోనూ ఏదో ఒక కోణంలో ప్రతిభ దాగి ఉంటుందన్నారు. ఆయా ప్రతిభను గుర్తించి వారిని ఆ మార్గంలో రాణించేలా ప్రోత్సాహాన్ని ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆ కోవలో ఎంఎస్‌ఎం, ఎంఎస్‌ఆర్ కళాశాలలు ఉండడం అభినందించ దగిన విషయమన్నారు. అందుకే క్రీడారంగం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలను రాశి, సావిత్రమ్మ సాధించారన్నారు. మండలంలోని పాతపాడు హైస్కూల్‌లో విద్యను నభ్యసిస్తూ 9వ తరగతి నుంచి ఖోఖో క్రీడలపై ఆశక్తితో పోటీలలో పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో రాణించడంతో పాటు డీఎస్సీలో ఉద్యోగం సాధించి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)గా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం గర్వకారణమని ఉగ్ర అభినందించారు. 2018 సెప్టెంబరులో ఇంగ్లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ ఖోఖో పోటీలలో ఇండియా తరుపున ఆడి బంగారు పతకం సాధించారని పీడీ విశ్వనాథ్‌రెడ్డి ఉగ్రకు వివరించారు. అప్పట్లో ఇంగ్లాండ్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు రాశికి ఖర్చుల నిమిత్తం రూ.లక్షను ఉగ్ర సాయం చేసిన విషయాన్ని పీడీ గుర్తు చేశారు. కనిగిరి ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నదే తన తపన అని ఉగ్ర అన్నారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన యువతులను డాక్టర్ ఉగ్ర ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎం కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, ఏపీ ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం సీతారామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీ కాశీవిశ్వనాథరెడ్డి, పీఈటీ వై.శ్రీనివాసరెడ్డి, జాతీయ స్థాయి క్రీడాకారిణిలు పాల్గొన్నారు.

పొద్దున్నే చాయ్ స్టాళ్ల వద్ద ప్రజలతో ఉగ్ర మాటామంతీ

పేద, బడుగు వర్గాల ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు టీడీపీ ఇన్‌చార్జి ఉగ్ర ఆదివారం సరికొత్త ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో వివిధ సెంటర్లలో ఉన్న టీ దుకాణాల వద్దకు వచ్చి ప్రజలను ఆశ్చర్యపరిచారు. ఆయనను చూడగానే ప్రజలు, వ్యాపారులు, పార్టీలకతీతంగా పలువురు వచ్చి శుభోదయం తెలిపారు. ఈ సందర్భంగా వారితో ఉగ్ర చాయ్ తాగుతూ ముచ్చటించారు. ప్రధాన సమస్యలు, వాటికి పరిష్కార సూచనలను ప్రజలను తెలుసుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ చినమస్తాన్‌తో పాటు ప్రముఖ ఆర్యవైశ్య ప్రముఖులు ఆయన వద్దకు వచ్చి సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. అనంతరం వారికి వీడ్కోలు చెప్పి అక్కడి నుంచి మరో సెంటరులోని టీ దుకాణం వద్దకు వెళ్లి దాదాపు 4 గంటల పాటు సూర్యోదయ సమయాన్ని ఉగ్ర ప్రజలతో కలసి ఆస్వాదిస్తూ గడిపారు.

వైభవంగా యోగయ్యస్వామి తిరునాళ్ల

కురిచేడు, జనవరి 28 : మండలంలోని పొట్లపాడులో వెలసిన గుత్తికొండ రామ యోగిస్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగాయి. మూడు రోజుల నుంచి జరుగుతున్న తిరునాళ్ల ఆదివారంతో ముగిశాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రెండు విద్యుత్ ప్రభలు, రెండు నృత్యకోలాట ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. దర్శి వైసీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన సోమ, మంగళవారం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై దేవకుమార్ తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. తిరునాళ్లకు మండలం నుంచే కాక పరిసర మండలాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

నేరేడుపల్లి ఎస్సీ కాలనీలో కార్డెన్‌సెర్చ్

పీసీపల్లి, జనవరి 28 : పరిచయం లేని కొత్త వ్యక్తులకు ఎవరూ అశ్రయం కల్పించవద్దని ఎస్ఐ జీ కోటయ్య అన్నారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున ఇంటింటికీ తిరిగి ఆకస్మిక సోదాలను చేపట్టారు. ప్రతి ఒక్కరి ఆధార్ కార్డులను పరిశీలించి, ఇంట్లో ఉన్నవారి వివరాలను సేకరించారు. ఇంటిలోని వస్తువులు, ద్విచక్ర వాహనాలను తనిఖీచేసి వాహనాల సీబుక్‌లను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో ఎస్ఐ మాట్లాడుతూ జిల్లాతో పాటు ఇతర జిల్లాలో జరిగిన పలు నేరాల్లో ఈ కాలనీల్లో ఉన్న కొంతమందిని గతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పాత నేరస్తుల కదలికలను గుర్తించేందుకే కార్డెన్‌సెర్చ్ నిర్వహించామన్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామాలకు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కాలనీవాసులకు సూచించారు. ఈ తనిఖీల్లో సిబ్బంది కర్ణ, రవి, వెంకటేశ్వర్లు, మహేష్ ఉన్నారు.

సోమవరప్పాడులో..

తాళ్లూరు : మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో ఒంగోలు అడిషనల్ ఎస్పీ (క్రైమ్) శ్రీధర్, దర్శి డీఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటినీ సోదా చేశారు. అనుమతి పత్రాలు లేని 15 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో దర్శి సీఐ జె.రామకోటయ్య, ఎస్సై వైవీ రమణయ్య పోలీసులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

జనసేన పార్టీ నాయకుడు వెంకట్

దొనకొండ, జనవరి 28 : రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి విజయం కోసం జనసేన, తెలుగుదేశం పార్టీల నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని జనసేన దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ కోరారు. దొనకొండలోని టీడీపీ కార్యాలయానికి ఆదివారం రాత్రి చేరిన వెంకట్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం టీడీపీ అధ్యక్షుడు నాయకులు, కార్యకర్తలను గరికపాటి వెంకట్‌కు పరిచయం చేశారు. టీడీపీ మండల నాయకులు కొత్తం రఘునాథరెడ్డి, పత్తి వెంకటేశ్వర్లు, విప్పర్ల లక్ష్మీరావు, మన్నెం గాలయ్య, కొమ్మతోటి సుబ్బారావు, నిమ్మకాయల సుబ్బారెడ్డి, శృంగారపు నాగసుబ్బారెడ్డి, యరగొర్ల బసవయ్య, కుందుర్తి లక్ష్మణ్, దుగ్గెంపూడి చెంచయ్య వల్లపునేని కేశవ, ఒబ్బాపురం పవన్‌కల్యాణ్ యూత్ అభిమానులు పాల్గొని పరిచయం చేసుకున్నారు.



జనసేన పార్టీ నేత వెంకట్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీని వీడి టీడీపీ గూటికి

పామూరు మండలం, పీసీపల్లి మండలాలకు చెందిన కుటుంబాలకు కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ఉగ్ర



పామూరు, వెలిగండ్లలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పామూరు, జనవరి 28 : వైసీపీ అరాచక పాలనలో విసిగిన ప్రజలు చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో టీడీపీ గూటికి చేరుతున్నారని వారందరికీ ఆహ్వానం పలుకుతున్నానని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని అప్పమాంబపురం గ్రామంలో 25 కుటుంబాలు, బీసీ కాలనీకి చెందిన 15, కొత్తపల్లి గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వారు వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర, కోటపాటి జనార్ధనరావు సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఉగ్ర ఆహ్వానించారు. గత ఎన్నికల్లో వైసీపీ నాయకుల మాయ మాటలు నమ్మి టీడీపీని వీడి వైసీపీలోకి వెళ్లి నష్టపోయామన్నారు. ఉగ్రతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి టీడీపీలోకి వచ్చామని, ఉగ్ర విజయానికి పాటుపడతామని తెలిపారు. అనంతరం ఉగ్ర మాట్లాడుతూ జగన్ ఒక్కచాన్స్‌తో రాష్ట్రాన్ని నాశనం చేశారని, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, బొట్లగూడూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట చిన వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, లక్ష్మణ్‌చౌదరి, అడుసుమల్లి నరసింహులు, దుద్దుకూరి మల్లికార్జున, యోగానంద్, కోటపాటి నరసింహారావు, కే రాజ, నరేష్, రాము పాల్గొన్నారు.

పామూరు పట్టణ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్ కాలనీలో టీడీపీ మండల కమిటీ కార్యదర్శి బత్తుల సత్యనారాయణ, తిరుపతయ్య ఆధ్వర్యంలో బీసీ సామాజిక వర్గాలకు చెందిన 60 కుటుంబాల వారు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి ఉగ్ర స్వాగతం పలికారు.

వెలిగండ్ల : మండలంలోని వె దుళ్లచెరువు పంచాయతీకి చెందిన వైసీపీ నా యకులు, పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు శ్యా మల కాశిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో కనిగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వా రంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. డాక్టర్ ఉ గ్ర వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆ హ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీపై అసంతృప్తితో ఆ నాయకులు టీడీలోకి వస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనపై నమ్మకంతో పెద్ద ఎత్తున ప్రజలు టీడీపీ గూటికి చేరుతున్నారని ఉగ్ర అన్నారు. పార్టీలో చేరినవారిలో కట్టిపోగు మార్క్, తగరం ఏ ప్రేమ్, తగరం లూకయ్య, జడ్రపల్లి గుటయ్య తదితరులున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, బీసీ సెల్ అధికార ప్రతినిధి రాజగోపాల్, కార్యకర్తలు ఉన్నారు.

రాజకీయాలకన్నా ప్రజా సేవే ముఖ్యం

- ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
- చంద్రబాబుపై నమ్మకంతోనే టీడీపీ గూటికి వైసీపీ నాయకులు
- పార్టీ విజయానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యం

పామూరు : రాజకీయాలకన్నా ప్రజా సేవే ముఖ్యమని, తాను పాలకుడిని కాను..ప్రజా సేవకుడినని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పే ర్కొన్నారు. మండలంలోని కోడిగుంపల గ్రామంలోని దివంగత న్యాయవాది కొప్పల్లి సుబ్బరాయుడు ఫాంహౌస్‌లో టీడీపీ మండల కుటుంబ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉగ్ర మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ప్ర జలు సుఖ శాంతులతో ఉంటారని తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు, పా రిశ్రామిక వేత్తలు అష్టకష్టాలు పడ్డారన్నారు. వై సీపీ విధానాలతో విసుగుచెందిన నాయకు లు, శ్రేణులు పెద్ద ఎత్తున టీడీపీ గూటికి చేరుతున్నారని ఉగ్ర తెలిపారు. ఈ విషయంలో గ్రా మంలో టీడీపీ నాయకులు అందరి అభిప్రాయాలతో కలుపుకొని పోవాలని కోరారు. పొలిటికల్ ఇంజనీరింగ్‌లా రాజకీయా లు మారాయని, ఈ నేపథ్యంలో టీడీపీ అధికారంలోకి రాకపోతే వలసలుతప్పవన్నారు. తనకు పదవి లేకున్నా నిత్యం సేవలో మీతోనే.. మీకు అండగా.. మీ మధ్యే ఉంటానన్నారు. ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడి వలే కనిగిరిలోనే తుదిశ్వాస విడిచినట్లు తన చివరి మజిలీ వరకూ కనిగిరిలోనే ఉంటానన్నారు. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి కృషి చేసిన వారికే రానున్న స్థానిక ఎన్నికల్లో పోటీ చేయదలచినవారికి ప్రాధాన్యతను ఇస్తామన్నారు. వైసీపీ పాలనా వైఫల్యాలను ప్రజలకు చెప్తూనే టీడీపీ మినీ మేనిఫెస్టోపై ప్రచారం చేయడంతోపాటుపాటు ఎన్నికలు పూర్తయ్యేవరకూ అ ప్రమత్తంగా, ఐక్యంగా కలిసి సైనికుల్లా శ్రమించాలని ఉగ్ర హితబోధ చే శారు. పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకుడు కోటపాటి జనార్ధన్‌రావు మాట్లాడుతూ రాజకీయాల్లో డబ్బుకు ప్రా ధాన్యత ఉన్నప్పటికీ డబ్బే ప్రామాణికం కాదని గ్రామాల్లో ప్రజలతో మమేకం కావాలన్నారు. మొదటగా పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఆత్మీయ సమావేశంలో టీడీపీ మండ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వ ర్లు, మాజీ ఎంపీపీ జీ దశరథరామయ్య, జ డ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.హుసేన్‌రావు యా దవ్, రాష్ట్ర కమిటీ నా యకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ అమీర్‌బాబు, వై ప్రసాద్‌రెడ్డి, షేక్ ఖాజారహంతుల్లా, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, డోలా శే షాద్రి, దేవరపు హనుమంతరావు, సురేష్, సాంబయ్య, రమణయ్య, కమ్మ లక్షణచౌదరి, దుద్దుకూరి మల్లికార్జున, అడుసుమల్లి నరసింహులు, వెంగబాబు, పోకా నాయుడు, గ్రామ అధ్యక్షులు మాల్యాద్రి, నాగేశ్వరరావు, బూత్ కమిటీ కన్వీనర్లు, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలు, జనసేన పార్టీ నాయకులు గుత్తి మహి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీల అభ్యున్నతి



బీసీ సదస్సులో మాట్లాడుతున్న బాలాజీ

దర్శి, జనవరి 28 : బీసీల అభ్యున్నతి తెలుగుదేశం హయాంలోనే జరిగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా బీసీలు టీడీపీలో ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. చంద్రబాబు హయాంలో ఎన్నో ఉన్నత పదవులను కట్టబెట్టి సముచిత గౌరవం దక్కించిందన్నారు. వైసీపీ బీసీలను నమ్మించి మోసం చేసిందన్నారు. వైసీపీ పాలకుల వద్ద బీసీ నాయకులు చేతులు కట్టుకొని నిలబడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. టీడీపీకి బీసీలే ప్రాణమన్నరీతిలో చంద్రబాబు వారికి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. బీసీ వర్గాలకు చెందిన ప్రజలు వైసీపీ పాలనలో జరుగుతున్న అక్రమాలను గుర్తించి వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మో డి వెంకటేశ్వర్లు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మారెళ్ళ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి బేళ్ల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి గడ్డం బాల య్య, నగర పంచాయితీ వైస్ చైర్మన్ తలారి కోటయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, కౌన్సిలర్లు నక్కా రంగా, దత్తు, వలిబా బు, రామగిరి, తెలుగు యువత ఉపాధ్యక్షుడు కల్లూరి సుబ్బు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన బాలుడు

దొనకొండ, జనవరి 28 : తోటి పిల్లలతో ఆడుకుంటున్న బాలుడు విద్యుత్ షాక్‌కు గురైన సంఘటన బాదాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. బాదాపురంలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనంపై పిల్లలు ఎక్కి ఆడుకుంటున్న క్రమంలో బండెల చరణ్ అనే బాలుడు కరెంట్ తీగలకు తగిలాడు. దీంతో షాక్‌కు గురై శరీరం కాలిపోయి కిందపడిపోయాడు. ప్రమాదంను గుర్తించిన బంధువులు 108 సమాచారం ఇవ్వగా సిబ్బంది వెలుగొండయ్య, జాన్‌పీటర్ అక్కడకు చేరుకొని ఈఆర్‌సీపీ సలహా మేరకు బాలుడు చరణ్‌కు వాహనంలో ప్రథమ చికిత్స అందిస్తూ వినుకొండ వైద్యశాలకు తరలించగా అక్కడ వైద్యం పొందుతున్నాడు.

'మానవత సేవలు' వెలకట్టలేం

పామూరు, జనవరి 28 : పేదలకు, అభాగ్యులకు మానవత సేవా సంస్థ అందిస్తున్న సేవలను వెలకట్టలేమని డాక్టర్ గద్దె ఏడుకొండలు కొ నియాడారు. పద్మావతి అతిథి గృహంలో మానవత సేవ సంస్థ నెలవారీ సమావేశంలో అజెండా, సేవా కార్యక్రమాలపై సమీక్ష, శాంతి రథం నిర్వహణపై చర్చించారు.

369 మందికి ఉచిత వైద్య పరీక్షలు

తాళ్లూరు, జనవరి 28 : మండలంలోని తూర్పుగంగవరం గ్రామ జడ్పీహైస్కూల్ ఒంగోలు ఎస్ఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 369 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ హాస్పిటల్ చైర్మన్, లక్కవరం గ్రామస్తుడు డాక్టర్ శ్రీనివాస్, నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు యాడిక యల్లమందారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గుజ్జుల యోగిరెడ్డి, డాక్టర్ చిన్న, వళి, వెంకటరమణ పాల్గొన్నారు.





అసంపూర్తిగా సచివాలయ భవనం



సభా వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

నేడే రా.. కదలిరా

- వడ్లమూడిలో బహిరంగ సభ
- లక్ష మంది కోసం విస్తృత ఏర్పాట్లు
- టీడీపీ కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్న చంద్రబాబు

పొన్నూరుటౌన్(చేబ్రోలు), జనవరి 28: టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల శంఖారావం రా కదలిరా సభ చేబ్రోలు మండలం వడ్లమూడిలో సోమవారం జరగనున్నది. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని పొన్నూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో రా కదలి రా సభకు విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సభ ద్వారా మరో 70 రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ కేడర్‌ను సన్నద్ధం చేసేలా సభా ఏర్పాట్లను చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి సారిగా వడ్లమూడిలో చంద్రబాబు రా కదలి రా బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. క్వారీ దేవాలయానికి సమీపంలో బహిరంగ సభ నిర్వహిస్తుండటంతో మహా శివరాత్రి ముందే వచ్చిందా అన్నట్లు ఆ ప్రాంతంలో కోలాహల వాతావరణం నెలకొంది. 32 ఎకరాల సువిశాల ప్రాంగణంలో సభకు ఏర్పాట్లు చేశారు. పొన్నూరు, ప్రత్తిపాడు, తెనాలి, మంగళగిరి, తాడికొండ, గుంటూరులతో పాటు వేమూరు, రేపల్లె, బాపట్ల తదితర నియోజకవర్గాల నుంచి జనసమీకరణకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే రా కదలి రా బహిరంగ సభా వేదికకు ఎన్టీఆర్ సభా ప్రాంగణంగా పేరు పెట్టారు. వంద మంది అతిథులు ఆశీనులయ్యేలా వేదిక నిర్మాణం చేపట్టారు. సభా స్థలికి చేరుకునే మార్గాన్ని సిద్ధం చేశారు. వీఐపీల రాక కోసం సభ స్థలి వెనుక వైపుగా క్వారీ దేవాలయం నుంచి ప్రత్యేకంగా మార్గాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ప్రజల కోసం మంచినీరు, మజ్జిగ, ఇతర ఆహార పదార్థాలను సిద్ధం చేస్తున్నారు. అలాగే క్వారీ సమీపంలో హెలిప్యాడ్ సైతం సిద్ధమైంది. ఒక్కో నియోజకవర్గ ఇన్‌చార్జి 50 బస్సులు, 100 కార్లు, 1000 ద్విచక్ర వాహనాలు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితుల రీత్యా అంచనాలకు మించి సభకు జనం భారీగా హాజరయ్యే అవకాశం ఉన్నట్లు నాయకులు తెలిపారు.



సిద్ధమవుతున్న వేదిక



సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నరేంద్ర కుమార్, కొనకళ్ల నారాయణ, రాజకుమారి తదితరులు

పసుపు మయం.. ప్రభల నిర్మాణం

టీడీపీ, జనసేన నేతల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రా కదలి రా బహిరంగ సభకు తరలివచ్చే అభిమానులకు స్వాగతం పలికేందుకు భారీగా ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. దీంతో నారాకోడూరు నుంచి సభా ప్రాంగణం వరకు రహదారికి ఇరువైపులా పసుపుమయంగా మారింది. వేదిక ప్రాంగణంలో మూడు భారీ బెలూన్లను ఎగురవేశారు. సభా ప్రాంగణం వద్ద క్వారీ తిరునాళ్లను తలపించేలా నారాకోడూరు, చేబ్రోలు టీడీపీ నాయకులు విద్యుత్ ప్రభలను నిర్మిస్తున్నారు. ఏర్పాట్లను ధూళిపాళ్ల నరేంద్రకుమార్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, నన్నపనేని రాజకుమారి, శ్రావణ్‌కుమార్, జనసేన నాయకుడు వడ్రాణం మార్కండేయబాబు, ఎమ్మెల్సీ రాజు, కోవెళ్లమూడి నాని, రామాంజనేయులు, నాగూర్ మీరా, మన్నవ సుబ్బారావు తదితరులు పర్యవేక్షించారు.

నిధులు నై నిర్మాణాలు

ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు.. అయితే నిధులు ఇవ్వకపోవడంతో మూడేళ్లుగా నిర్మాణాలు సా..గుతున్నాయి. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ సెంటర్లు గ్రామాభివృద్ధిలో కీలకమైనవని పాలకులు ప్రకటించారు. ఆర్భాటంగా నిర్మాణాలు చేపట్టారేకాని నిధులు విడుదలలో నిర్లక్ష్యం చేస్తున్నారు. సకాలంలో బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఆపసోపాలతో పనులకు వెనుకంజ వేస్తున్నారు. మూడేళ్లు నిధులు రాక.. నిర్మాణాలు సాగక ఎక్కడ భవనాలు అక్కడే అన్న చందంగా మారాయి. ఉపాధి హామీ పథకం కింద ఆయా భవనాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అయితే కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో నిధులకు కొరత ఏర్పడటం.. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో ఆయా భవనాల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.

- మూడేళ్లుగా సాగదీస్తున్న పాలకులు
- బిల్లులు రాక కాంట్రాక్టర్ల ఆపసోపాలు
- ప్రభుత్వ ప్రాధాన్య భవనాలపై నిర్లక్ష్యం
- నిధుల కొరతతో ఎక్కడివక్కడే నిర్మాణాలు
- దారి మళ్లిన కేంద్రం ఉపాధి హామీ నిధులు
- 2,740 భవనాలకు 1,227 నిర్మాణాలే పూర్తి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధులు కొరత.. పాలకుల నిర్లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రగతి పనులు ముందుకు సాగడంలేదు. నిధుల కొరతతో విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్ల భవనాల నిర్మాణాలు మూడేళ్లుగా సాగదీస్తున్నారు. బిల్లులు చెల్లించకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు భవనాల నిర్మాణాలను నిలిపివేశారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,740 భవనాల నిర్మాణం చేపట్టగా ఇప్పటికీ 1,227 భవనాల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. గ్రామ స్వరాజ్యం తీసుకు వచ్చేందుకే సచివాలయ వ్యవస్థకు ఏర్పాటు చేసి భవనాలను నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. అయితే ఆచరణలో అది కనిపించడంలేదు. ఈ పరిస్థితుల్లో పలు గ్రామాల్లో సచివాలయాలను ఇంకా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. అద్దె చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో ఆయా భవనాల యజమానులు సచివాలయాలను ఖాళీ చేయాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్న సంఘటనలున్నాయి. మూడు జిల్లాల్లో 846 సచివాలయ భవనాల నిర్మాణాన్ని చేపట్టగా ఇప్పటికి 598 భవనాల నిర్మాణం మాత్రమే పూర్తయింది. ఇంకా 248 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయూష్మాన్ భారత్ పథకంలో భాగంగా హెల్త్ క్లినిక్‌లను మంజూరు చేసింది. 555 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో 276 భవనాల నిర్మాణం పూర్తయింది. 279 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఈ భవనాల నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు కానరావడంలేదు. ఏపీ అమూల్ ప్రాజెక్టుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నది. రాష్ట్రంలోని సహకార డెయిరీలను కాదని ఇతర రాష్ట్రానికి చెందిన అమూల్ డెయిరీకి అనేకరకాలుగా మేలు చేస్తున్నది. ఈ ప్రాజెక్టులో భాగంగా బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్ల నిర్మాణాలను ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 831 యూనిట్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తి కానట్లు పంచాయతీరాజ్ శాఖ నివేదికలు తెలియజేస్తున్నాయి. నెలల తరబడి బిల్లుల చెల్లింపులు జరగకపోతుండటంతో కాంట్రాక్టర్లు మొక్కుబడిగా పనులు చేస్తున్నారు.



పిల్లర్లకే పరిమితమైన రైతు భరోసా కేంద్రం

అద్దె భవనాల్లోనే ఆర్బీకేలు..

రైతు ప్రయోజనాలు కాపాడేందుకు అంటూ ప్రతి గ్రామంలో ఆర్బీకే(రైతు భరోసా కేంద్రం)లను ఏర్పాటు చేసినట్లు పాలకులు ఊదరగొడుతున్నారు. అద్దె భవనాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకేలకు కొన్ని నెలలుగా అద్దె చెల్లించడంలేదు. కొన్ని చోట్ల అద్దె చెల్లించాలని కొందరు భరోసా కేంద్రాలకు తాళాలు వేసిన సంఘటనలున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ఆర్బీకేలకు రూ.కోట్లల్లో అద్దె బకాయిలు ఉన్నాయి. 548 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను చేపట్టగా 353 భవనాల నిర్మాణం మాత్రమే పూర్త యింది. ఇంకా 195 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది.

సచివాలయ భవనాలు

జిల్లా	నిర్మాణం	పూర్తి
పల్నాడు	399	279
గుంటూరు	176	137
బాపట్ల	271	164

హెల్త్ క్లినిక్‌ల భవనాలు

జిల్లా	నిర్మాణం	పూర్తి
పల్నాడు	308	162
గుంటూరు	153	59
బాపట్ల	94	55

రైతు భరోసా కేంద్రాల భవనాలు

జిల్లా	నిర్మాణం	పూర్తి
పల్నాడు	321	203
గుంటూరు	79	67
బాపట్ల	148	83

నిర్మాణం పూర్తి కాని హెల్త్ క్లినిక్ భవనం



పర్చూరులో దోచి.. చీరాలకు పలాయనం

- ఇసుక, మట్టి, గ్రానైట్ దేనినీ వదలకుండా దోపిడీ
- వనరులతో అక్రమార్జనలో రికార్డు నెలకొల్పిన నేత
- దోచుకున్న సొమ్ములో వాటాలతో అధిష్ఠానం మౌనం

చీరాల/ బాపట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయ బదిలీపై వచ్చిన ఆ నేత నియోజకవర్గంలో రేషన్, ఇసుక, గ్రానైట్ ఇలా ఆదాయం వచ్చే ఏ ఒక్క మార్గాన్ని వదలలేదు. భారీగా వెనుకేసుకున్న ఆ నేత తాజాగా తన సొంత నియోజకవర్గం వైపు చూస్తున్నారు. అక్కడ దోచుకుని ఇక్కడ పంచుదాం అన్న తీరుగా ఉన్న ఆ నేత తీరుతో సొంత పార్టీ నాయకులే విస్తుపోతున్నారు. ఆ నేత ఈ ఏడాది కాలంలో పర్చూరు నియోజకవర్గంలో చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. దోపిడీలు, దందాలతో రూ.50 కోట్లు పైగానే ఆర్జించారని సొంతపార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఆయన బాధితుల్లో సొంత పార్టీ వారు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన పదవి లైసెన్సుతో కేవలం దండుకోవడానికే రాజకీయ బదిలీపై వచ్చి నియోజకవర్గాన్ని వాడుకున్నారు తప్పితే పోటీ చేయడానికి కాదని సొంత పార్టీ నేతలు అంటున్నారు. తాజాగా తాను చీరాల నుంచే పోటీకి దిగుతానని అంతరంగికుల సమావేశంలో సదరు నేత తేల్చేశారు. ఏతావతా తేలిందేమిటంటే పర్చూరులో దండుకున్న సొమ్ముతో చీరాలలో రాజకీయం చేయడానికి ఆ నేత సిద్ధమైనట్లు ఆయన కదలికలు చూస్తే తెలుస్తోంది. ఇలా పర్చూరు నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నేత చేస్తున్న రాజకీయం తీరు చూసి నివ్వెరపోవడం ప్రజల వంతవుతోంది. నెలవారీ వసూళ్లలో టార్గెట్లు ఫిక్స్ చేయడం.. ప్రైవేటు సైన్యాన్ని పెట్టుకుని చేసే దందాలను వ్యవస్థీకృతం చేసిన ఘనతా ఆయన సొంతమే. పర్చూరు నియోజకవర్గంలో ఓట్ల అక్రమాల విషయంలో ఆయన సారథ్యంలో వెలుగు చూసిన బాగోతాలకు ఈసీయే నివ్వెరపోయింది. సదరు నేత సేవలో తరించిన పాపానికి కొంతమంది ఉద్యోగులు సస్పెన్షన్ పాలవగా.. మరి కొంతమంది గుండెపోటు తెచ్చుకుని చావు అంచుల దాకావెళ్లి వచ్చారు.

శ్రేణుల లబోదిబో..

ఆ నేత వల్ల పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ పతనావస్థకు చేరిందని ద్వితీయశ్రేణి నేతలతో పాటు కార్యకర్తలు లబోదిబోమంటున్నారు. ఏడాది కాలం నుంచి నియోజకవర్గంలో ఆ నేత చేసిన అడ్డగోలు చర్యలకు వైసీపీ అంటేనే జనం చీదరించుకుంటున్నారని, ఇప్పుడు ఆయన పలాయనం చిత్తగించడానికి సిద్ధమయ్యారని ఇక్కడ వైసీపీ కోలుకోలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ప్రశాంతంగా ఉండే పర్చూరు నియోజకవర్గంలో ఆయన చేసిన చర్యల వల్ల పార్టీ అప్రతిష్ఠ మూటగట్టుకుందని, ఈ దశలో ఇక్కడ వైసీపీకి కాయకల్ప చికిత్స చేయడం అసాధ్యమనే అభిప్రాయం పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతోంది. సాధారణంగా నియోజకవర్గ స్థాయి నేత అక్కడ ప్రజల సాధకబాధకాల మీద దృష్టి పెట్టి వారి అభిమానం చూరగొనడానికి ప్రయత్నిస్తారు. కానీ అక్రమార్జనలో నియోజకవర్గంలో ఉన్న వనరులను ఎలా వాడుకోవాలో చూపించడంలో సదరు నేత రికార్డు నెలకొల్పారు. వైసీపీ రాష్ట్ర నాయకత్వానికి కూడా ఈయన దోచుకున్న సొమ్ములో వాటాలు వెళ్లడంతో వారు కూడా కిమ్మనకుండా ఉన్నారని సమాచారం. ఏడాది కాలంలో పర్చూరు నియోజక వర్గంలో ఆ నేత చేసిన అల్లకల్లోలం అంతా ఇంతా కాదు. ఆయన నేతృత్వంలో జరిగిన ఓట్ల అక్రమాలు అయితే పర్చూరు నియోజకవర్గానికే చెడ్డ పేరు తీసుకువచ్చాయి. ఓ దశలో పోలీసు పహారాలో ఫాం7ల విచారణ ఎదుర్కోవాల్సిన అగత్యాన్ని ప్రజలకు కల్పించిన క్రెడిట్ కూడా ఆయనకే దక్కుతుంది. ఓట్ల అక్రమాల ఆరోపణల నేపథ్యంలో నలుగురు పోలీస్ అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. పలువురు రెవెన్యూ ఉద్యోగులు గతంలోనే బదిలీ అయ్యారు. ఆయన అక్రమార్జనకు అండగా ఉన్న ఉద్యోగులను నమ్మించి నట్టేట ముంచేశారు.

పలుసార్లు అధిష్ఠానం దృష్టికి వెళ్లినా..

నియోజకవర్గంలో ఆ నేత అక్రమాలు పలుసార్లు వైసీపీ అధిష్ఠానం దృష్టికి వెళ్లినా మౌనంగా ఉండడంతో పాటు ఆయనకే వత్తాసు పలకడంతో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన నేతలు సైతం మిన్నకుండి పోయారు. ప్రస్తుతం ఆయన చీరాలలోనే పోటీచేస్తానని లీకులివ్వడంతో ద్వితీయశ్రేణి నేతాగణం పార్టీ అధినాయకత్వంపై మండిపడుతున్నది. కేవలం దోచుకోవడానికే ఆయనకు పార్టీ పదవి ఇచ్చినట్లయిందని, తాము తొలి నుంచి చెబుతూనే వస్తున్నామని పార్టీ పెద్దలు ఖాతరు చేయలేదని అంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఇప్పుడు వైసీపీ అధిష్ఠానం పర్చూరులో ప్రత్యామ్నాయ నేతపై దృష్టి పెట్టి అభిప్రాయ సేకరణ జరుపుతోంది. దానిలో పార్టీ నేతలు, మద్దతుదారుల నుంచి కరకుగా స్వరాలు వినపడుతుండడంతో బిత్తరపోవడం పార్టీ పెద్దల వంతవుతోంది. అడ్డగోలుగా దోపిడీ చేసి ఇప్పుడు పక్క నియోజకవర్గానికి పలాయనం చిత్తగిస్తున్న నేత బాగానే ఉంటారు కానీ అన్ని విధాల తామే నష్టపోయామని వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం వారి ముందు వాపోతోంది.

తీరంలో కోడి పందాలు

- జూదరులు రూ.లక్షల్లో బెట్టింగ్‌లు
- అధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహణ

రేపల్లె, జనవరి 28: తీరంలో సంక్రాంతి పండుగ వెళ్లినా రేపల్లె నియోజకవర్గంలో కోడిపందాలు మాత్రం జోరుగా కొనసాగుతున్నాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో జూద క్రీడలకు తీర ప్రాంతం అడ్డాగా మారింది. కోడిపందాలను నియంత్రించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తైనా చూడటంలేదు. నిజాంపట్నం మండలం పెదమట్లపూడిలో వైసీపీ మండల, గ్రామస్థాయి నాయకుల ఆధ్వర్యంలో జోరుగా కోడిపందాలు జరుగుతున్నాయి. ఆ పరిసర ప్రాంతవాసులే కాకుండా కృష్ణా జిల్లా నుంచి కూడా జూదరులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో రూ.లక్షల పందాలు జోరుగా సాగుతున్నాయి. ఆదివారం భారీగా బరులను ఏర్పాటు చేయడంతో జోరుగా కోడి పందాలు సాగాయి. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు రాజకీయ నాయకుల ఆదేశాలకు తలొగ్గి ఆ వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. దీంతో నిర్వాహకులు అడ్డుఅదుపులేకుండా పందాలను నిర్వహించారు. పలువురు కోళ్లు పట్టుకుని పందాలు వేసేందుకు తరలివచ్చారు. పందాలు వేసే వారితో పాటు పెద్దసంఖ్యలో తరలివచ్చిన వారి వాహనాలతో గ్రామ పరిసరాలు కిటకిటలాడాయి. బరుల ప్రాంతం కోలాహలంగా మారింది. బరుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు కూడా జరిగాయి. మద్యం విక్రయ దారుల నుంచి నిర్వాహకులు కమీషన్ల రూపంలో సొమ్ము చేసుకున్నారు.





పెదమట్లపూడిలో జరుగుతున్న కోడి పందాలు

దేవుని ఆరాధన మనోహరం

- జె.శామ్యూల్ కిరణ్
- మూడోరోజు కొనసాగిన బైబిల్ మహోత్సవాలు



ఆశీర్వాద ప్రార్థన చేస్తున్న శామ్యూల్ కిరణ్

పెదకాకాని, జనవరి 28: సకల జనులకు బైబిల్ మహోత్సవాల ద్వారా ఆశీర్వాదం కలుగుతుందనిని బైబిల్ మిషన్ అ ధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ప్రాంగణంలో ఫాదర్ ఎం.దేవదాస్ బయలుపరిచిన బైబిల్ మిషన్ 86వ మహోత్సవాలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. శామ్యూల్ కిరణ్ మాట్లాడుతూ ప్రభు బోధనలతో ఆత్మీయ సంతోషం లభిస్తుందన్నారు. క్రమం తప్పకుండా హాజరవుతున్న భక్తులు, ప్రజలు మహదానందం పొందుతున్నారని చెప్పారు. హృదయ శుద్ధితో ప్రార్థన చేయాలని సూచించారు. వేలాదిమంది భక్తులు ధవళ వస్త్రాలతో ప్రార్థనలకు హాజరయ్యారు. బైబిల్ మిషన్ ఉపాధ్యక్షులు పి.జాన్ దేవదాస్ వాక్యోపదేశం చేస్తూ ప్రపంచానికి ఏసుక్రీస్తు ప్రేమను చాటడంలో బైబిలు మిషన్ ప్రాముఖ్యం పాత్రను పోషిస్తుందన్నారు. వాక్యమనే సంపద ద్వారా సుసంపన్నులుగా ఎదగ వచ్చన్నారు. ఎదుటివారిని క్షమించి ప్రేమించాలని హితవు పలికారు. అనంతరం హైదరాబాద్ యశోద హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ సుంకవల్లి చిన్నబాబు రచించిన లైవ్ ఫర్ లెగసి (వారసత్వం కోసం జీవించండి) పుస్తకాన్ని ఆవిష్కరించారు. కాకాని స్వస్తిశాల సంగీత బృందం ఆలపించిన భక్తి గీతాలు ప్రజలందరినీ పరవశింప చేశాయి. వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాస్, సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రెటరీలు సుధాకర్, జె.ఆగమనరావు, ఎం.రవి ఆశీర్వాదాలు అందజేశారు.

సంపూర్ణంగా తిరిగొస్తా

- బాధతోనే రాజకీయాలకు తాత్కాలిక విరామం
- రాయలసీమ నుంచి వచ్చినా అక్కున చేర్చుకున్నారు
- కృతజ్ఞతాభివందన సభలో ఎంపీ జయదేవ్

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాముడు 14, పాండవులు 13 ఏళ్లు అరణ్యవాసం చేసి తిరిగి ఎంతో బలంగా వచ్చారు.. తానూ అలానే బలమైన సంపూర్ణ రాజకీయ నాయకుడిగా తిరిగొస్తా.. అని ఎంపీ గల్లా జయదేవ్ తెలిపారు. ఆదివారం గుంటూరు శివారులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో ఎంపీ జయదేవ్ కృతజ్ఞతాభివందనం కార్యక్రమం జరిగింది. దశాబ్ద రాజకీయ ప్రయాణానికి.. గుంటూరు పార్లమెంటు ప్రజల అభిమానానికి ఎంపీ గల్లా జయదేవ్ కృతజ్ఞతాభివందనం తెలిపారు. రాజకీయాల్లోకి అడుగు పెట్టి రాయలసీమ నుంచి గుంటూరుకు వచ్చినా ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకుని ఆదరించి రెండుసార్లు ఎంపీగా లోక్‌సభకు పంపారని.. వారికి పేరుపేరునా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉండాలన్న నిర్ణయం బాధాకరమైనప్పటికీ ఇది శాశ్వతం కాదని, మళ్లీ శక్తిమంతంగా సంపూర్ణ రాజకీయ నాయకుడిగా మీ ముందుకు వస్తానని ప్రకటించారు. ప్రజల కోసం తిట్టినా, కొట్టినా, జైలులో పెట్టినా ఫర్వాలేదని, అలాకాకుండా రాజకీయాల్లో కొనసాగుతూ గమ్మున కూర్చోమంటే తన వల్ల కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టార్గెట్ చేసినా పార్టీని వీడలేదన్నారు. ఈ సందర్భంగా ఎంపీ జయదేవ్‌తో పాటు ఆయన తల్లి గల్లా అరుణకుమారి, సోదరి డాక్టర్ రమాదేవి భావోద్వేగానికి లోనయ్యారు.



ఎంపీగా అహర్నిశలు గల్లా కృషి : లోకేశ్

2013లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు చంద్రబాబు పిలుపుతో గల్లా జయదేవ్ టీడీపీలోకి వచ్చి, ఎంపీగా గెలిచి గుంటూరు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. అమరావతి రాజధాని రైతుల పక్షాన నిలిచి ముట్టడి కార్యక్రమంలో అసెంబ్లీ తలుపులు తట్టిన వ్యక్తి జయదేవ్ అన్నారు. ఆ రోజున పోలీసులు దొంగచాటుగా గిచ్చినా, ఏ స్టేషన్‌కు తీసుకెళుతున్నారో తెలియని పరిస్థితి ఉన్నా నమ్ముకొన్న సిద్ధాంతం కోసం రైతుల తరుపున పోరాడారన్నారు.



మోకాళ్లపై నిల్చొని నినాదాలు చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

నల్ల జెండాలు పట్టి.. కళ్లకు గంతలు కట్టి

- సెర్ప్ ఉద్యోగుల ఆందోళన
- మోకాళ్లపై నిలబడి నిరసన
- సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్

ఒంగోలు నగరం, జనవరి 28 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సెర్ప్, వైకేపీ ఉద్యోగులు పలురకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో వారు చేపట్టిన సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ధర్నాను కొనసాగించారు. శిబిరంలో అందరూ మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని, చేతిలో నల్లజెండాలను పట్టుకుని అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులర్ చేయాలని, చనిపోయిన ప్రతి ఉద్యోగి కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని, విధుల్లో ఉన్న కాలంలో చనిపోయిన వారి కుటుంబానికి కారుణ్య నియామకం చేపట్టాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని వారు నినదించారు. ధర్నా శిబిరం వద్ద సెర్ప్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కార్యదర్శి గుంజి రాంబాబు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని గత కొన్నేళ్లుగా ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినా నిర్లక్ష్యం వహించిందన్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమాల్లో జె.నారాయణ, కృష్ణ, గోపీనాథ్, ఆదిశేషు, సుధాకర్, స్వర్ణలత, రజియాబేగం, చెంచులక్ష్మి, నరేష్, సుబ్బారావు, కృపారావు తదితరులు పాల్గొన్నారు.



కె.ఉప్పలపాడు గ్రామంలో మాట్లాడుతున్న దామచర్ల సత్య, అచ్యుత్‌కుమార్ తదితరులు

రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును సీఎంగా చేసుకోవాలి

- టీడీపీ రాష్ట్ర నేత దామచర్ల సత్య
- పలు గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం

కొండపి, జనవరి 28 : రాష్ట్రాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి చంద్రబాబు నాయుడిని సీఎంగా చేసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం మండలంలోని కె.ఉప్పలపాడు, చినవెంకన్నపాలెం, కట్టుబడివారిపాలెం, వెన్నూరు, చోడవరం, ముప్పవరం, మిట్టపాలెం, గోగినేనివారిపాలెం, పెరిదేపి, కట్టావారిపాలెం, నేతివారిపాలెం, పెదకండ్లగుంట్ల, జాళ్లపాలేల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, నాయకులు బత్తుల నారాయణస్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, గుండపనేని రామ్మూర్తినాయుడు, దామా మురళి, దామా శ్రీహరి పాల్గొన్నారు.



మోపాడులో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయం

బిల్లులిస్తేనే తాళాలిస్తాం!

- తెగేసి చెప్తున్న కాంట్రాక్టర్లు
- వైసీపీ ప్రభుత్వం నిండాముంచిందని ఆవేదన

పామూరు, జనవరి 28 : వైసీపీ పాలకుల మాటలు విని ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు ముందుకొచ్చిన కాంట్రాక్టర్లు, ఆపార్టీ నాయకులు బిల్లులు అందక లబోదిబోమంటున్నారు. నిర్మాణాల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక అల్లాడుతున్నారు. ప్రభుత్వ అసమర్థ చర్యలతో నిండా మునిగామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బిల్లులు ఇస్తేనే కార్యాలయాల తాళాలు ఇస్తామని తేల్చిచెప్తున్నారు. మండలంలో ఒక్కో సచివాలయానికి రూ.40లక్షల వంతున 19 సచివాలయాలు, రూ.21.80లక్షల వంతున 19 ఆర్బీకే కేంద్రాలు, రూ.17.5లక్షల వంతున 18 హెల్త్ సబ్‌సెంటర్లు, రూ.17.67లక్షల వంతున 14 పాల కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామ సచివాలయాలకు డిజైన్‌లు మార్చడంతో రూ.40లక్షలతోపాటు అదనంగా మరో రూ.7లక్షల వరకు ఖర్చు పెరిగింది. ఉపాధి హామీ నిధులు రూ.40లక్షలు, అదనంగా రూ.7లక్షలు గ్రామ పంచాయతీ నిధులను ఖర్చుచేయాలని ప్రభుత్వం జీవో ఇచ్చింది. అసలే ఆర్థిక ఇబ్బందులు పడుతున్న గ్రామ పంచాయతీలు రూ.7లక్షలు ఇచ్చేందుకు సుముఖత చూపలేదు. దీంతో కొన్నిచోట్ల ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్లే భరించారు. కానీ అందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదు. మరికొన్నిచోట్ల ఉపాధి బిల్లులు రాకపోవడం, వైసీపీ ప్రభుత్వం మీద నమ్మకం కోల్పోవడంతో ఎక్కడ పనులు అక్కడే కాంట్రాక్టర్లు నిలిపివేశారు. బిల్లులు చెల్లిస్తేనే తాళాలు ఇస్తామని చెప్పడంతో పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

ఐదు సచివాలయ భవనాలు మాత్రమే పూర్తి

జగన్‌రెడ్డి మాట తప్పడు.. మడమ తిప్పడు అన్న నమ్మకంతో ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు కాంట్రాక్టర్లు, వైసీపీ నాయకులు మొదట్లో పోటీపడ్డారు. 19 సచివాలయాల్లో ఈ నాలుగేళ్ల 9 నెలల్లో కేవలం పామూరు 1, వగ్గంపల్లి, నుచ్చుపొద, కంభాలదిన్నె, బొట్లగూడూరు సచివాలయ భవనాలు మాత్రమే పూర్తయి ప్రారంభించారు. మిగతా నిర్మాణాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. పామూరులోని 3 గ్రామ సచివాలయాలు పాత ప్రభుత్వ వైద్యశాల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. పామూరు పట్టణానికి ఇప్పటికే సీహెచ్‌సీ ఉంది. దాన్ని కొత్తభవనంలోకి మార్చారు. పాత భవనాల్లో మూడు గ్రామ సచివాలయాలను నిర్వహిస్తున్నారు. అయితే సుమారు పది నెలల క్రితం పామూరుకు మరో పీహెచ్‌సీ మంజూరైంది. అయితే సీహెచ్‌సీకి ఉన్న పాత భవనాల్లో సచివాయాలు నిర్వహిస్తుండంతో పీహెచ్‌సీకి గూడుకరువైంది. మండల స్థాయి ప్రజాప్రతినిధులైన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు స్వగ్రామమైన మోపాడులో గ్రామ సచివాలయం అసంపూర్తిగా ఉంది. బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు.

బిల్లులు చెల్లించి ఆదుకోవాలి

ఉపాధి హామీ, పంచాయతీ గ్రాంట్‌తో నిర్మించిన సిమెంట్ రోడ్లకు బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కాంట్రాక్టర్ పారా వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి రోడ్లు నిర్మిస్తే నేటికీ బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీలు కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు.

పాపం పండింది!

సదావర్తి మఠం భూములు ఇతరులకు కట్టబెట్టిన వారిపై వేటు

ఇద్దరు డిప్యూటీ కలెక్టర్‌లకు తహసీల్దార్‌లుగా రివర్షన్

ఒకరు గతంలో ఒంగోలు ఆర్డీవోగా, మరొకరు ఎస్ఎన్‌పాడు తహసీల్దార్‌గా పనిచేశారు

ఇద్దరు విశ్రాంత తహసీల్దార్‌లు, మరో ముగ్గురు ఉద్యోగులపై చర్యలు

ప్రస్తుతం భూమి విలువ రూ.300 కోట్లు



సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట వద్ద ఉన్న రూ.కోట్ల విలువ చేసే సదావర్తి మఠం భూములను పరులపరం చేసిన అధికారుల పాపం పండింది. ఎట్టకేలకు వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇద్దరు డిప్యూటీ కలెక్టర్‌లను తహసీల్దార్‌లుగా రివర్షన్ చేసింది. ఇద్దరు విశ్రాంత తహసీల్దార్‌లు, మరో ముగ్గురు రెవెన్యూ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంది. రివర్షన్‌కు గురైన డిప్యూటీ కలెక్టర్లలో ఒకరు గతంలో ఒంగోలు ఆర్డీవోగా, డీఆర్‌డీఏ పీడీగా సుదీర్ఘకాలం పనిచేసి ప్రస్తుతం అన్నమయ్య జిల్లా మదనపల్లి ఆర్డీవోగా ఉన్న మురళికాగా.. మరొకరు గతంలో సంతనూతలపాడు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం గుంటూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న లలితకుమారి. రెవెన్యూ అధికార వర్గాల్లో ప్రస్తుతం దీనిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.

ఒంగోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సమీపంలోని సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట సర్వే నెంబరు 34లో సదావర్తి మఠానికి చెందిన 66.25 ఎకరాల భూమి ఉంది. దీని విలువ ప్రస్తుతం రూ.300 కోట్ల వరకూ ఉంటుంది. కాశీ యాత్ర చేసే బైరాగుల అవసరాలు తీర్చేందుకు 19వ శతాబ్దంలో కోసల్ దాస్ అనే వ్యక్తి ట్రస్టీగా రాజా వెంకటాద్రి అనే రాజు మఠం పేరుతో దానిని ఇచ్చారు. దీనిపై వచ్చే ఆదాయంతో బైరాగులకు భోజనం, వసతి కల్పించాలన్నది ఉద్దేశం. అయితే ఆ భూములు దుర్వినియోగం అవుతున్నాయని, అడ్డుకోవాలంటూ 1928లో ఉత్తర భారతదేశానికి చెందిన బైరాగులు కొందరు అప్పటి బాపట్ల న్యాయస్థానంలో కేసు వేశారు. విచారించిన కోర్టు 1933లో తీర్పు ఇస్తూ సదరు భూమిని ఈనాంగా పేర్కొంది. అమ్మే హక్కు ఎవరికీ లేదని, ట్రస్టు కిందనే ఉండాలని తెలియజేస్తూ కోసల్‌దాస్‌ను ట్రస్టీగా తొలగించాలని ఆదేశించింది. అనంతరం దాదాపు 80 ఏళ్లపాటు ఆ భూమి జోలికి ఎవ్వరూ వెళ్లలేదు.

వారసుల పేరుతో కొందరు అమ్మకం

కోసల్ దాస్ వారసులమని 1984లో తమకు రైతువారీ పట్టాలు ఆ భూమికి ఇచ్చారంటూ కొందరు తెరమీదకు వచ్చారు. వారిలో నలుగురి పేరుతో 2008లో ఆ భూమి రిజిస్ట్రేషన్ జరిగింది. వాటికి నిరభ్యంతర పత్రం కోసం వారు దేవదాయశాఖకు దరఖాస్తు చేసుకోగా ఆర్‌ఎస్‌ఆర్ దస్ర్తాల ప్రకారం అవి మఠం భూములని, అదేసమయంలో రైతు వారీ పట్టాలు కూడా ఉన్నాయని ఇక్కడి సహాయ కమిషనర్ నివేదించగా కమిషనర్ మాత్రం ఎన్‌వోసీ ఇచ్చారు. అనంతరం వారి నుంచి కొనుగోలు చేసిన వారికి పాసు పుస్తకాలు వచ్చాయి. దీనిపై 2010లో అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. భూ కుంభకోణంగా గుర్తించిన నాటి కలెక్టర్ భూముల రిజిస్ట్రేషన్‌ను అలాగే ఎన్‌వోసీని రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. పాసుపుస్తకాల రద్దు కోసం ఆర్డీవో కోర్టులో వేయాలని అప్పటి సంతనూతలపాడు తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం దేవదాయశాఖ వారు కూడా ఆ భూముల పాసుపుస్తకాలను రద్దుకోరుతూ ఆర్డీవోకు లేఖ రాయగా, 2012లో తహసీల్దార్ కూడా ఆర్డీవోకు అప్పీల్ చేశారు. ఈ లోపు ఆ భూములు చేతులుమారగా కొన్న వారు పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేశారు. రెవెన్యూ అధికారులు తేల్చడం లేదంటూ వారు కోర్టును ఆశ్రయించడంతో రెండు నెలల్లో సెటిల్ చేయాలని ఆదేశించింది. దీంతో దేవదాయ కమిషనర్ ఇచ్చిన ఎన్‌వోసీ ఆధారంగా రెవెన్యూ అధికారులు పాసు పుస్తకాలు ఇచ్చేశారు. అనంతరం భూ కన్వర్షన్ కూడా జరిగింది. అప్పుడే పెద్దమొత్తంలో అధికారులు నగదు రూపంలో లబ్ధిపొందినట్లు సమాచారం.

నాలుగేళ్లుగా చర్యలు కరువు

కలెక్టర్‌గా సుజాతశర్మ పనిచేసిన సమయంలో మరోసారి ఆ భూములపై పదే,పదే ఫిర్యాదులు అందాయి. దీంతో ఆమె అప్పటి ఆర్డీవో కె.శ్రీనివాసరావును విచారించాలని ఆదేశించారు. విచారించిన ఆయన భూములు మఠానికి చెందినవేనని, ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడానికి వీలులేదని తేల్చారు.

భూ అక్రమాల్లో ఎవరెవరి పాత్ర ఏస్థాయిలో ఉందో వివరంగా నివేదించారు. దీంతో మొత్తం వ్యవహారాన్ని ప్రభుత్వానికి నివేదించిన అప్పటి కలెక్టర్ సుజాత శర్మ రెవెన్యూ అధికారులపై చర్యలకు సిఫారసు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారు ఇచ్చిన సమాధానాలకు ఉన్నతాధికారులు సంతృప్తి చెందక మరోసారి జేసీని విచారణకు ఆదేశించారు. జేసీ విచారణలోనూ సదరు భూముల విషయంలో అక్రమాలు జరిగాయని, సదావర్తి మఠానికి చెందిన భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని తేల్చి నివేదించారు. అయితే నాలుగేళ్లుగా తదుపరి చర్యలు కరువయ్యాయి

ఇప్పుడు బయటపడిన ఫైల్

మఠం భూముల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఒకరైన ఒంగోలు ఆర్డీవో కార్యాలయ ఏవో అమీర్‌బాషా రిటైర్మెంట్ అనంతరం బెన్‌ఫిట్ల కోసం కోర్టును ఆశ్రయించడంతో మళ్లీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అమీర్ సమస్య పరిష్కరించాలని కోర్టు ఆదేశించడంతో రెవెన్యూ ఉన్నతాధికారులు పాత ఫైల్‌ను బయటకు తీశారు. మొత్తం పరిశీలన అనంతరం సదావర్తి మఠం భూములను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే అధికారం లేదని తేల్చి బాధ్యులైన రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై వేటు వేశారు.

వేటుపడిన వారు వీరే

గతంలో ఒంగోలు ఆర్డీవోగా పనిచేసిన మురళి, సంతనూతలపాడు తహసీల్దార్‌గా పనిచేసి ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న లలితకుమారిలను తహసీల్దార్‌గా రివర్షన్ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే విశాంత్ర తహసీల్దార్‌లు అమీర్ బాషా, గాంధీలకు పెన్షన్‌లో కోత విధించారు. ఇక అప్పట్లో పేర్నమిట్టలో పనిచేసి ప్రస్తుతం ముక్తినూతలపాడు వీఆర్వోగా ఉన్న వి.అంకిరెడ్డి, చోడవరం వీఆర్వోగా ఉన్న శ్రీదేవిలకు ఆరేళ్ల ఉద్యోగోన్నతుల నిలుపదలతో పాటు మూడు ఇంక్రిమెంట్లు కోత విధించారు. మరో రెవెన్యూ ఉద్యోగిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.

గిద్దలూరు వైసీపీలో సరికొత్త ట్విస్ట్

స్థానికేతరులు వద్దు అంటూనే బాలినేనికి మద్దతు

క్లైమాక్స్‌లో ఉత్కంఠ

తన పేరు ప్రస్తావనపై మాజీ మంత్రి సీరియస్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

గిద్దలూరు వైసీపీలో సరికొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలను అటు,ఇటు మార్చే ప్రయత్నాలకు అధిష్ఠానం శ్రీకారం పలకగా స్థానిక నాయకులు అప్రమత్తమయ్యారు. మరోసారి స్థానికేతర అభ్యర్థిని నిలిపితే సహకరించబోమంటూనే ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని అయితే మాత్రం ఓకే అని చెప్పేశారు. స్థానికేతరులు వద్దు అంటూనే వారు బాలినేని మాత్రం ముద్దు అనడంలో ఆంతర్యం ఏమిటన్న చర్చ ఆరంభమైంది. అయితే తనపేరును ఎందుకు ప్రస్తావించారంటూ బాలినేని అక్కడి నాయకులకు ఫోన్‌చేసి సీరియస్ అయినట్లు సమాచారం.

రెడ్డి సామాజికవర్గం నేతలకే ఇవ్వాలని డిమాండ్

గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు లేక ఆయన కుమారుడిని మార్కాపురం నుంచి పోటీ చేయించి మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరు పంపాలని వైసీపీ అధిష్ఠానం భావించింది. సోమ, మంగళవారాల్లో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డితో జగన్ మాట్లాడిన తర్వాత ఈ విషయమై తుదినిర్ణయం తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో స్థానికేతర నాయకుడికి మరలా అవకాశం ఇవ్వొద్దని, స్థానికుల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని నియోజకవర్గంలోని నాయకులు డిమాండ్ చేయడం ప్రారంభించారు. రెడ్డి సామాజికవర్గానికే అవకాశం ఇవ్వాలని కూడా వారు కోరుతున్నారు. రేపోమాపో అభ్యర్థి ఎంపికపై సీఎం తుది నిర్ణయం తీసుకోనుండటంతో వివిధ రూపాల్లో తన డిమాండ్‌తో అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చేందుకు వారు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులోభాగంగా టిక్కెట్ ఆశిస్తున్న నియోజకవర్గంలోని రెడ్డి సామాజికవర్గం నాయకులు వెనకుండి నియోజకవర్గంలోని పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీల ద్వారా తన డిమాండ్‌ను వెల్లడించే ప్రక్రియను చేపట్టారు. ఆదివారం బేస్తవారపేటలో వారంతా సమావేశమయ్యారు. అర్థవీడు జడ్పీటీసీ, బేస్తవారిపేట, కొమరోలు ఎంపీపీలు ఆ సమావేశంలో ముఖ్యులుగా కనిపించారు. వారితోపాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఉన్న మరికొందరు కూడా సమావేశమై మరోసారి నియోజకవర్గేతర నాయకుడిని రంగంలోకి తేవద్దని, అలాచేస్తే తాము సహకరించబోమని తేల్చిచెప్పారు. గత ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే రాంబాబును పోటీకి దింపినా జగన్‌కోసం సహకరించామని అయితే ఆయన మార్కాపురంలో నివాసం ఉంటున్నందున నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు ఇబ్బందిపడ్డారని కొమరోలు ఎంపీపీ బహిరంగంగానే చెప్పారు. నియోజకవర్గ పార్టీలో సత్తా ఉన్న నాయకులు లేనట్లు బయట ఉన్న నాయకులను మాపై ఎందుకు రుద్దుతారని ప్రశ్నించారు.

నేతల ప్రత్యేక సమావేశం

వీరు సమావేశమైన గదిలో మీడియాతో మాట్లాడుతుండగా వేరేగదిలో టికెట్ ఆశిస్తున్న నాయకుల్లో కొందరు భేటీ అయ్యారు. రమణారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి అలాగే లింగారెడ్డి సోదరుడు తదితరులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. వారంతా కూడా మనలో ఒకరిమే టికెట్ తెచ్చుకోవాలన్న నిర్ణయంతో ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. టికెట్ ఆశిస్తూ రేసులో ఉన్నవారిలో ఐవీ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి ఆ సమావేశానికి రాకపోగా వివిధ కారణాలతో వారు అందుబాటులో లేరని చెబుతున్నారు. గిద్దలూరు మండలానికి చెందిన వంశీధర్‌రెడ్డి అనే ముఖ్య నాయకుడు కూడా గైర్హాజరయ్యారు. ఇంకోవైపు స్థానికేతరుడిని పంపవద్దని అంటూనే బాలినేని అయితే మాకు ఓకే అని వారు చెప్పడం చర్చనీయాంశమైంది. ఎలాగూ స్థానికేతరుడిని పంపిస్తున్నారన్న నమ్మకంతో తమకు ఇష్టమైన బాలినేని పేరు అలా చెప్పారా? లేక ఎవరైనా చెప్పించారా? అన్న అనుమానాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. ఆదివారం సాయంత్రం విషయం తెలుసుకున్న బాలినేని అక్కడి నాయకులకు ఫోన్‌చేసి తన పేరును ఎందుకు ప్రస్తావించారంటూ మండిపడినట్లు తెలిసింది.

రాంబాబు స్థానికుడేనంటూ వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం

మరోవైపు నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా గ్రూపుల్లో ఎమ్మెల్యే రాంబాబు స్థానికుడే అంటూ పెద్దఎత్తున ఆయన అభిమానులు ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన మార్కాపురంలో స్థిరపడినా నియోజకవర్గంలోని కంభం మండలంలో పుట్టిపెరిగిన వ్యక్తి అని అందులో పేర్కొన్నారు. ఆయన హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని, ఆయనను స్థానికుడిగానే తాము గుర్తిస్తున్నామంటూ ఆయన అభిమానులు పెద్దఎత్తున ప్రచారం చేపట్టారు. దీంతో పోటీకి దూరమన్న రాంబాబు తిరిగి పోటీకి సిద్ధంకావటం, మార్కాపురంలో పోటీచేయాలనుకున్న ఆయనకు మద్దతుగా గిద్దలూరులో స్థానికుడని పోస్టింగ్‌లు పెట్టడం, స్థానికేతరుడు తమకు వద్దని చెప్తున్న నాయకులు బాలినేనికి ఓకే చెప్పటం, తాను మార్కాపురానికి పరిమితమవుతానని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి భీష్మించుకుని కూర్చోవడం తదితర అంశాల నేపథ్యంలో గిద్దలూరు వైసీపీ అభ్యర్థి ఎంపిక ఏమలుపు తిరుగుతుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

జాయింట్ కలెక్టర్‌గా గోపాలకృష్ణ

- ప్రస్తుత జేసీ శ్రీనివాసులు నంద్యాల కలెక్టర్‌గా బదిలీ

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 28 : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా రేణంకి గోపాలకృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ శ్రీనివాసులు నంద్యాల జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. గోపాలకృష్ణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషరేట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా పారసంబ గ్రామానికి చెందిన ఆయన విజయనగరం మహారాజ కళాశాలలో చదువుకున్నారు. కొంతకాలం ఉపాధ్యాయుడిగా పని చేశారు. 2016 సివిల్ సర్వీసెస్‌లో 3వ ర్యాంకు సాధించారు. తొలిపోస్టింగ్ గూడూరు సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బదిలీ అయిన శ్రీనివాసులు గత ఏడాది ఏప్రిల్‌లో ఇక్కడ జేసీగా బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారంతోపాటు భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. మరోవైపు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భారీగా బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాలను సీజ్ చేయించడంతోపాటు అక్రమార్కులపై క్రిమినల్ కేసులను కూడా నమోదు చేయించారు. ఆయనకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి నంద్యాల కలెక్టర్‌గా నియమించింది.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 28 : ఒంగోలు నగరంలోని 3వ డివిజన్ బలరాం కాలనీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక గుంటూరు రోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో వారు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌ను కలిసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జగరలేదని, తమకు ఎలాంటి సంక్షేమం అందలేదన్నారు. తెలుగుదేశం పార్టీలోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని వారు పేర్కొన్నారు. అనంతరం దామచర్ల మాట్లాడుతూ టీడీపీలో తగిన గుర్తింపు, అలాగే అవసరమైన సంక్షేమం అందుతుందని, అన్ని వేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ టీడీపీ నాయకులు, మైనార్టీ విభాగం నాయకులు పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడం!

మేమేమీ బచ్చాలం కాదు

ప్రతి సారీ మాయ చేయడం నీకు అలవాటు

రెండు నెలల్లో ఎన్నికలనగా ఇప్పుడు పట్టాలు గుర్తుకొచ్చాయా?

బాలినేనిపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల ఫైర్



ఒంగోలు నగరంలో జనార్దన్‌కు దిష్టితీసి స్వాగతం పలుకుతున్న స్థానికులు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 28 : 'ఒంగోలులో ఇళ్ల పట్టాలను పంపిణీని అడ్డుకుంటే నా ఇల్లు ముట్టడిస్తానని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడటం ఆయన చేతగాని తనానికి నిదర్శనం. ఇలాంటి బెదిరింపులకు నిక్కర్లు వేసుకున్న పిల్లలు భయపడతారేమో కాని నేను కాదు. ఇంతకాలం పేదలకు ఇళ్ల పట్టాల విషయం గుర్తుకురాని ఆయనకు మరో రెండు నెలలో ఎన్నికలనగా జ్ఞప్తికి వచ్చింది. ఇదంతా నాటకం' అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ అన్నారు. ఆదివారం నగరంలోని కర్నూలు రోడ్‌లో జరిగిన బాబూ ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బాలినేనిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతి ఎన్నికల సమయంలో పట్టాలు, రోజూ తాగునీరు అని మోసపు మాటలతో వ హాయంచే యడం ఆయన అలవాటన్నారు. ఈ విషయంలో ప్రజలు కూడా తెలుసుకున్నారన్నారు. యరజర్ల వద్ద ఇళ్ల పట్టాల పంపిణీని టీడీపీ వాళ్లు అడ్డుకున్నారని మాట్లాడటం అవివేకమన్నారు. వాస్తవానికి టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అక్కడ టిడ్కో ఇళ్లు కట్టాలని స్థల పరిశీలన చేశామని తెలిపారు. అయితే అది అప్పటికే ఐరన్ ఓర్ కంపెనీకి కేటాయించడం వలన తాము కూడా ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నామన్నారు. అది తెలియకుండా ప్రజలను మభ్యపెట్టి తన పబ్బం గడుపుకునేందుకు బాలినేని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇళ్లపట్టాల పేరుతో అబద్ధపు హామీలు ఇవ్వడం, తన చేతగాని తనాన్ని టీడీపీపై నెట్టడం ఆయనకు అలవాటేనన్నారు. నాలుగున్నరేళ్లుగా గుర్తుకురాని పేదలు మరో రెండు నెలల్లో ఎన్నికలు వస్తున్న తరుణంలో గుర్తుకువచ్చారా అని ప్రశ్నించారు. 'ఇంతవరకూ ల్యాండ్ ఎక్విజేషన్ చేయలేదు. స్థలం కొనుగోలు చేయలేదు. రైతులకు డబ్బులు ఇవ్వలేదు. ఎన్‌వోసీ లభించలేదు. ప్లాట్ల కేటాయింపు జరగలేదు. కానీ వచ్చే నెలలో పట్టాలు ఇస్తామని బాలినేని చెప్తున్నారు. ఇదంతా నాటకం' అని దామచర్ల అన్నారు. పట్టాల పేరుతో అబద్ధపు హామీలు ఇవ్వడం, తన చేతగానితనాన్ని టీడీపీపై నెట్టడం ఆయనకే సాధ్యమన్నారు. ఇలాంటి చీప్ ట్రిక్స్ మానుకోవాలని హితవుపలికారు. మేయర్ గంగాడ సుజాతపైనా దామచర్ల ఘాటైన విమర్శలు చేశారు. రూ.5వేలు, రూ.10 వేలకు కక్కుర్తిపడే మేయర్ తన గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, ఇంతకన్నా ఆమె గురించి ఎక్కువ మాట్లాడితే తన విలువ పోతుందని దామచర్ల వ్యాఖ్యానించారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి28: పోరాటాల ద్వారానే అంగన్‌వాడీల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అంగన్‌వాడీల కార్యకర్తలు, ఆయాల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పేర్కొన్నారు. నాగులు ప్పలపాడులో ఆదివారం అంగన్‌వాడీలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంకా కొన్ని సమస్యలు పరిష్కారం కాలేదని, తిరిగి పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.జయంత్‌బాబు, టి.శ్రీకాంత్, వెంకటసుబ్బమ్మ, అరుణ, రమ, రజని తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే సత్ఫలితాలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 28: అందురూ కలిసి ఐకమత్యంగా పోరాడిన ప్పుడే సత్ఫలితాలు సాధించగలుగుతామని జిల్లా హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షు డు కాంతారావు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని యూటీఎఫ్ ఆఫీసులో స మగ్ర శిక్ష ప్రకాశం జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంతారావు మాట్లాడుతూ సంఘ సభ్యులు ఐక్య పోరాటం చేయటం వల్ల ప్రభు త్వంతో జరిపిన చర్చలు సానుకూలంగా జరిగినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కాంతారావు

వలంటీర్లపై ఐప్యాక్ నిఘా!

» సస్పెన్షన్లు, తొలగింపులకు సిఫార్సు చేస్తున్నట్టు ప్రచారం

చీరాల, జనవరి 28: వలంటీర్లపై ఐ ప్యాక్‌ను నిఘా అస్త్రంగా ఉపయోగిస్తున్నారు. ఐప్యాక్ సభ్యులు కొందరు చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో తిరుగుతూ అధికార వైసీపీకి ఎవరైతే అనుకూలంగా పని చేయటం లేదో వారి జాబితాను తయారుచేస్తున్నారు. ఆతరువాత సదరు వలంటీర్లకు సస్పెన్షన్ లేదా తొలగింపు ఉత్తర్వులు అందుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు తక్కువ జీతం, ఎక్కువ పని భారంతో ఉన్న తమపై ఈవిధంగా చర్యలు చేపట్టటం ఎంతవరకు సమంజసమని వారు వాపోతున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే తొలగించమని ఉత్తర్వులు వచ్చినట్లు తెలిసింది. కొందరు ఉన్నత చదువులు చదవి కూడా సరైన ఉద్యోగ అవకాశాలులేక వలంటీర్లుగా చేరినవారు ఉన్నారు. అలాంటి వారిపై కూడా ఐ ప్యాక్ సిఫార్సులతో ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో తాము వలంటీర్లుగా చేరకుండా ముందుగానే తమ చదువుతగ్గ ఉద్యోగంలో చేరిఉన్నట్లయితే బాగుండేది కదా అని వాపోతున్నారు. తమ ఉద్యోగాలు ఉంటాయో, ఊడతాయో తెలియని త్రిశంకుస్వర్గంలో ఉన్నట్లుగా తమ పరిస్థితి తయారయిందని వారు ఆవేదన చెందుతున్నారు.

టీడీపీ గెలుపునకు సమష్టి కృషిచేయాలి

చీరాల, జనవరి 28: అందరి సమిష్టి అవసరం.. అదే మన విజయానికి నాంది అవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బెంగుళూరు టీడీపీ ఫోరమ్ సభ్యులు ఆదివారం కొండయ్య, గౌరీఅమర్‌నాథ్‌ను కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. పనితీరు బాగుందన్నారు. భవిష్యత్‌లో తాము కూడా అవసరమైన సందర్భాల్లో అండగా నిలుస్తామని చెప్పారు. వారు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కొండయ్య దిశానిర్దేశం చేశారు.అనంతరం బీటీడీపీ ఫోరమ్ ప్రతినిధులు కొండయను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి వార్షికోత్సవం

వేటపాలెం(చీరాల), జనవరి 28: వేటపాలెం మండలం పందిళ్లపల్లిలో వేంచేసియున్న చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వార్షికోత్సవ ప్రత్యేక పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళ భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య , ఆయన కుమారుడు గౌరీఅమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

'సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి'



మాట్లాడుతున్న ఇంటిగ్రేటెడ్ శిక్షకులు సుబ్బారాయుడు

చినగంజాం, జనవరి 26: టీడీపీ ఎన్నికల ప్రణాళికలోని ఆరు సంక్షేమ పథకాలపై బూత్ కన్వీనర్లు, క్లస్టరు సభ్యులు, యూనిట్ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఇంటింటికి అవగాహన కల్పించాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఇంటిగ్రే టెడ్ శిక్షకులు కొల్లా సుబ్బారాయుడు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో బూత్ కన్వీనర్లు, క్లస్టరు, యూనిట్ సభ్యులకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన 2024 ఓటర్ల తుది జాబితాను క్షుణ్ణంగా పరిశీలన చేయాలని అన్నారు. దొంగ ఓట్లు తీయించేలా పోరాడాలన్నారు. మండలంలోని 37 పోలింగ్ బూత్‌లలో బూత్ కన్వీనర్లు, నాయకులు ఓటర్ల జాబితాలో ఓటర్లు అంతా ఉన్నారో లేదో సరిచూసి ఎవరికైనా ఓట్లు లేకపోయినా, ఏమైనా మార్పులు, చేర్పులు చేయాల్సివచ్చినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. 80 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఫారం-12ను ముందుగా దరఖాస్తు చేయాలని అన్నారు.

కార్యక్రయంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, 11,12 క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బత్తుల శ్రీనివాసరావు, ఆసోది సుబ్బారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్‌లు చెరుకూరి రాఘవయ్య, నక్కల వీరరాఘవులు, యెడబలిమి సాల్మన్‌రాజు, కోకి భాస్కరరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఆసోది భాస్కరరెడ్డి, చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, ఆయా గ్రామాల బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

తూర్పు కాపులకు ప్రత్యేక స్థానం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, జనవరి 28: తెలుగుదేశం పార్టీలో తూర్పు కాపులకు ప్రత్యేక స్థానం ఉందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. టీడీపీ కుటుంబంలో వారు క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. స్థానిక వైకుంఠపురం బాలసాయినగర్‌లో ఆదివారం రాత్రి తూర్పుకాపులు ఆత్మీయ సమావేశంలో కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అర్కే టౌన్‌షిప్ విశాఖపట్నం, హైదరాబాద్, రాజమండ్రి జనరల్ మేనేజర్లు ఎన్‌పీ నాయుడు, పిసిని అప్పలనాయుడు, బి.భాస్కరనాయుడు తదితరులు మాట్లాడుతూ తూర్పు కాపులలో ప్రతిఒక్కరూ టీడీపీకి ఓటు చేయాలని పిలుపునిచ్చారు. కొండయ్యకు తూర్పుకాపులకు ఉన్న సాన్నిహిత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావు, డేటా నాగేశ్వరరావు, శ్రీరాం రమేష్, గంజి పురుషోత్తమ్, పైలా రమేష్, లావేటి శ్రీనివాసతేజ, కర్పూరపు సుబ్బలక్ష్మి, వంకా హరికృష్ణ, షేక్ యాసిన్, గొట్టిపాటి రామారావు, తేలప్రోలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

చీరాల, జనవరి 28: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం వాడరేవుకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ధోని కనకరాజు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య వారికి మెడలో పార్టీ కండువాలువేసి స్వాగతించారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయఢంకా మోగించేలా పనిచేయాలన్నారు. చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అప్పుడే రాష్ట్ర భవిష్యత్ తిరిగి పురోగమన దిశగా అడుగులు వేస్తుందన్నారు. లేదంటే అంతా అంధకారమవుతుందన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌరీ అమర్‌నాథ్, కౌతవరపు జనార్దనరావు, ఎరిపిల్లి అప్పారావు, ఓసిపిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటిలోగా ఇంటర్ ఫీజు చెల్లించాలి: ఆర్‌ఐవో

ఒంగోలు(విద్య), జనవరి 28: ఇంటర్మీడియట్ ఫీజు చెల్లింపునకు తత్కాల్ పథకం ద్వారా సోమవారం వరకు బోర్డు అవకాశం కల్పించినట్లు ఆర్‌ఐవో ఎ.సైమన్‌విక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో జరుగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ ప్రైవేటు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లింపునకు బోర్డు ఈ అవకాశం కల్పించిదన్నారు. తత్కాల్ పథకం కింద రూ.3 వేలు చెల్లించి విదార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చుని ఆయన పేర్కొన్నారు.

రూ.3లక్షల సొత్తు చోరీ

ఒంగోలు (క్రైం), జనవరి 28: ఒంగోలు నగరం హరిహరనగర్‌లో దుండగులు చోరీకి పాల్పడి సుమారు రూ.3లక్షల విలువైన సొత్తును అపహరించుకెళ్లారు. స్థానిక హరిహర్‌నగర్‌లోని ఎస్. శ్రీనివాసరాజు ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. శ్రీనివాసరాజు ఆయన భార్య ఈనెల 26న హైదరాబాద్ వెళ్లారు. ఇంట్లో ఇద్దరు పిల్లలు, శ్రీనివాసరాజు తల్లి అంకమ్మ నిద్రపోతున్నారు. కిటికీలో నుంచి ఇంటి వెనుక తలుపు తీసి దొంగలు లోపలకి చొరబడ్డారు. ఒక బెడ్‌రూంలో పిల్లలు నిద్ర పోతుండగా మరో బెడ్‌రూంలో దొంగలు అక్కడే ఉన్న బీరువా తాళాలతో తీసి బంగారు ఆభరణాలు, వెండి సామానులు అపహరించుకు వెళ్లారు.

ఆదివారం ఉదయం శ్రీనివాసరాజు తల్లి అంకమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దొంగ చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కు ధరించినట్లు గుర్తించారు.

ఇసుక కష్టాలు తీరేదెట్టా..!

» నాలుగు నెలలుగా అష్టకష్టాలు

» ఇతర ప్రాంతాల నుంచి నాణ్యతలేని ఇసుకతో నిర్మాణాలు

» కూలిన భవనాల శ్లాబులు

» సీనరేజ్ వసూలులో కుదరని ఒప్పందాలే కారణమా!



అద్దంకిలో నిలిపిఉంచిన ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఇసుక టిప్పర్లు

అద్దంకి, జనవరి 28: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని చందంగా ఉంది అద్దంకి ప్రాంత ప్రజల పరిస్థితి. అందుబాటు గుండ్లకమ్మ నదిలో ఇసుక ఉన్నా సీనరేజ్ వసూలులో ఒప్పందాలు కుదరకపోవటంతో అసలుకే మోసం వచ్చింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాణ్యతలేని ఇసుకతో ఇళ్ళ శ్లాబులు వేయటంతో అద్దంకి పట్టణంలో రెండు ప్రారంభంలోనే కూలాయి. దీంతో కొత్తగా భవనాల నిర్మాణం చేసే వ్యక్తులు ఆందోళన చెందుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ట్రాక్టర్ ఇసుక గుండ్లకమ్మ నది నుంచి అద్దంకి పట్టణంలోకి రూ.1200 నుంచి రూ.1500లకు చేరేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీనరేజ్ వసూలు ప్రారంభించటంతో ట్రాక్టర్ ఇసుక రూ.4 వేలకు చేరింది. అనంతరం పలుసందర్భాలలో చేపట్టిన ఆందోళనలతో రూ.3500లకు దిగివచ్చింది.



గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతం

అయితే, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక సీనరేజ్ వసూలు వేరే సంస్థ తీసుకున్న తరువాత అద్దంకి ప్రాంతంలోని గుండ్లకమ్మ నదిలో అధికారికంగా ఇసుక రీచ్ లేకపోవటంతో తవ్వకాలు ప్రారంభించలేదు. దీనికితోడు ఇసుక స్టాకు పాయింట్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో నెల్లూరు జిల్లా నుంచి ఇసుక దిగుమతి పెరిగింది. అదే సమయంలో చాటుమాటుగా పక్కనే ఉన్న ముండ్లమూరు మండలంలోని చిలకలేరు నుంచి ఇసుక రవాణా జరుగుతుంది. అయితే, ఇసుక నాణ్యత లేకపోవటంతో రెండు భవనాల శ్లాబులు కుంగాయి. దీంతో రాత్రి సమయాలలో అధికారులకు ముడుపులు ముట్టజెప్పి అత్యధిక ధర చెల్లించి ఇసుక రవాణా జరుగుతుంది.

ఇక వైసీపీ అద్దంకి నియోజవకర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన హనిమిరెడ్డి తనదైన మార్కు చూపించాలన్న ఉద్దేశంతో తక్కువ ధరకు ఇసుక సరఫరా చేయిస్తానని స్థానిక నేతలకు హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఇసుక సీనరేజ్ తగ్గించి తీసుకునేందుకు ససేమిరా అన్నట్లు తెలుస్తుంది. దీంతో అసలుకే ఎసరు వచ్చి ఇసుక రవాణా ఆగిపోయినట్లు తెలుస్తుంది. ఎట్టకేలకు కనీసం రెండు, మూడు వందల రూపాయలైనా తగ్గించి సీనరేజ్ వసూలు చేయాలని రాయబారాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. ధర తగ్గకపోగా అసలు సరఫరా లేకపోవటంతో అధిక ధరకు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

» రేణంగివరంలో పలువురు టీడీపీలో చేరిక



రేణంగివరంలో గొట్టిపాటికి హారతిలిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

పంగులూరు, జనవరి 28: రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని రేణంగివరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఆయన అనుచరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. రేణంగివరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఓబుల్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులకు ఎమ్మెల్యే రవికుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా కలసికట్టుగా కృషి చేద్దామన్నారు. కష్టపడి పనిచేసే వారికి ఖచ్చితంగా పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. రాష్ట్రం బాగుపడాలనే తలంపు, అరాచక వైసీపీ దుర్మార్గపు పాలన నుంచి బయటపడాలనే ఆలోచనతో ప్రజలు టీడీపీలోకి స్వచ్ఛందంగా వస్తున్నారని చెప్పారు.

టీడీపీ హయాంలో పల్లెలు ప్రగతి బాటలో పయనించాయని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. నేడు పన్నుల బాదుడుతో పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం రోడ్లకు ఏర్పడిన గుంతలలో తట్టెడు మట్టికూడా పోయలేని దుస్థితి ఉందన్నారు. ఓటీఎస్ పేరుతో వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ళపై భారం మోపిందన్నారు. బడ్జెట్‌లో పట్టణ అభివృద్ధికి నిధుల కోత విధించిన వైసీపీ ప్రభుత్వం సిమెంట్, డీజిల్, పెట్రోలు ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. నాలుగున్నరేళ్ళ వైసీపీ పాలనలో ఒక్కో కుటుంబంపై పన్నులు, ధరల పెంపు రూపంలో రూ.2 లక్షల అదనపు భారం మోపిందని గొట్టిపాటి ఆరోపించారు. తొలుత ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేఖర్, మస్తాన్‌వలి, స్వామి, పెడవల్లి అశోక్, వరపర్ల సుబ్బారావు, తెలగతోటి రాధ, శ్రీనివాస్, పూర్ణ, జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి టీడీపీలో చేరుతున్న అద్దంకి పట్టణంలోని 7వ వార్డు వైసీపీ కార్యకర్తలు

టీడీపీలోకి చేరికలు, సంఘీభావాల వెల్లువ

అద్దంకి, జనవరి 28: అద్దంకి నియోజకవర్గంలో టీడీపీలోకి చేరికలు, సంఘీభావాలు వెల్లువలా సాగుతున్నాయి. ఆదివారం అద్దంకి పట్టణంలోని 17,7 వార్డులకు చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు చిలకలూరిపేటకు పెద్ద సంఖ్యలో వెళ్లి ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ప్రతిఒక్కరూ బాగా కష్టపడి చంద్రబాబునాయుడును సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని పెద్దఎత్తున చేరికలు జరుగుతున్నాయన్నారు. వైసీపీ పాలనలో అప్పు పుట్టకపోతే జీతాలు కూడా ఇవ్వలేని రాష్ట్రంగా మారిందన్నారు. జగన్‌రెడ్డి అభ్యర్థులను ప్రకటిస్తుంటే అభ్యర్థులు మాత్రం వైసీపీని వదిలిపెట్టి పోతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వాన్ని బంగా ళాఖాతంలో కలిపివేయటం ఖాయమన్నారు.

17వ వార్డు నుంచి పలు సామాజిక వర్గాలకు చెందిన నేతలు షేక్ మాబులు, సైదులు, మీరావళి, షరీఫ్, దగ్గు నారాయణ, జడ శ్రీకాంత్, బహూనాధం శ్రీనివాసరావు, సిద్ది మహేష్ తదితరులు టీడీపీలో చేరారు. బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాలను అందజేశారు.

రాజకీయంగా ఎదుర్కోలేక ఏలూరిపై కుట్ర

» ఎమ్మెల్యే స్వామి ధ్వజం

పర్చూరు, జనవరి 28: తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుని రాజకీయంగా ఎదుర్కోలేక ఆయనపై బురద జల్లేందుకు వైసీపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందని ప్రకాశం జిల్లా కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓప్రకటన విడుదల చేశాడు. పర్చూరు నియోజకవర్గంలో గెలవలేమనే భయంతో ఏదొకరకంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రతిష్టను దిగజార్చాలనే కుట్రతో వైసీపీ ప్రభుత్వ పెద్దలు తెరలేపారని మండిపడ్డారు. రాజకీయంగా ఏలూరిని ఎదుర్కొనే అభ్యర్థి దొరక్కపోవటం, ఆయనపై నిలబడే దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడు లేకపోవడం వైసీపీకి శాపంగా మారిందన్నారు. దీంతో తాడేపల్లి పెద్దలు ఏలూరిని ఇబ్బందికి గురిచేయాలనే లక్ష్యంతో అధికార దర్పన్ని వినియోగించి కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. పదిహేనేళ్ల క్రితం ఎమ్మెల్యే ఏలూరి నోవా అగ్రిగ్రూప్ సంస్థను స్థాపించారని చెప్పారు. రాజకీయ ప్రవేశం చేసిన తరువాత ఆయన ఆ సంస్థ నుంచి బయటకు వచ్చారన్నారు. పబ్లిక్ లిమిటెడ్ సంస్థగా పలువురు డైరెక్టర్ల ఆధీనంలో నోవా సంస్థ నడుస్తుందన్నారు. ఆ కంపెనీలో లోటుపాట్లు ఉంటే గత నాలుగున్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. అక్రమ మార్గంలో గెలవాలనే తలంపుతో ప్రతిపక్ష పార్టీల ఓట్లు తొలగిస్తున్న వైసీపీ ప్రభుత్వంపై ఎమ్మెల్యే ఏలూరి పోరాటం సాగించారని, ఆ కక్షతోనే కుట్రలు చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం పుట్టుకే విధ్వంసంతో ప్రారంభమైందన్నారు.

నోవా గ్రూపు సంస్థ ఐపీఓ(తొలి పబ్లిక్ ఆఫర్)లో అడుగుపెట్టిందనే కక్షతో అధికారం అడ్డుపెట్టుకొని దాడులు పేరుతో ప్రతిష్టను దిగజార్చాలని చూస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ఏలూరి విజయాన్ని ఎవరు ఆపలేరన్నారు. జగన్ రెడ్డి కుట్రలు ప్రజలందరికీ తెలుసునని, ఎమ్మెల్యే ఏలూరి అంటే ప్రజల్లో ఒక విశ్వాసం ఉందన్నారు. సీఎం కార్యాలయం తాడేపల్లి నుంచి ఏలూరిపై కుట్రలు సాగుతున్నాయని, అవి పర్చూరులో ఫలించవన్నారు. గతంలో సైతం హెరిటేజ్‌పై బురద జల్లిన ప్రభుత్వం తాజాగా ఏలూరిపై, సంస్థపై బురద జల్లేపనిలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా వైసీపీ పెద్దలు ఏలూరిపై చీప్ పాలిటిక్స్ మానుకొని ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేయాలని ఎమ్మెల్యే స్వామి హితవు పలికారు.

రానున్న ఎన్నికల్లో పర్చూరు నుంచి వైసీపీ అంతిమయాత్ర ప్రారంభమవుతుందని హెచ్చరించారు. ఏలూరిపై ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయటం దుర్మార్గ చర్యగా స్వామి పేర్కొన్నారు.


నిరుపయోగంగా ప్రభుత్వ సామగ్రి

» అధికారుల నిర్లక్ష్యంతో స్టోర్ రూంలకు పరిమితమైన వైనం

» స్వచ్ఛ గ్రామాల కోసం మంజూరైన చెత్త డబ్బాలు పంపిణీ నిల్

» పూర్తిస్థాయిలో అందజేయని క్రీడా పరికరాలు





బల్లికురవ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్టోర్ రూంలో పడవేసి ఉన్న వీల్ చైర్లు, చెత్త సేకరణ డబ్బాలు

బల్లికురవ, జనవరి 28: ప్రభుత్వ పథకాల అమలుకు ప్రభుత్వం పలురకాల మెటీరియల్‌ను సరఫరా చేస్తున్నా క్షేత్రస్థాయిలో అందిస్తున్న దాఖలాలు లేవు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలలో ఉన్న పలురకాల సామగ్రిని చూసిన ప్రజలకు జగనన్న నిర్లక్ష్యం అనే కొత్త పథకం పెట్టారేమో అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. బల్లికురవ మండలంలోని అన్ని గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త సేకరణ చేసేందుకు రెండేసి చొప్పున డబ్బాలను సరఫరా చేసింది. వీటిని సచివాలయాల ద్వారా అందజేయాల్సి ఉంది. డబ్బాలు మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి వచ్చి పక్షం రోజులు దాటినా ఇంతవరకు పంపిణీ చేయలేదు. ఒకటి రెండు సచివాలయాలకు అందించినా వారుకూడా పంపిణీ చేయలేదు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న స్టోర్ రూంలు సామగ్రితో నిండి ఉన్నాయి.

అలాగే, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అవసరాలు కలిగిన వారి కోసం ప్రభుత్వం అందించిన వీల్ చైర్లు సైతం పంపిణీ చేయకుండా స్టోర్ రూంలో పడవేసి ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. అలాగే, ఇటీవల ప్రభుత్వం ఆర్భాటంగా ఆడుదాం ఆంధ్ర ప్రోగ్రాంను పెట్టి క్రీడాకారుల ఆటలకు కావాల్సిన క్రీడా సామగ్రిని మండల పరిషత్ కార్యాలయానికి అందజేసింది. వీటిని సకాలంలో క్రీడాకారులకు అందజేయలేదు. ఈ కార్యక్రమం కూడా ముగిసింది. అయినప్పటికీ కార్యాలయం స్టోర్ రూంలో క్రికెట్ కిట్‌లు, బాడ్మింటన్ కాక్‌లు, క్రీడాకారుల రక్షణకు తీసుకొనే మెటీరియల్‌ను నిరుపయోగంగా పడవేశారు. ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కోట్లు ప్రజాధనాన్ని వెచ్చించి పలురకాల సామగ్రిని కొనుగోలుచేసి పంపిస్తున్న క్షేత్రస్థాయిలో మాత్రం సక్రమంగా అందటం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మండల ప్రజాపరిషత్ కార్యాలయంతో పాటు అన్ని సచివాలయాలలో ప్రజలకు ఉపయోగపడేలా ఉన్న సామగ్రిని వెంటనే పంపిణీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం

వేటపాలెం(చీరాల), జనవరి 28: అంగన్‌వాడీ కార్యకర్తలు ఐకమత్యంగా ఉంటే అన్ని సమస్యలు పరిష్కరించుకోవచ్చని సీఐటీయూ బాధ్యుడు ఎం.వసంతరావు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆదివారం సమ్మె నేపథ్యంలో జరిగిన పరిణామాలు, సాధించిన విజయాలపై పునరుచ్చరణ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యం



ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరాం

వేటపాలెం(చీరాల), జనవరి 28: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ చెప్పారు. వేటపాలెం మండలం పాపాయిపాలెంలో రూ.4.30 కోట్లతో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, సీసీ రోడ్లను ఆదివారం బలరాం, వెంకటేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురు నాయకలు మాట్లాడుతూ ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్‌లు చూపిన ప్రత్యేక చొరవ కారణంగానే నిధులు మంజూరు జరిగిందన్న విషయాన్ని గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో నేత్రదానం

ఇంకొల్లు, జనవరి 28: ఇంకొల్లు రోటరీ అవయదానకమిటీ ఆధ్వర్యంలో నేత్రదానం జరిగింది. చింతగుంపల గ్రామానికి చెందిన కరణం కాంచనమాల(84) మృతి చెందగా ఆదివారం గుంటూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబసభ్యులు వెంకన్న, సుబ్బారావు, నాగభూషణంను ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, కరి కమలేశ్వరరావు, చుండి సాంబశివరావు, తదితరులు అభినందించారు.

రాఘవరావుకు పలువురు నివాళి

చినగంజాం, జనవరి 28: మండలంలోని కడవకుదురుకు చెందిన తెలుగుయువత మండల మాజీ అధ్యక్షుడు అనంత రాఘవరావు(47) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, టీడీపీ బాపట్ల పార్లమెంట్ కార్యదర్శి బత్తుల శ్రీనివాసరావు, జనసేన పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్, కర్ణ కిరణ్‌తేజ, సందు శ్రీనివాసరావు, అడుసుమల్లి హరిబాబు, తోట అశోకచక్రవర్తి, పసుపులేటి సాయి, బుద్ధి శ్రీహర్ష, వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ రాఘవరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

పంగులూరు, జనవరి 28: పంగులూరులో రాష్ట్రస్థాయి పోలురాడా ఎడ్ల పోటీలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పల్లపు రాము ప్రారంభించారు. ఈ పోటీలలో 20 ఎడ్ల జతలు పాల్గొంటున్నాయని నిర్వాహకులు రావూరి శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను తిలకించేందుకు పంగులూరు, పరిసర ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బీవీ కృష్ణారెడ్డి, స్వయంపు హనుమంతరావు, గోపాలరెడ్డి, సుబ్బారెడ్డి, జంపాని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'దళితులను ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటున్నారు'

చీరాలటౌన్, జనవరి 28: రాష్ట్రంలో దళితులను ఓట్ల కోసం మాత్రమే వాడుకుంటున్నట్లు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక గడియార స్తంభం కూడలిలో జరిగిన అంబేడ్కర్ సందేశయాత్ర సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అణగారిన కులాలకు తీరని అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. రాజ్యాధికారం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఖాదరవలి, అన్నపూర్ణ, రామచంద్రారెడ్డి, లావణ్య, అబ్దుల్ ఖాదర్, బుజ్జి, మహబూబ్, ఏసురత్నం, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

రేపు పర్చూరులో ఆధ్యాత్మిక ప్రవచనం

పర్చూరు, జనవరి 28: పర్చూరులోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం 5గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ పాల్గొని గర్వం తొలగించే హనుమంతుడు అనే అంశంపై వివరిస్తారన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సూర్యయజ్ఞం రాజ్యాంగ విరుద్ధం

ఒంగోలు(కల్చరల్), జనవరి 28: పాఠశాల విద్యార్థులతో సూర్యయజ్ఞం నిర్వహించటం రాజ్యాంగ విరుద్ధమని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు మొగల్ కాలేషా బేగ్ పేర్కొన్నారు. ఆదివారం ఇందుకు సంబంధించి వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఫిబ్రవరి 15వ తేదీ 3 వేల మంది విద్యార్థులతో సూర్యయజ్ఞం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారని, అయితే పాఠశాలలో ఎటువంటి మతప్రమేయం ఉండకూడదని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(హెచ్)కు విరుద్ధమన్నారు. దీనిని యజ్ఞం అని కాకుండా వ్యాయామంగా పేర్కొంటే బాగుటుందని వారు పేర్కొన్నారు.

నేడు నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమం

ఒంగోలు(కల్చరల్), జనవరి 28: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమాన్ని సోమవారం ఒంగోలులోని ప్రకాశం జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో నిర్వహిస్తున్నట్లు భవిష్యనిధిశాఖ జిల్లా నోడల్ అధికారి ఎం.సమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. వివిధ సంస్థలలో పనిచేసే కార్మికులు, పింఛనుదారుల ప్రావిడెంట్ ఫండ్ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని, అదేవిధంగా భవిష్యనిధి చేపడుతున్న వివిధ ఆన్‌లైన్ సేవల గురించి కూడా అవగాహన కల్పిస్తామని ఆయన చెప్పారు. కనుక కార్మికులు, పింఛనుదారులు, ఇతర ప్రావిడెంట్ ఫండ్ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొనవలసినదిగా సమ్మయ్య కోరారు.

రేపు రెజ్లింగ్ పోటీలు

టంగుటూరు, జనవరి 28: మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 30వ తేదీన రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు పీడీ అశోక్‌బాబు ఆదివారం తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల నుంచి సీనియర్స్, అండర్ 20, అండర్ 15 క్రీడాకారులు పాల్గొననున్నారు. సీనియర్ క్రీడాకారులకు జైపూర్‌లో జాతీయ స్థాయి పోటీలు ఫిబ్రవరి 1నుంచి 5వ తేదీ వరకు.. అండర్ 20, అండర్ 15 విభాగాల నుంచి విజయం సాధించిన వారికి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఫిబ్రవరి 11నుంచి 17వ తేదీ వరకు జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. ఇక్కడ జరిగే రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలను జిల్లా అమర్చూర్ రెజ్లింగ్ అసోసియేషన్, ఏపీ రెజ్లింగ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించునున్నట్లు అశోక్ తెలిపారు.

ఫిబ్రవరిలో డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ఎన్నికలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 28: జిల్లా డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ఎన్నికలను ఫిబ్రవరి నెలలో నిర్వహించాలని అసోసియేషన్ నిర్ణయం తీసుకున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి పావులూరి శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఒంగోలులోని జిల్లా కెమిస్ట్‌భవన్‌లో ఈసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంఘాలు సభ్యత్వం పూర్తి చేయలేదని, అటువంటి వారు ఫిబ్రవరి 4వ తేదీ లోపు సభ్యత్వాలను పూర్తి చేయాలన్నారు. అదేనెలలో 5, 6 తేదీలలో ఓటర్ల లిస్ట్ తయారు చేస్తామన్నారు. ఎన్నికల అధికారిగా సి.లక్ష్మణకుమార్ రెడ్డిని, సహాయ అధికారులుగా నరసింహారావు, కొల్లా మధులను నియయిస్తూ సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది.


చలో విజయవాడ కరపత్రం ఆవిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 28: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 5వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పూరు మాధవరావు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఇతర సభ్యులతో కలిసి ఆయన ఆదివారం ఒంగోలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పర్రె వెంకటరావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల విషయంలో ప్రభుత్వం సాచివేత ధోరణి అవలంబిస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోపు సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ పునరుద్ధ రిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాటతప్పారన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించకుండానే 12వ పీఆర్సీని నియమించి, జీవో నెంబర్ 117 ద్వారా ప్రాథమిక పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలగా మార్చారని ఆయన ఆరోపించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
సోమవారం 29 జనవరి 2024



మా పోర్టును కాపాడండి సార్.. : చంద్రబాబు సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అదానీ పోర్టు సిబ్బంది




నెల్లూరులోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు, అభిమానులు

ఇలాంటి ఎమ్మెల్యేలు అవసరమా!?

బూతులు తిట్టిన వారికి పదవులు • అభివృద్ధిపై నోరు తెరవని అనిల్
కావలికి పట్టిన చెద రామిరెడ్డి • డైలీ, వీక్లీ, మంత్లీ కలెక్షన్లలో ప్రసన్న
అన్ని డీల్స్‌లో కాకాణిదే పైచేయి • మైనింగ్ డీల్స్‌లో విక్రమ్
ఎమ్మెల్యేలపై విరుచుకుపడ్డ టీడీపీ అధినేత చంద్రబాబు

నెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : 'ప్రజాప్రతినిధులు అంటే ప్రజాసేవ చేస్తారు. కానీ ఇప్పుడు ఎవరెక్కువ బూతులు తిడితే వారు మంచివారట. బూతుల రత్నకు ఎమ్మెల్యే, బూతుల సామ్రాట్‌కు ఎంపీ, ఇంకా ఎక్కువ తిడితే నటసామ్రాట్ కింద మంత్రి పదవి ఇస్తారు. ఇదేం పద్ధతి!? మనం ఉండేది బూతులు పడడానికా!? ఇలాంటి వారు రాజకీయాలకు అవసరమా..? కానీ ప్రజల కోసం అన్నీ పడుతున్నా. సభ్యత అడ్డం వస్తోంది గానీ లేకుంటే వారి అంతు చూసే వాడిని. రాష్ట్ర భవిష్యత్ కోసం సంయమనం పాటిస్తున్నా' అంటూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. నెల్లూరు పార్లమెంటుకు సంబంధించి 'రా.. కదలిరా..' కార్యక్రమం ఆదివారం నెల్లూరులోని ఎస్వీజీఎస్ మైదానంలో జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు హెలికాప్టర్‌లో కనుపర్తిపాడులోని హెలిప్యాడ్‌కు చేరుకున్న చంద్రబాబు, అక్కడి నుంచి రోడ్డు మార్గాన సభా వేదికకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు వైసీపీ ఎమ్మెల్యే దోపిడీ, అరాచకాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు ప్రసంగం ఆయన మాటల్లోనే..


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తూ..

• ఒక్కొక్కరిది ఒక్కో చరిత్ర

నెల్లూరులో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అభివృద్ధి నిల్.. మాటలు ఫుల్. తొడలు కొడతాడు, మీసం మెలేస్తాడు. పిచ్చిపిచ్చిగా మాట్లాడతాడు, గావు కేకలు పెడతాడు కానీ అభివృద్ధి గురించి అడిగితే నోరు కూడా తెరవలేడు. కానీ ఈయన పెద్ద ఎమ్మెల్యే. దొంతాలి వద్ద బినామీల పేరుతో రూ.100 కోట్లు విలువ చేసే 50 ఎకరాలు, నాయుడుపేటలో 58 ఎకరాలు, ఇస్కాన్ సిటీలోనూ బినామీల పేరుతో భూములు కొట్టేశాడు. వీటన్నింటినీ చూసి ప్రజలు ఛీ కొడతా ఉంటే ముఖ్యమంత్రి అతనికి సీటు లేదని చెప్పాడు. ఎక్కడకు పంపుతారో తెలియదు. కావలి ఎమ్మెల్యే గురించి ఎంత చెప్పినా తక్కువే. అతను కావలికి పట్టిన చెద. పేరు చెప్పేది కూడా నాకిష్టం లేదు. అరాచకాలకు బ్రాండ్ అంబాసిడర్ ఆయన. లేఅవుట్ వేస్తే కప్పం కట్టాలి. ఇళ్లు కడితే కమీషన్ ఇవ్వాలి. షాపు పెట్టుకుంటే వసూలు చేస్తాడు. కావలి రూరల్, దగదర్తిలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. కోవూరులో నల్లపురెడ్డి డైలీ, వీక్లీ, మంత్లీ మామూళ్లు దండుకుంటున్నాడు. లేఅవుట్ వేయాలంటే కమీషన్ ఇవ్వాలి. ఇసుకలో దోపిడీ. చివరకు ఎమ్మెల్యే తమ్ముడే అన్నకు సీటు ఇవ్వొద్దని చెబుతున్నాడు. ఆత్మకూరులో పేరుకే విక్రమ్. బంధువులందరి ద్వారా కాంట్రాక్టులు, లేఅవుట్లు, ఇసుక దందాలు చేస్తున్నారు. మైనింగ్ డీల్స్ చేస్తున్నారు. సర్వేపల్లిలో ఒక ఎమ్మెల్యే ఉన్నాడు కాకాణి. కాణి లేనిదే పని జరగదు. పోర్టును కూడా అడ్డం పెట్టుకొని డబ్బులు దోచేస్తూ అక్కడ కూడా కార్యక్రమాలు జరగకుండా అడ్డుకుంటున్న ప్రబుద్ధుడు కాకాణి.

అందుకే తిరుగుబాటు..

టీడీపీ హయాంలో దళిత, గిరిజన విద్యార్థుల కోసం నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడులో గురుకుల పాఠశాల నిర్మించాం. 90 శాతం పూర్తయింది. ఆ పది శాతాన్ని పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎన్నిసార్లు తిరిగినా పని జరగలేదు. కొండాయపాలెం గేట్ వద్ద అంబేడ్కర్ స్టడీ సర్కిల్, బీసీ భవన్ నిర్మాణం చేపడితే వాటిని పూర్తి చేయమని ప్రభుత్వాన్ని అడిగారు. కానీ చేయలేదు. ఆమంచర్లలో 500 ఎకరాల భూమి ఉంటే అందులో పరిశ్రమలు పెడితే ఉద్యోగాలు వస్తాయని అడిగితే అతీ గతీ లేదు. సీఎం చేసేవి తప్పు అని మరో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా గళమిప్పారు. తొలిసారి తిరుగుబాటు చేసిన ఇద్దరు ఎమ్మెల్యేలు నెల్లూరు జిల్లాకు చెందిన వారే. అంబేడ్కర్ ఆశయం కోసం చంద్రన్న ఆచరణ చేస్తున్నారని, ప్రజల బతుకు బాగుండాలంటే మళ్లీ టీడీపీ రావాలని పాదయాత్ర చేస్తున్న నెల్లూరుకు చెందిన చింతల అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్నా.

• అధికారంలోకి రాగానే..

'తెలుగుదేశం అధికారంలోకి రాగానే సోమశిల హైలెవల్ కెనాల్, సోమశిల అప్రాన్ పనులు పూర్తి చేస్తాం. కొండ్లపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం. కనిగిరి రిజర్వాయర్‌లో పూడిక తీస్తాం. నాడు దగదర్తిలో నేనే ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేశా. అధికారంలోకి రాగానే దానిని పూర్తి చేస్తా. చెన్నై-నెల్లూరు-తిరుపతి నగరాలను ట్రై సిటీ కింద కనెక్ట్ చేసి నెల్లూరు జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మారుస్తా. రాళ్లపాడు కాలువ పనులు పూర్తి చేస్తాం. ఉలవపాడు మామిడి మార్కెట్‌ను పూర్తి చేసి ప్రారంభిస్తాం. ఉదయగిరిలోని పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు కూడా పూర్తి చేస్తాం".

తమ్ముళ్లలో జోష్!

నెల్లూరులో చంద్రబాబు సభ విజయవంతం
టీడీపీ, జనసేన శ్రేణుల్లో కదనోత్సాహం నింపిన రా.. కదలిరా!
మండుటెండను లెక్కచేయని అభిమానం

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఆదివారం జరిగిన రా.. కదలిరా..!!! సభ టీడీపీ, జనసేన పార్టీ శ్రేణుల్లో ఎన్నికల కదనోత్సాహం నింపింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబు ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తు పట్ల ప్రజలను ఆలోచింపజేసింది. వేలాదిగా తరలివచ్చిన జన సందోహం పసుపుదళంలో సంతోషాన్ని నింపగా, జైలు జీవితం తరువాత తొలిసారిగా నెల్లూరుకు వచ్చిన చంద్రబాబును చూడగానే ప్రజలు ఉద్వేగానికి లోనుకావడం రానున్న ఎన్నికల ఫలితాలను ప్రస్ఫూటింపజేసింది. నెల్లూరు నగరం మొత్తం సభా ప్రాంగణమైన ఎస్వీజీఎస్ మైదానం వైపు మళ్లింది. ఉదయం పది గంటల నుంచే పార్టీ జెండాలు చేతబట్టిన టీడీపీ,



జనసేన పార్టీల కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకోవడం మొదలెట్టారు. సభ ప్రాంగణాన్ని కలిపే జాతీయ రహదారి నగరవాసుల తాకిడిని తట్టుకోలేక కిటకిటలాడింది. చంద్రబాబు వచ్చే సరికి మధ్యాహ్నం ఒంటి గంట అయ్యింది. అప్పటివరకు ప్రజలు మండుటెండను సైతం లెక్కచేయక ఎదురుచూశారు. నీడ కోసం షామియానాలు వేయకున్నా కట్టుకదల్లేదు. చంద్రబాబు వేదికపైకి అడుగుపెట్టగానే పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేస్తూ అభివాదం చేశారు. సీఎం..సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చంద్రబాబు ప్రసంగం కూడా కార్యకర్తల్లో చైతన్యాన్ని, ప్రజల్లో ఆలోచనను కలిగించింది. ఐదేళ్లపాటు రాష్ట్రంలో ఎలా దోపిడీ జరిగింది, రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ ఎలా శ్రమించింది చంద్రబాబు వివరించిన తీరు ఆకట్టుకుంది. టీడీపీ, జనసేన పార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం ఎంత అవసరమో వివరించిన తీరు ప్రజలను ఆలోచింపజేసింది. రా.. కదలిరా! కార్యక్రమం ప్రజలకు మాత్రమే కాదని రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి వచ్చే వైసీపీ నాయకులు, కార్యకర్తలను కూడా ఆహ్వానిస్తున్నామని చంద్రబాబు అన్న మాటలు కొత్త ఆలోచనలను కలిగించింది. జిల్లా నుంచి ఇంకా ఎవరైనా వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారా!? అనే చర్చ మొదలయ్యింది. హెలిప్యాడ్ వద్ద చంద్రబాబును రిసీవ్ చేసుకున్న దగ్గర నుంచి తిరిగి వెళ్లే వరకు అడుగడుగునా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన్నుకలిసేందుకు ఎగబడ్డారు.





బ్రిటీష్ పాలన కంటే దారుణంగా ఏపీ!



ఏపీలో బ్రిటీష్ పాలన కంటే దారుణంగా వైసీపీ పాలన సాగుతోంది. రాక్షస పాలనకు అద్దం పట్టే విధంగా జగన్ సర్కారు నడుస్తోంది. 2014-19ల మధ్య జరిగిన అభివృద్ధిలో కనీసం 5 శాతం కూడా నెల్లూరులో జరగలేదు. ఈ విషయాన్ని స్వయంగా ప్రజలే చెప్తున్నారు. పన్నులు పెంచకుండా చేసేదాన్నే పాలన అంటారు. పరిశ్రమల స్థాపన లేకుండా రాష్ట్రానికి ఆదాయం, ఉపాధి ఎలా వస్తుంది.

- పీ నారాయణ, మాజీ మంత్రి

ప్రజలే యుద్ధానికి సిద్ధం



చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపి జగన్ పెద్ద తప్పు చేశాడు. జీవితంలో ఈ తప్పును సరిదిద్దుకోలేడు. విప్లవ కెరాటాల్లో తరలి వచ్చిన టీడీపీ శ్రేణుల ఉత్సాహంతోనే చంద్రబాబు ప్రమాణ స్వీకారం ఖరారైంది. ప్రజలే యుద్ధానికి సిద్ధమయ్యారు. జిల్లాలో పదికి పది స్థానాలు గెలుస్తాం. రాష్ట్రంలో 57 శాతం ఓట్లుతో 160 స్థానాలు టీడీపీ, జనసేన కూటమి గెలుస్తుంది.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే

వైసీపీకి ఈ సభ నుంచే హెచ్చరిక



ఎర్రటి ఎండలోనూ లెక్క చేయక నిలబడిన కార్యకర్తలతో సందడిగా మారిన కదిలిరా సభ అదిరింది. ఇక్కడ నుంచే వైసీపీకి హెచ్చరిక మొదలవు తుంది. ప్రకృతిని విధ్వంసం చేసే స్థాయికి వైసీపీ అరాచ కాలు చేరాయి. నెల్లూరులో ఉండే మంత్రి ఉదయం టిఫిన్‌లోకి మట్టి, మధ్యాహ్నం భోజనంలోకి ఎర్రమట్టి, రాత్రి డిన్నర్‌లోకి ఇసుక తిని బతికేస్తున్నాడు. నెల్లూరు జిల్లాకు, రాష్ట్రానికి ఊపిరైన కృష్ణపట్నం పోర్టును ఈ నెలాఖరున తరలించేస్తున్నట్లు అదానీ కంపెనీ సమా చారం ఇచ్చింది. ఇందుకు మంత్రి దందానే కారణం.

- సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ మంత్రి

జగన్ జైలుకెళితే ఇక రాడు!



సమయం లేదు మిత్రమా.. కేవలం 70 రోజులు మాత్రమే ఉంది. ఆ తరువాత చంద్ర బాబు నాయకత్వం తో టీడీపీ ప్రభుత్వం ఏర్పడు తుంది. మూడు ముక్కల జగన్ ఇంటికి వెళ్తాడు. ఈ సారి జగన్ జైలుకు వెళ్తే ఇక రాడు. నెల్లూరులో నారాయణ మీద పోటీ చేసేందుకు అభ్యర్థి దొరకక వైసీపీ వెతుకులాడుతోంది. విర్రవీగిన అనిల్‌కు చివరికి సీటే లేకుండా పోయింది.

- కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నుడా మాజీ చైర్మన్

వైసీపీ పాలనలో రెడ్లే నష్టపోయారు



రాష్ట్రంలో వైసీపీ పాలన వచ్చాక అన్నీ వర్గాల కంటే ఎక్కువగా నష్ట పోయింది. రెడ్లే. అన్నీ విధాల చితికి పో యారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఏ ఒక్క రంగం ఆశించినంత ప్రగతి సాధించలేదు. అన్ని రంగాలలో ప్రాధాన్యతగా ఉన్న రెడ్లు ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతిన్నారు.

- రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఏం చేశాడని ఆయన్ను గెలిపించాలి



పేదోడికి పటెడన్నం కూడా పెట్ట లేని వ్యక్తి ఇక ప్రజలను ఎలా పాలించగలరు. రూ.5లకు అన్నం తినే అన్న క్యాంటీ న్లను అర్ధంతరంగా తీసేశాడు. దీంతో పేదోడి కడుపు మీద కొట్టాడు. ఇప్పటికీ ప్రభుత్వాలు మారిన తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు, కర్ణాటకలో ఇందిరమ్మ క్యాంటీన్లు నడుస్తూనే ఉన్నాయి. ఇటు తిండి పెట్టక, అటు ఇల్లు ఇవ్వక పేదలకు ఏం చేశాడని మళ్లీ జగన్ను గెలిపించాలి.

- అబ్దుల్ అజీజ్, మాజీ మేయర్

ఎమ్మెల్యే ప్రసన్నకు ధనదాహం



2014-19 మధ్య కోవూరు నియోజక వర్గాన్ని టీడీపీ హయాంలో రూ.1600 కోట్లతో మా తండ్రి పోలంరెడ్డి శ్రీనివా సులురెడ్డి అభి వృద్ధి చేశాడు. కానీ ఆ తరువాత వచ్చిన నల్లపురెడ్డి ప్రస న్నకుమార్‌రెడ్డి ధన దాహంతో రూ.1500 కోట్లు అక్రమంగా సంపాదిం చుకున్నాడు. ఇప్పటికి రాష్ట్రంలో సంక్షే మం అందని వారు 60 శాతం మంది ఉన్నాడు.

- పోలంరెడ్డి దినేష్ రెడ్డి, కోవూరు టీడీపీ ఇన్‌చార్జి

జాయింట్ కలెక్టర్ బదిలీ

• నూతన జేసీగా ఆదర్శ్ రాజేంద్రన్

నెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ బదిలీ అయ్యారు. ఆయనను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 ఆగస్టులో జేసీగా వచ్చిన కూర్మనాథ్ 18 నెలలపాటు జిల్లాలో పనిచేశారు. నూతన జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్‌ను నియమించారు. ఆయన ప్రస్తుతం నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. కాగా, జేసీ ఆకస్మిక బదిలీ ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాం శంగా మారింది.

సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా శ్రీనివాసరెడ్డి


డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 28 : సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా శ్రీనివాసరెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా మంగళగిరి అటవీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయనను ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు బదిలీ చేసింది. సోషల్ ఫారెస్ట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న రేంజర్లు, ఉద్యోగులు శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాలో ఎస్‌ఐలకు స్థానచలనం

నెల్లూరు (క్రైం) : ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లావ్యాప్తంగా పలువురు ఎస్‌ఐలను బదిలీ చేయడంతోపాటు వీఆర్‌లో ఉన్న వారికి స్టేషన్లను కేటాయిస్తూ ఎస్పీ కె తిరుమలేశ్వరరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎం శివ నాంచారయ్య	వీఆర్, నెల్లూరు	కేపీ పోర్టు
ఎస్కే రహముత్తుల్లా	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
డి రామకృష్ణ	వీఆర్, నెల్లూరు	పొదలకూరు
జి కిరణ్‌బాబు	వీఆర్, నెల్లూరు	సంతపేట
బి మహేంద్ర	బుచ్చిరెడ్డిపాలెం	సీసీఎస్
టి భవాణి	వీఆర్, నెల్లూరు	వేదాయపాలెం
జి ఏడుకొండలు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
ఎస్ నరహరి	వీఆర్, నెల్లూరు	దర్గామిట్ట
డి కిషోర్‌బాబు	వీఆర్, నెల్లూరు	నార్త్ ట్రాఫిక్
వి సుబ్బారావు	వీఆర్, నెల్లూరు	నెల్లూరు రూరల్
ఎమ్ రాజ	వీఆర్, నెల్లూరు	విడవలూరు
సీహెచ్ చంద్రవతి	వీఆర్, నెల్లూరు	నవాబుపేట
జి అరుణజ్యోతి	వీఆర్, నెల్లూరు	దర్గామిట్ట
బి రమేష్‌బాబు	దర్గామిట్ట	డీటీసీ
డి సుబ్రమణ్యం	దర్గామిట్ట	డీటీసీ
ఎమ్ కోటేశ్వరరావు	వీఆర్ నెల్లూరు	పీసీఆర్
టి వెంకటరావు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
పి వెంకటేశ్వర్లు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
పి సుబ్బారావు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
టి పెంచలయ్య	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
ఎమ్ జోజి	వీఆర్, నెల్లూరు	నవాబుపేట
వి వెంకటరావు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
విఆర్‌కె మూర్తి	వీఆర్, నెల్లూరు	ఎస్‌హెచ్ స్క్వాడ్
బి మధుసూదనరావు	వీఆర్, నెల్లూరు	డిసీఆర్‌బి
బి మణిక్యరావు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
ఎమ్ శ్రీనివాసులు	వీఆర్, నెల్లూరు	కావలి-2
వి భాష్కరరావు	వీఆర్, నెల్లూరు	ఆత్మకూరు
జె జనార్ధనరావు	వీఆర్, నెల్లూరు	డీటీసీ
కె నాగేశ్వరరావు	వీఆర్, నెల్లూరు	సంతపేట
వి రాంబాబు	వీఆర్, నెల్లూరు	ఉదయగిరి
ఐ రమాదేవి	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
కె వెంకటనరసారాజు	వీఆర్, నెల్లూరు	రాపూరు
డిఎస్ విజయకుమార్	వీఆర్, నెల్లూరు	సైదాపురం

రా.. కదలిరా.. సభకు తరలిన టీడీపీ శ్రేణులు



ఉదయగిరి : జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న బయ్యన్న



చేజర్ల నుంచి...



కావలి టీడీపీ కార్యాలయం నుంచి రా...కదిలిరా సభకు బయలుదేరుతున్న టీడీపీ శ్రేణులు



సంగం నుంచి...



వింజమూరు నుంచి తరలిన కార్యకర్తలు

ఉదయగిరి రూరల్, జనవరి 28: నెల్లూరు ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన రా.. కదలిరా సభకు ఉదయగిరి, దుత్తలూరు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఉదయగిరి మండల వాహనాలకు మండల కన్వీనర్ సీహెచ్ బయ్యన్న జెండా ఊపి ప్రారంభించారు.

చేజర్ల : నెల్లూరు సభకు మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నాయకులు వేలూరు కేశవచౌదరి, మోదేపల్లి పెంచలనాయుడు, హజరత్, శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో నాగులవెల్లటూరు, చిత్తలూరు, చేజర్ల, కొట్టాలు, కాకివాయి, గొల్లపల్లి, ఏటూరు, ఏటూరుకండ్రిక తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

సంగం : మండలంలోని గ్రామాల నుంచి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన సభకు ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఆటోలు, కార్లలో నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బయలుదేరి వెళ్లారు.

వింజమూరు : నెల్లూరులో నిర్వహించిన టీడీపీ సభకు మండలంలోని పార్టీ కార్యాలయం నుంచి ఆదివారం ఉదయం పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఉదయగిరి ఇన్‌చార్జ్ బొల్లినేని రామారావు ఆదేశాల మేరకు కార్యకర్తలను తరలించినట్లు మండల అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి తెలిపారు.

కావలి : నెల్లూరులో ఆదివారం నిర్వహించిన రా... కదిలిరా సభకు కావలి నుంచి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైకో పోవాలి.. సైకిల్ రావాలనింటూ నినాదాలు చేస్తూ ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబూరావు, మొగిలి కల్లయ్య, దావులూరి దేవకుమార్, తోట వెంకటేశ్వర్లు, ఉప్పాల మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : నెల్లూరులో నిర్వహించిన రా.. కదలిరా.. సభకు అల్లూరు మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు ఆదివారం స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. స్థానిక సీనియర్ నేత బీద గిరిధర్ నేతృత్వంలో ఏ గ్రామాల నుంచి ఆ గ్రామ నాయకులు ఆధ్వర్యంలో ఆటోలు, మ్యాజిక్ వ్యాన్లు, కార్లు, ద్విచక్ర వాహనాలపై భారీగా తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. తమ అధినాయకుడు తరలి వస్తున్న వేళ తామంతా ఏకతాటిపైకి వచ్చి ఎవరి బాధ్యతగా వారు తమ కేడర్‌ను తరలించి తమ బలాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు చాలా ఉత్సాహంగా తరలి వెళ్లారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

ఆత్మకూరు, జనవరి 28 : ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) ఆధ్వర్యంలో ఏపీ ఎస్పీడీసీఎల్ సంస్థ విద్యుత్ సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు ఆత్మకూరు విద్యుత్‌శాఖ డీఈఈ బీ జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయం, అవసరాలు, రిటైల్ ధరల మేరకు విద్యుత్ చార్జీలు తదితర అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ప్రజల అభిప్రాయాలు తెలుపవచ్చని ఆయన పేర్కొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

సంగం, జనవరి 28: బెజవాడ పాపిరెడ్డి కాలువ (కావలి కాలువ) కింద జలదంకి మండలంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను కోరారు. ఆదివారం ఆయన రైతులతో కలిసి సంగం వద్ద ఉన్న బెజవాడ పాపిరెడ్డి కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ను పరిశీలించారు. నీటి విడుదలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జలదంకి వైసీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సోమశిలలో 26.547 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, జనవరి 28: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 26.547 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2350, ఉత్తరకాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి రూరల్, జనవరి 28: మండలంలోని వెంగళరావునగర్‌లో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీల విజేతలకు ఆదివారం నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో మొత్తం 28 జట్లు తలపడ్డాయి. ఫైనల్‌లో విన్నర్‌గా నాగార్జున, రన్నర్‌గా కిశోర్ లెవన్స్ జట్లు నిలిచాయి. విన్నర్‌కు కాకర్ల చారిటబుల్ ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ రూ.20,116లు, రన్నర్‌కు బీజేపీ నాయకులు ముడమాల రమేష్‌రెడ్డి రూ.15,116లు నగదు, ట్రోఫీలు అందజేశారు. అలాగే గండిపాళెం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మతులకు రమేష్‌రెడ్డి రూ.5 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్ రియాజ్, రాపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 28: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయం ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి పల్లకీసేవ చేపట్టారు. నెల్లూరుకు చెందిన వై.లావణ్య బృందం అన్నమాచార్య కీర్తనలు ఆలకించారు. కార్యక్రమంలో ఈవో ఉషశ్రీ, ఉప ప్రధాన అర్చకులు బీపెద్దభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రాజకీయ సభగా ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం

- గెలిపిస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తా : రాంకుమార్

కలువాయి, జనవరి 28: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన వైయస్ఆర్ ఆసరా నాల్గవ విడత సంబరాలు ఆద్యంతం రాజకీయ సభను తలపించింది. ఈసారి మాత్రం అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సమయం కావడంతో హాజరైన మహిళలకు తాగునీరు, భోజన వసతి ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మండలంలోని 7,119 మంది మహిళలకు ప్రభుత్వం రూ.4.77కోట్ల చెక్కును కలువాయి మండల సమాఖ్య సభ్యులకు అందచేసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో వైసీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై కూడా విమర్శలు చేయడంతో ఆసరా సభ రాజకీయ సభగా మారింది. సభ ముగియడంతో మహిళలంతా ఒక్కసారిగా భోజనాల వద్దకు వెళ్లడంతో అక్కడ తోపులాట జరిగింది. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జడ్పీటీసీ బీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, సర్పంచు పెంచలమ్మ, వైసీపీ మండల కన్వీనర్ మాకిరెడ్డి కృష్ణారెడ్డి, చల్లా సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పొదుపు మహిళలకు చెక్కు అందచేస్తున్న రాంకుమార్‌రెడ్డి

వింజమూరు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఆత్మకూరు, జనవరి 28: ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలను కలుపుతూ ఆత్మకూరు నుంచి వింజమూరు వరకు ఉన్న రోడ్డును రూ. 9 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు సమీపంలోని నెల్లూరుపాళెం వద్ద రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆయన ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్లు డాక్టర్ కెవి శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తదితరులు

వాక్కు శుద్ధి కలవారే బ్రహ్మజ్ఞాని

వింజమూరు, జనవరి 28 : వాక్కు శుద్ధి కలవారే బ్రహ్మజ్ఞాని అని పుత్తూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ రవిరాజ్ అన్నారు. వింజమూరులోని శ్రీ వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన వాక్కు శుద్ధి ద్వారా మాత్రమే జ్ఞానం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అఖండమైన ధ్యాన సాధన ద్వారా వాక్కు శుద్ధి పెంపొందించుకోవాలన్నారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యతను గురించి తెలియజేస్తూ కరపత్రాలు పంచుతూ, నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, రవిచంద్ర, మహేశ్వర, హజరత్, తిరుపతిరావుఆచారి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యానులు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

అక్రమ కట్టడాలకు అడ్డేది?

కావలి, జనవరి 28: కావలి పట్టణ నడిబొడున ఏరియా వైద్యశాల పక్కన ఒక వ్యాపార దుకాణం రోడ్డు మీదకు వచ్చేలా అక్రబ నిర్మాణం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. పక్కన ఉన్న ఏరియా వైద్యశాల ప్రహరీ దాటి రెండడుగులు ముందుకు నిర్మాణం జరుగుతున్నా అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారే కానీ దానిని నిరోధించలేకపోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావటం లేదు. నిత్యం ప్రజలు, అధికారులు తిరిగే చోటే ఇలా రోడ్డుపైకి కట్టడాలు వస్తున్నా పట్టించుకోవడం లేదంటే ఇక పట్టణంలో సందులు, గొందుల్లో ఎలా నిర్మాణాలు జరిగినా అడిగే వారు లేరని తెలుస్తోంది. వాస్తవంగా పట్టణంలో ఉన్న ప్రధాన ట్రంకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపార దుకాణాలు వెలసి ఉన్నాయి. అయితే వారు వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని పార్కింగ్‌కు స్థలం వదిలితేనే మున్సిపాల్టీ అనుమతులు ఇవ్వాల్సి ఉంది. వినియోగదారులు సంగతి అలా ఉంచి వ్యాపార దుకాణ యజమానులు కూడా తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు స్థలం వదలక పోవటంతో వారి వాహనాలు నిత్యం రోడ్డుపైనే ఉంటున్నాయి. వాస్తవంగా వినియోగదారులు వాహనాలు వస్తువులు కొనుగోలు చేసుకునే వరకే రోడ్డు మీద పార్కింగ్ చేసి తర్వాత వాటిని తీసుకు వెళ్లతారు. కానీ దుకాణాల యజమానుల వాహనాలు ఉదయం దుకాణం తీసినది మొదలు రాత్రి మూసే వరకు రోడ్డు మీదనే పార్కింగ్ చేసి ఉండటంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో వ్యాపార దుకాణదారులు తమ వాహనాలకైనా పార్కింగ్ ఉండే విధంగా నిర్మాణాలు చేసుకోవాల్సింది పోయి రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవటం దారుణం.



ఏరియా వైద్యశాల ప్రహరీ దాటి 2 అడుగులు ముందుకు వచ్చి నిర్మిస్తున్న దుకాణం

పరిశీలించి నిర్మాణం వెనుకకు జరిపిస్తాం

రోడ్డు మీదకు వచ్చి జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించి వాటిని వెనుకకు జరిపి నిర్మాణాలు జరిగేట్లుగా చర్యలు చేపడతాం.

\- బాబూరావు, పట్టణ ప్రణాళిక అధికారి, కావలి

అంతర్జాతీయ విలువిద్య పోటీలకు మణిదీప్‌రెడ్డి

లింగసముద్రం, జనవరి 28 : అమెరికాలో జరిగే అంతర్జాతీయ విలువిద్య పోటీలకు లింగసముద్రంకు చెందిన గొర్రెపాటి మణిదీప్‌రెడ్డి ఎన్నికయ్యాడు. ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే మెగా షూట్‌లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ జట్టులో మణిదీప్‌రెడ్డి స్థానం సంపాదించాడు. లింగసముద్రం పంచాయతీ వాకమళ్లవారిపాలెంకు చెందిన మణిదీప్‌రెడ్డి గత డిసెంబరు నెలలో పంజాబ్‌లో జరిగిన ఆల్ ఇండియా యూనివర్శిటీ చాంపియన్‌షిప్ పోటీల్లో కృష్ణా యూనివర్శిటీ నుంచి పాల్గొన్నాడు. జనవరి 4 నుంచి 6వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీలలో పాల్గొని ఎన్ఆర్‌ఐటీకి క్వాలిఫై అయ్యాడు. మణిదీప్‌రెడ్డిని ప్రోత్సహిస్తున్న రామయ్య ఫౌండేషన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉన్నం నళినీదేవి, హరిబాబు దంపతులకు మణిదీప్ తల్లిదండ్రులు విజయభాస్కర్‌రెడ్డి, పార్వతిలు కృతజ్ఞతలు తెలిపారు.



విలువిద్య పోటీలకు ఎంపికైన మణిదీప్‌రెడ్డి

ఈవీఎంలను వ్యతిరేకిస్తూ 31న ఢిల్లీలో ధర్నా

కందుకూరు, జనవరి 28: భారత్ ముక్తి మోర్చా ఆధ్వర్యంలో ఈవీఎంలను వ్యతిరేకిస్తూ ఈనెల 31న ఢిల్లీలోని ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీఎంఎం జిల్లా అధ్యక్షుడు జహీర్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో ఈవీఎంలు వద్దు బ్యాలెట్ పేపరే ముద్దు నినాదంతో గోడపత్రికను ఆవిష్కరించారు. కొప్పోలు ధనుంజయరావు, ఫైరోజ్, మెండా నాగరాజు, మోహన్ పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

వలేటివారిపాలెం : వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో బాంసెఫ్ నాయకులు ఆదివారం బాంసెఫ్ గోడపత్రికను ఆవిష్కరించారు. భారత్ ముక్తి మోర్చా అధ్యక్షుడు గడ్డం వెంకట్రావు మాట్లాడుతూ భారత్ ముక్తి మోర్చా జాతీయ అధ్యక్షుడు వామన్‌మేశ్రా పిలుపు మేరకు ఈ నెల 31న ఢిల్లీలో ఈవీఎంలతో మోసాలపై ధర్నా జరుగుతుందని చెప్పారు. నాయకులు పురుషోత్తం, అనిల్ కుమార్, కూడలి భాస్కర్‌రావు, సాదు చెన్నకేశవులు, మాధవరావు, కనకాద్రి, చైతన్య కిరణ్, ప్రసాద్, మోహన్, సన్ని తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

5న బీటీఏ ఆధ్వర్యంలో చలో విజయవాడ

కందుకూరు, జనవరి 28: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.మోహనరావు కోరారు. ఆదివారం స్థానిక బీటీ ఏ డివిజన్ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీటీఏ నాయకులు మేడికొండ భాస్కరరావు, దార్ల కోటేశ్వరరావు, సీహెచ్‌పీ బ్రహ్మయ్య, ఎం. రమణయ్య, పున్నేపల్లి శ్రీనివాసరావు, కసుకుర్తి అంజయ్య, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కళ్లగుంట యలమంద, ధన్యాసి కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, రమణయ్య, పులి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీటీఏ నాయకులు

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

- ఐఎంఏ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

కావలిటౌన్, జనవరి 28: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఐఎంఏ గౌరవ సలహాదారుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ చించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కావలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ముందుగా యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు శ్రీదేవిని సత్కరించారు. ఐఎంఏ గౌరవ సలహాదారుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ క్విజ్ పోటీల వల్ల విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మతను వెలికి తీయవచ్చన్నారు. ఐఎంఏ కావలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె సుబ్బారావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లుకోధర్, డైరెక్టర్లు వెంకయ్య, నందనవనం మధుసూదన్‌రావు, జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పాపిశెట్టి జానకిరామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర నేత శ్రీదేవి

వీరభద్రయ్య స్వామికి గ్రామోత్సవం

కావలి రూరల్, జనవరి 28: కావలి పట్టణం బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో వెలసిన మడియాల్ వీరభద్రయ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి వాహనంలో కొలువుదీర్చి బాలక్రిష్ణారెడ్డి నగర్ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం చాకలి రేవు బండను పసుపు, కుంకుమతో పూజించి పొంగళ్లు నైవేద్యాలుగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని రజకులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గ్రామోత్సవంలో వీరభద్రయ్య స్వామి

పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం

కావలిటౌన్, జనవరి 28: పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముందుంటామని పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రభాకర్‌నాయుడు ఆసుపత్రిలో ఉచిత మెగా లివర్ స్క్రీనింగ్ పరీక్షలు, కాలేయ వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ ప్రభాకర్ నా యుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రంలో సుగుణమ్మ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అందుబాటులో లేని ఖరీదైన లివర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిపుణులు డాక్టర్ రజనీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అనేక మంది లివర్ వ్యాధిగ్రస్థులుగా మారుతున్నారని, ప్రధానంగా లివర్ కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో చెన్నై గ్లెనిగల్స్ హెల్త్ సిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ హాలీమౌలాలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పసుపులేటి సుగుణమ్మ



నెల్లూరు : ఎమ్మెల్యే ఆనం, మాలేపాటిలతో పసుపులేటి సుధాకర్

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుకై నేటి నుంచి న్యాయవాదుల రిలే దీక్షలు

కందుకూరు, జనవరి 28: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలకు సిద్ధమైనట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్లపల్లి మల్లికార్జునరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్న క్రమంలో న్యాయవాదులు సోమవారం నుంచి కోర్టు విధులను బహిష్కరించి స్థానిక కోర్టు కాంప్లెక్స్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాలకు అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

బాలికపై అత్యాచార యత్నం

లింగసముద్రం, జనవరి 28 : మానసిక దివ్యాంగురాలైన 12 ఏళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మధ్యాహ్నం లింగసముద్రంలో జరిగింది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లిన బాలిక ఎంతసేపటికీ రాకపోవడంతో ఆ బాలిక తల్లి గాలింపు చేపట్టింది. ఇంతలో వృద్ధుడి నుంచి తప్పించుకున్న ఆ బాలిక ఓ ఇంట్లో నుంచి ఏడుస్తూ వచ్చి జరిగిన విషయాన్ని తల్లికి చెప్పింది. దీంతో తల్లి, వారి బంధువుతో కలసి ఆ వ్యక్తిని నిలదీయగా వారి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో బాలిక తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు సంఘటన జరిగిన ఇంటిని పరిశీలించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆయన వెంట వలేటివారిపాలెం ఎస్సై మహేంద్రనాయక్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, జనవరి 28 : మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఏ మల్లికార్జున, సిబ్బంది ఆదివారం ఉదయం దాడులు చేసి మన్నేరులో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కావలిటౌన్, జనవరి 28: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆదివారం పాతూరు కృష్ణుడి ఆలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.బ్రహ్మానందం, రాష్ట్ర కౌన్సిలర్ వింతా రంగారెడ్డి, వైసీపీ నాయకులు జనిగర్ల మహేంద్ర యాదవ్‌లు పాల్గొని కేంద్ర పథకాలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, మంద కిరణ్, నవీంద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఎస్ఐగా ఆనంద్‌భాస్కర్

కందుకూరు, జనవరి 28: కందుకూరు పట్టణ ఎస్ఐ హనీఫ్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో నెల్లూరు దిశ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా ఉన్న ఆనంద్‌భాస్కర్‌ను పట్టణ ఎస్ఐగా నియమించారు. హనీఫ్ కందుకూరు పట్టణ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కొద్దినెలకే ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల కూడా ఆయన న్యాయం చేయాలన్న భావనతో కాకుండా అధికారం చెలాయించి డ బ్బు వసూలు చేసుకోవడం, సెటిల్‌మెంట్లు చేయడం లాం టి పలు ఆరోపణలు వచ్చాయి. ఇటీవల సంక్రాంతి పర్వది నం సందర్భంగా కూడా పేకాట, ఇతర జూదరులను పట్టుకున్న సమయంలో చేతివాటం చూయించారన్న విమర్శలపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విచారించిన ఉన్నతాధికారులు ఆయనను వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

బిట్రగుంట, జనవరి 28: గణతంత్ర దినోత్సవం రోజున అవార్డు అందుకున్న ముగ్గరు వాకర్స్ సభ్యులు డాక్టర్ కొర్రాచంద్రశేఖర్, మాజీ సైనికుడు వై.విజయప్రతాప్‌రెడ్డి, కానిస్టేబుల్ గుత్తి ప్రభాకర్‌లను బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు శశికుమార్, గౌరవ అధ్యక్షుడు ఏకే.సుందర్‌రాజ్, సభ్యులు కే.శ్రీనివాసులు, సత్యనారాయణాచార్యులు, శ్యాంసుధాకర్, బర్నాడ్, రవికాత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తూపిరి పెంచలయ్యకు నివాళి

బిట్రగుంట, జనవరి 28: ప్రజా నాయకుడు తూపిరి పెంచలయ్యకు కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. రెండు సార్లు బోగోలు సర్పంచుగా పనిచేసిన ఆయన ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆదివారం బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు పీ.శ్రీరాములు, పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎస్. మాల్యాద్రి, మాజీ సర్పంచు అంకులయ్య, వైసీపీ నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీరెడ్డి, మా చర్ల, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు : ఎమ్మెల్యే

దగదర్తి(బిట్రగుంట), జనవరి 28: ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం పలు కార్యాలయాలను ఏర్పాటు చేసిందిని కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. దగదర్తి మండలం దుండిగంలో నూతన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎంపీపీ తాళ్లూరి వెంకటకృష్ణ ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచు బాలయ్య నాయుడు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనిల్, మండల యువత అధ్యక్షుడు మహేష్‌నాయుడు, ఎంపీటీసీలు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.